nindam.in
తెలుగు దినపత్రిక
# నినాదం
నిఖార్సైన జర్నలిజం
బుధవారం, మే 27, 2026 | సంపుటి - 22 | సంచిక 238 | వెల - 7రూ | పేజీలు - 12 - 8

## శుద్ధి యురేనియం అప్పగించాల్సిందే

### ఇరాన్‌తో చర్చలపై తాజాగా ట్రంప్ వెల్లడి



వాషింగ్టన్, నినాదం: అమెరికా-ఇరాన్ మధ్య జరుగుతున్న శాంతి చర్చల్లో అణు కార్యక్రమం కీలకాంశంగా మారింది. శుద్ధి చేసిన యురేని యంను వదులు కోవాలని అమె రికా కోరుతుండగా ఇరాన్ పూర్తిగా అంగీక రించడంలేదు. ఇరాన్ అణు కార్యక్రమంపై అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు.

2లో

## మహిళల భద్రత, గౌరవానికి ప్రాధాన్యం

**సంపద సృష్టించే శక్తిగా మహిళలకు ప్రోత్సాహం**

**సఖి నివాస్ వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ప్రారంభించిన సీతక్క**



2

హైదరాబాద్, మే 26 నినాదం: మహిళల భద్రత, వారి గౌరవానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభి వృద్ధి, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క చెప్పారు.



**సర్వే పూర్తయిన ఇళ్లకు ప్రత్యేక లోగో స్టిక్కర్లు**

## ఇంటింటి సర్వేతో కుటుంబ జీవిత బీమా

### భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం

హైదరాబాద్, మే 26 నినాదం: రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా ప్రణాళిక కార్యక్రమం విజయవంతం కావడంతో, దాని ముగింపు వేడుకలను పురస్కరించుకుని జూన్ 2 నుండి 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించాలని కెబినెట్ సబ్ కమిటి అధికారులను ఆదేశించింది. మంగళవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటి సమావేశం జరిగింది. ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం లో మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలు పాల్గొన్నారు. గ్రామ సభ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ఇప్పటివరకు నిర్వహించిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాల ప్రగతిని సమీక్షించిన కేబినెట్ సబ్ కమిటి రాబోయే రోజుల్లో ప్రజా భాగస్వామ్యంతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగా జూన్ 2 నుండి 12 వరకు నిర్వాహించాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. తరువాయి 2లో



## తెలంగాణలో అవినీతి రాజ్యం

### అడ్డంగా దోచుకుంటున్న కాంగ్రెస్

- శంశాబాద్‌లో 180 ఎకరాలు హాంఫట్
- సింగరేణిలో కోట్ల రూపాయాల బొగ్గు మాయం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్ రావు సంచలన ఆరోపణలు

హైదరాబాద్, మే 26 నినాదం: తెలంగాణలో అవినీతి రాజ్యం నడుస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. భూములు ఆక్రమణలు, రెవెన్యూలో వేలకోట్ల స్కామ్‌లు, సింగరేణిలో బొగ్గు స్మకమాలు జరుగుతున్నాయని అన్నారు. అడ్డంగా దోచు కుంటున్నారని కాంగ్రెస్‌పై ఆయన విరుచుకు పడ్డారు. శంషాబాద్ సమీపంలోని 180 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. ఈ స్కాంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నిహితుడి పాత్ర ఉందని ఆరోపించారు.

తరువాయి 2లో



2

## చొరబాటు దారులూ పారిపోండి

**వెళ్లగొట్టక ముందే పారిపోతే మంచిది**

**జైల్లో పెట్టి తిండి పెట్టేది లేదు**

**బంగ్లాదేశ్ వలసదారులకు సిఎం సువేందు హెచ్చరిక**

**సరిహద్దుల వద్దకు చేరుకుంటున్న అక్రమవసలదారులు**

కోల్‌కతా, నినాదం: పశ్చిమ బెంగాల్‌లో ఉంటున్న బంగ్లాదేశ్ అక్రమ వలసదారులపై చర్యలను సువేందు అధికారి ప్రభుత్వం ముమ్మరం చేసింది.

## మజ్లిస్ ఒత్తిడితోనే జిహెచ్‌ఎంసి విభజన



- నగరంలో మంచినీటి సమస్యను పట్టించుకోని ప్రభుత్వం
- తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపణ

హైదరాబాద్, మే 26 నినాదం: కేసీఆర్ హయాంలో కూడా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో మోసం చేశారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు కూడా హైదరాబాద్‌లోని పేద ప్రజలకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. మజ్లిస్ ఒత్తిడితో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు ముక్కలు చేశారని రామచందర్‌రావు దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో డివిజన్ల ఏర్పాటుపై ఇప్పటికీ అధికారులకు ఒక క్లారిటీ లేదని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లపేరుతో ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తోందని మతీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2లో

## యూరియా సరఫరాలో కేంద్రం విఫలం

### యుద్ధ ప్రభావంతోనూ సరఫరాలో అంతరాయం

### రైతులు పంట వ్యర్థాలను తగులబెట్టవద్దు

### మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి



హైదరాబాద్ , మే 26 నినాదం: యూరియా సరఫరా విషయంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోమారు ఆరోపిం చారు. యుద్ధ ప్రభావంతో యూరియా సరఫరాలో అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందే కేంద్రాన్ని పలుమార్లు కోరినా సరఫరా సమస్య కొనసాగుతోందన్నారు. యూరియా సరఫరా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంటుందని చెప్పారు. ఇకపోతే రైతులు పంట వ్యర్థాలను కాల్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి తుమ్మల సూచించారు. పంట వ్యర్థాలను తగలబెట్టడం రైతుల భవిష్యత్తుకే ప్రమాదమని ఆయన హెచ్చరించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం పూర్తిగా దెబ్బతింటు ందని, నేలలోని పోషకాలు తగ్గిపోవడంతో యూరియా, పురుగుమందుల ప్రభావం కూడా తగ్గిపోతుందని మంత్రి తెలిపారు. అందువల్ల పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలియదున్నాలని రైతులకు సూచించారు. రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు అందజేస్తామని మంత్రి వెల్లడించారు. 2లో

## దేశవ్యాప్తంగా అజ్ఞాతంలో మరో 47 మంది మావోలు



**తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు కేవలం నలుగురే**

**పోలీసులకు లొంగిన నరహరి,ధనమ్మ జంటకు చెక్కులు అందచేత**

**గణపతి తదితరులు కూడా వెంటనే లొంగిపోవాలి**

### డిజిపి సివి ఆనంద్ పిలుపు

హైదరాబాద్, మే 26 నినాదం : మావోయిస్టు పార్టీలో నాలుగున్నర దశాబ్దాల పాటు పసునూరి నరహరి అలియాస్ సంతోష్ పని చేశారని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్ లోని డీజీపీ కార్యాలయంలో మీడియా ఎదుట నరహరితోపాటు ఆయన భార్య ధనమ్మను తెలంగాణ పోలీసులు ప్రవేశపెట్టారు. తరువాయి 2లో

## లిక్కర్ కేసులో అన్ని ఆధారాలు సమర్పించాం

**మాదంతా చట్టబద్ధమైన సంపాదనే**

**ఎపి సిట్ కక్షపూరిత కేసులు పెడుతోంది**

**న్యాయబద్ధంగానే కేసులను ఎదుర్కొంటాం**

**చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు మోహిత్ రెడ్డి**

అమరావతి, మే 26 నినాదం : ఏపీ లిక్కర్ స్కాంలో ఈడీ విచారణ అనంతరం వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు మోహిత్ రెడ్డి స్పందించారు. ఏపీ సిట్ కక్షపూరితంగా తమపై కేసులు నమోదు చేసిందని ఆరోపించారు. అయితే ఆ కేసులను న్యాయపరంగానే ఎదుర్కొంటామని చెప్పారు. ఈడీ అధికారులు అడిగిన అన్ని ఆస్తుల వివరాలనూ అందజేశామని తెలిపారు. 2లో



## రాష్ట్రంలో 'ఫార్మ్ టు హోమ్' విధానం

**రైతుల నుంచి నేరుగా ప్రజలకు ఉత్పత్తులు**

**అధికారులను ఆదేశించిన సిఎం చంద్రబాబు**

అమరావతి, మే 26 నినాదం: రాష్ట్రంలో 'ఫార్మ్ టు హోమ్' విధానాన్ని అమలు చేయాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు చేరేలా కొత్త మార్కెటింగ్ వ్యూహాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల రైతులకు మెరుగైన ధరలు లభించడంతో పాటు మధ్యవర్తుల ప్రభావం తగ్గుతుందని చెప్పారు. వ్యవసాయ అనుబంధ రంగాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వ్యవసాయం, ఆక్వా, పశు సంవర్ధక రంగాలను మరింత బలోపేతం చేసే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా దేవరపల్లి మండలం యడవోలు సమీపంలో 'కోకో సిటీ' ఏర్పాటు చేయనున్నట్లు సీఎం వెల్లడించారు. అలాగే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు జులై నెలలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కడప జిల్లా పులివెందులలో నిర్మాణంలో ఉన్న ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను మంజూరు చేసినట్లు సీఎం పేర్కొన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత పరిశీలనకు ఈ ల్యాబ్ ఉపయోగ పడుతుందని తెలిపారు. ఆక్వా రంగానికి ప్రోత్సాహంగా కొత్త ఆక్వా కనెక్షన్లకూ విద్యుత్ సబ్సిడీ వర్తింపజేయనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. అలాగే మత్స్యకారుల సంక్షేమం కోసం 200 మెకనైజ్డ్ బోట్ల 2లో

## దేశంలో అసహజ జనాభా మార్పు



### ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు

### హోంమంత్రి అమిత్ షా వెల్లడి

న్యూఢిల్లీ, నినాదం : అక్రమ వలసలు, ఇతర కారణాలతో దేశంలో చోటుచేసుకుంటున్న 'అసహజ జనాభా మార్పు'పై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్టు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ 2025 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చేసిన ప్రకటనకు అనుగుణంగా ఈ కమిటీని ఏర్పాటు చేసినట్టు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. ఈ కమిటీకి రిటైర్డ్ జడ్జి ప్రకాష్ ప్రభాకర్ నావోలేకర్ అధ్యక్షత వహిస్తారని, మాజీ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా 2లో

# శుద్ధి యురేనియం అప్పగించాల్సిందే

ఇరాన్ వద్ద ఉన్న అధికంగా శుద్ధి చేసిన యురేనియంను అమెరికాకు అప్పగించాలని, లేదంటే అంతర్జాతీయ పర్యవేక్షణలో పూర్తిగా ధ్వంసం చేయాలని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యక్రమం ప్రపంచ దేశాలకు ముప్పుగా మారే అవకాశముందని ట్రంప్ హెచ్చరించారు. అధిక శుద్ధి చేసిన యురేనియం ద్వారా అణ్వాయుధాల తయారీ సాధ్యమవుతుందని, అందుకే దీనిపై కఠిన చర్యలు అవసరమని పేర్కొన్నారు. అమెరికా జాతీయ భద్రతను కాపాడేందుకు అవసరమైతే మరింత కఠిన నిర్ణయాలు తీసుకుంటామని కూడా చెప్పారు . కాగా, తమ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ అంగీకరించినట్టు వార్తలు వస్తున్నాయి. తాము అణ్వాయుధం కోసం వెంపర్లాడడం లేదని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఇరాన్ శుద్ధి చేసిన ఆ యురేనియాన్ని అమెరికాకు అప్పగించాలని లేకపోతే నాశనం చేయాలని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ట్రూత్‌లో పోస్ట్ పెట్టారు. శుద్ధి చేసిన యురేనియంను నిర్వీర్యం చేసేందుకు అమెరికాకు అప్పగించాలి. లేకపోతే అటామిక్ ఎనర్జీ కమిషన్ లేక దాని సమానస్థాయి సంస్థ ఇరాన్‌తో సమన్వయం చేసుకొని.. ఒక ఆమోదయోగ్యమైన ప్రదేశంలో దానిని నాశనం చేయాలని ట్రంప్ రాసుకొచ్చారు. తన వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ సూత్రప్రాయంగా అంగీకరించిందని ఇప్పటికే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇదిలాఉంటే.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. 70కి పైగా హెజ్‌బొల్లా స్థావరాలను టా÷-గ్గ్ం÷ట్ చేసింది. 10 కమాండ్ సెంటర్లు సహా ఆయుధ డిపోలను ధ్వంసం చేసినట్లు ఆ దేశ సైన్యం వెల్లడించింది.

# మజ్లిస్ ఒత్తిడితోనే జిహెచ్ఎంసి విభజన

రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తోందని ధ్వజమెత్తారు. మంగళవారం కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడారు. హైదరాబాద్ నగరంలో ప్రజలు నీటి సమస్యను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలకు నీటి సరఫరా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని మండిపడ్డారు. ప్రజాసమస్యలను కాంగ్రెస్ నేతలు పక్కదారి పట్టిస్తున్నారని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్‌కు మజ్లిస్ ముఖ్యం కానీ, హైదరాబాద్ ప్రజలు ముఖ్యం కాదని చెప్పుకొచ్చారు. భాగ్యనగరంలో కాలుష్య నియంత్రణలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో రియల్ ఎస్టేట్ పేరుతో జేబులు నింపుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలయ్యిందని అన్నారు. భాగ్యనగరంలో చిన్న వాన పడితే.. నగరం మునిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భాగ్యనగరాన్ని విశ్వనగరంగా బీజేపీ మాత్రమే మార్చగలదని వ్యాఖ్యానించారు. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో మజ్లిస్, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని హెచ్చరించారు. తెలంగాణలో అవినీతి రహితమైన పరిపాలనను బీజేపీ మాత్రమే అందిస్తుందని రామచందర్‌రావు పేర్కొన్నారు.

# తెలంగాణలో అవినీతి రాజ్యం

ఈ వ్యవహారంపై సిట్, సీఐడీ విచారణ జరపాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో హరీష్ రావు మాట్లాడుతూ.. ప్రైవేట్ వ్యక్తికి సదరు భూమి అప్ప జెప్పి.. తప్పు చేసిన ఎమ్మార్వోను బదిలీతో సరిపెట్టారన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి తహసీల్దారును వెంటనే డిస్మిస్ చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ స్కాం వెనుక సీసీఎల్ఏ ఉన్నాడా? కలెక్టర్ ఉన్నాడా? అంటూ హరీష్ రావు సందేహం వ్యక్తం చేశారు. ఈ భూమి ప్రభుత్వానిదని ఆర్డీవో చెబుతున్నారని చెప్పారు. పై అధికారి చెప్పినా వినకుండా.. ఎమ్మార్వో మాత్రం ఇది ప్రైవేట్ భూమి అంటున్నారని హరీష్ రావు వివరించారు. ముఖ్యమంత్రికి సన్నిహితుల నుంచి ఒత్తిడి ఉన్నందునే తహసీల్దారును బదిలీ చేసి కాపాడుతున్నారని ఆరోపించారు. సీఎం సన్నిహితుల ఒత్తిడితోనే.. ఎమ్మార్వోపై చర్యలు తీసుకోకుండా ఏసీబీ అధికారులు వెనక్కి వచ్చారని ఆరోపించారు. సింగరేణిలో రూ.16 వందల కోట్ల విలువైన బొగ్గు మాయమైందని ఆందోళన వ్యక్తం చేశారు. టన్నుల బొగ్గు ఎక్కడో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించాలని డిమాండ్ చేశారు. బొగ్గు ఉందో? లేదో? పరిశీలన కోసం అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు స్పష్టం చేశారు. 'కాంగ్రెస్ హఠావో - సింగరేణి బచావో'.. బొగ్గు గని కార్మికుల నినాదం కావాలని హరీష్‌రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ హయాంలో సింగరేణి స్కాంలకు గనిలా మారిందని అభివర్ణించారు. నైనీ బ్లాక్ బొగ్గు గనుల టెండర్.. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని బయట పెట్టిందన్నారు. త్వరలో సింగరేణిపై కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలు మరిన్ని బయటపెడతానని హరీష్‌రావు స్పష్టం చేశారు. అలాగే రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌పై వేసిన సస్పెన్షన్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ శాఖలో వేల కోట్ల రూపాయిల అవినీతి జరుగుతోందంటూ ఈ సందర్భంగా హరీష్ రావు తీవ్ర ఆరోపణలు గుప్పించారు.

# లిక్కర్ కేసులో అన్ని ఆధారాలు సమర్పించాం

విచారణకు తమవంతుగా పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు తాము సంపాదించిన ఆస్తుల వివరాలన్నింటినీ ఈడీకి సమర్పించామని మోహిత్ రెడ్డి వెల్లడించారు. తమ కుటుంబం సంపాదించిన ప్రతి రూపాయీ కష్టార్జితమే తప్ప అక్రమంగా సంపాదించలేదని స్పష్టం చేశారు. ముడుపుల సొమ్ముతో ఆస్తులు కొనుగోలు చేశారంటూ ఆరోపణలు మాత్రమే ఉన్నాయని, వాటిలో నిజం లేదన్నారు. తాము సంపాదించిన ప్రతి పైసా కష్టపడి సంపాదించిన డబ్బేనని పేర్కొన్న మోహిత్ రెడ్డి.. ఈ కేసులపై న్యాయస్థానంలో పోరాటం కొనసాగిస్తామని వెల్లడించారు. కాగా, రాష్ట్రంలో సంచలనం రేపిన లిక్కర్ స్కాం కేసులో ఈడీ విచారణను మరింత వేగవంతం చేసింది. ఈ వ్యవహారంలో మనీలాండరింగ్ ఆరోపణలపై ప్రత్యేక దృష్టి సారించిన ఈడీ.. విచారణలో భాగంగా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసుల మేరకు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి భార్యతో పాటు ఆయన కుమారుడు మోహిత్ రెడ్డి నేడు (మంగళవారం) ఈడీ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు.

# గవర్నర్‌ను కలిసిన టిఆర్ఎస్ అధినేత కవిత

## వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని వినతి

హైదరాబాద్,మే 26 : ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కోరినట్లు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత తెలిపారు. లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన అనంతరం మీడియాతో ఆమె మాట్లాడారు. వెలుగుమట్లతో పాటు వికారాబాద్ జిల్లా కడ్లాపూర్, ట్రిపుల్ ఆర్ బాధితులతో కలిసి గవర్నర్‌ను కలిశామని చెప్పారు. వెలుగుమట్లలో ఇళ్లు కోల్పోయిన బాధితులందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని కోరామన్నారు. కడ్లాపూర్‌లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు జారీ చేసిన భూసేకరణ నోటీసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పు తదితర సమస్యలపై బాధితులతో కలిసి గవర్నర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. న్యాయం జరగకపోతే మళ్లీ పోరాట బాట పడతామని కవిత చెప్పారు.

# ఇంటింటి సర్వేతో కుటుంబ జీవిత బీమా

ముఖ్యంగా 'పర్యావరణ వారోత్సవం', రోడ్డు భద్రత, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం, మహిళా-శిశు రక్షణ, గృహ నిర్మాణం, పర్యాటక ప్రోత్సాహం, పట్టణాభివృద్ధి, పునర్వినియోగ శక్తి (గ్రీన్ ఎనర్జీ) ప్రాజెక్టుల అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను నిర్వహించాలని నిర్దేశర చేశారు. ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా, అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని మంత్రులు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకం అమలుపై కేబినెట్ సబ్ కమిటీ సుదీర్ఘంగా చర్చించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తింపజేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రులు పునరుద్ఘాటించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇల్లు కవర్ అయ్యేలా సమగ్ర గృహ స్థాయి డేటా సేకరణ జరపాలి. ఒకవేళ ఎవరైనా మిగిలిపోతే వారి కోసం ప్రత్యేక శిబిరాలు (స్పెషల్ క్యాంపులు) ఏర్పాటు చేయాలి. పథకం ప్రయోజనాలు ప్రజల్లోకి తీసుకెళ్లేలా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఈ బీమా పథకానికి ఒక విశిష్టమైన 'లోగో'ను రూపకల్పన చేయనున్నారు. సర్వే పూర్తయిన ప్రతి ఇంటికి ఈ లోగోతో కూడిన స్టిక్కర్లను అతికించనున్నారు. మేరకు అన్ని శాఖలు తమ సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణ రావు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిజిపి సి.వి ఆనంద్, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేష్ రంజన్, వికాస్ రాజు, నవీన్ మిత్తల్, వాణి ప్రసాద్, దాన కిషోర్, ప్రిన్సిపల్ సెక్రటరీలు సందీప్ కుమార్ సుల్తానీయా, గౌరవ్ ఉప్పల్, తదితర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

# చొరబాటు దారులూ పారిపోండి

అక్రమవలస దారులను వారి స్వదేశానికి పంపేందుకు చర్యలు తీసుకుంటోంది. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విధంగానే బెంగాల్‌లోని అక్రమవలసదారుల పై సువేందు ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. బంగ్లాదేశీయులను వారి స్వదేశానికి పంపేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో సీఎం బెంగాల్ సీఎం సువేందు అధికారి చొరబాటుదారులకు తీవ్ర హెచ్చరికలు చేశారు. బెంగాల్ నుంచి వెళ్లగొట్టకముందే పారిపోవాలని సూచించారు. బంగ్లా ప్రజలు స్వచ్ఛందంగా వెళ్లకపోతే.. కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతమున్న విదేశీయుల చట్టానికి లోబడే తాము ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. 'ప్రభుత్వం చర్యలు తీసుకోకముందే పారిపోండి' అంటూ ముఖ్యమంత్రి తాజాగా హెచ్చరించారు. బంగ్లాదేశ్ అక్రమ వలసదారుల అంశంపై మాట్లాడుతూ, కొత్త చట్టంతో కాకుండా ప్రస్తుతం ఉన్న విదేశీయుల చట్టం కిందే ఈ చర్యలు తీసుకుంటామని చెప్పారు. తక్షణం అక్రమవలసదారులు ఈ ప్రదేశాన్ని వదిలివెళ్లాల్సిందేనని అన్నారు. తమ పౌరులను వెనక్కి తీసుకునే బాధ్యత బంగ్లాదేశ్ ప్రభుత్వంపైనే ఉందన్నారు. భారత్ నుంచి తమ పౌరులను తిరిగి స్వీకరించ డానికి సిద్ధంగా ఉన్నట్టు బంగ్లాదేశ్ ఇప్పటికే చెప్పిందని తెలిపారు. బంగ్లా అక్రమ చొరబాటుదారులను జైళ్లకు పంపవద్దని తాను పోలీసులకు ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. 'వారికి మనమెందుకు ఆతిథ్యం ఇవ్వాలని దేశ వనరులను మనం ఎందుకు దుర్వినియోగం చేయాలి. చొరబాటుదారులు ఏమైనా మన అల్లుళ్లా?' అని ప్రశ్నించారు. బంగ్లా పౌరులు స్వచ్ఛందంగా, శీఘ్రంగా వెళ్లకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, అక్రమ వలసదారులను వెనక్కి పంపించేందుకు బెంగాల్ ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేయడంతో బంగ్లాదేశీయులు స్వదేశానికి తిరుగుముఖం పడుతున్నారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని హకింపూర్ సరిహద్దు వద్ద మంగళవారం ఉదయం పెద్దఎత్తున వారు గుమిగూడారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ సమయంలోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. భారత్ నుంచి తమ పౌరులను తిరిగి స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు బంగ్లాదేశ్ ఇప్పటికే చెప్పిందని.. వారిని తిరిగి తీసుకువెళ్లడం అక్కడి ప్రభుత్వ బాధ్యత అని సువేందు పేర్కొన్నారు. చొరబాటుదారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని జైల్లో పెట్టొద్దని పోలీసులను ఆదేశించినట్లు తెలిపారు. వారికి ఆశ్రయమిచ్చి, తిండి పెట్టడానికి వారేమైనా మన బంధువులా అని ప్రశ్నించారు. బెంగాల్ ప్రభుత్వం 'గుర్తించండి, తొలగించండి, బహిష్కరించండి' అనే నినాదంతో విదేశీయులను దేశం నుంచి పంపేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే అక్రమంగా రాష్ట్రంలోకి చొరబడినట్లు గుర్తించిన వారికి, సరైన పత్రాలు లేని వారికి తాత్కాలికంగా ఆశ్రయం కల్పించడానికి నిర్బంధ కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. మాల్దాలో తొలి నిర్బంధ కేంద్రాన్ని ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు. త్వరలో మరిన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

# దేశవ్యాప్తంగా అజ్ఞాతంలో మరో 47 మంది మావోలు

మే 12వ తేదీన పోలీసుల ఎదుట నరహరి, ఆయన భార్య లొంగిపోయారు. వారిని ఈ రోజు మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. లొంగిపోయిన వారిద్దరికి రూ. 25 లక్షలు, రూ.20 లక్షలు చొప్పున డీజీపీ చెక్కులు అందజేశారు.అనంతరం డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 47 మంది మావోయిస్టులు ఇంకా అజ్ఞాతంలో ఉన్నట్లు గుర్తించామన్నారు. అందులో తెలంగాణాకి చెందిన వారు ముగ్గురు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఒకరు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు 15, జార్ఖండ్ 13, ఒడిశాకు చెందిన 15 మంది ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని వివరించారు. 2024 నుండి ఇప్పటి వరకు 822 మంది మావోయిస్టులు లొంగిపోయారని పేర్కొన్నారు. మొత్తం 334 ఆయుధాలతో వీరంతా తెలంగాణా పోలీసులు ఎదుట లొంగిపోయారని చెప్పారు. ఇక తెలంగాణా పోలీసులు ముందు లొంగిపోయిన ఒడిశాకి చెందిన మావోయిస్టులను ఆ రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించామని పేర్కొన్నారు. మన రాష్ట్రానికి చెందిన మావోయిస్టులను త్వరలో వారి ప్రాంతాలకు వెళ్లి స్వయంగా కలుస్తానని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. తెలంగాణాకు చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతితోపాటు జాడే రత్న బాయి అలియాస్ సుజాత, వార్త శేఖర్ అలియాస్ మంగు లొంగిపోవాలని ఈ సందర్భంగా వారికి డీజీపీ సీవీ ఆనంద్ విజ్ఞప్తి చేశారు. మీరు లొంగిపోతే ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని బెనిఫిట్స్‌తోపాటు సదుపాయాలు కల్పిస్తామని అజ్ఞాతంతో ఉన్న మావోయిస్టులకు డీజీపీ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. 2026, మార్చి 31వ తేదీ నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం ఆపరేషన్ కగార్ చేపట్టింది. ఈ సందర్భంగా వందల సంఖ్యలో మావోయిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. అలాగే పలువురు మావోయిస్టులను అరెస్ట్ చేశారు. మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు నిరంతరాయంగా చేపట్టిన కూంబింగ్ కారణంగా భారీ సంఖ్యలో మావోయిస్టులు మరణించారు. ఇక ప్రభుత్వం ఎదుట లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం ప్రకటించిన రివార్డులు అందజేశారు. దీంతో దేశంలో దాదాపుగా మావోయిస్టు పార్టీ ప్రాబల్యం దాదాపుగా తగ్గిపోయింది.

# ఎండల తీవ్రత మరింత పెరుగుదల

## రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక ఉష్ణోగ్రతలు

హైదరాబాద్,మే26 : ఈ ఏడాది నైరుతి రుతుపవనాల రాక మరింత ఆలస్యమయ్యే పరిస్థితులు ఉన్నట్టు వాతావరణశాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. దీంతో ఎండల తీవ్రత మరింతగా కొనసాగనుంది. వరుసగా రోహిణి రెండోరోజు కూడా ఎండలు మండుతున్నాయి. నిజానికి రుతుపవనాలు ఈనెల 26న కేరళ తీరాన్ని తాకుతాయని అంచనా వేసినప్పటికీ వాతావరణ మార్పులతో, జూన్ 5నుంచి 10 వరకు నైరుతి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉన్నదని తెలిపింది. జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో ఎల్‌నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదయ్యే సూచనలున్నట్టు హెచ్చరించింది. 20 జిల్లాల్లో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాంలో అత్యధికంగా 46.5 డిగ్రీలు, మంచిర్యాల జిల్లా దండేపల్లిలో 46.4, సూర్యాపేట జిల్లా మద్దిరాలలో 46.4, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో 46.3, ఖమ్మం జిల్లా ఏన్కూర్‌లో 46.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని తెలిపింది. రాష్ట్రంలో మరో నాలుగురోజులపాటు తీవ్రమైన ఎండలు, వడగాలులు ఉంటాయని వాతావరణశాఖ వెల్లడించింది. దీంతో ఆయా జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసినట్టు తెలిపింది.రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బ మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. ఈ క్రమంలోనే ఆదివారం ఒక్కరోజే దాదాపు 42మంది మృతి చెందారు. ఒక్క వరంగల్‌లోనే అత్యధికంగా 20మంది మృతి చెందగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10మంది, కరీంనగర్‌లో 8 మంది, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మృత్యువాతపడ్డారు. రాబోయే రోజుల్లో కూడా 43 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అధికారులు హెచ్చరించారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్నం వరకు ఎండలు దంచికొట్టగా, సాయంత్రం మాత్రం అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిశాయని వివరించింది. ముఖ్యంగా నల్లగొండ, వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసినట్టు తెలిపింది. కామారెడ్డి, మెదక్, పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో మోస్తరు వాన కురువగా, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్‌లో భారీ వర్షం కురిసినట్టు పేర్కొన్నది.

# ఖనిజాల తవ్వకం, శుద్ధిపై కీలక ఒప్పందం

## క్వాడ్ విదేశాంగ్ మంత్రలు సమావేశంలో ఎంఓయూ

న్యూఢిల్లీ,మే26 : కీలక ఖనిజాల తవ్వకం, శుద్ధి సరఫరాలను సురక్షితం చేసే ఫ్రేమ్‌వర్క్‌కు సంబంధించిన ఒప్పందంపై భారత్-అమెరికాలు సంతకాలు చేశాయి. మంగళవారం న్యూఢిల్లీలో క్వాడ్ విదేశాంగ మంత్రల సమావేశం జరిగింది. ఈ సమావేశం సందర్భంగా అమెరికా- భారత్‌ల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా ఇది చాలా సమయోచితమైన ? కీలకమైన విషయం అని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో సమక్షంలో భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. ఈ ఒప్పందం పటిష్టమైన, వైవిధ్యభరితమైన సరఫరా గొలుసులను బలోపేతం చేస్తుందని, ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు కీలక ఖనిజాలు, అరుదైన మూలకాల్ని తవ్వి తీయడానికి, వాటి నిర్వహణకు కీలకమని విదేశాంగ మంత్రి జైశంకర్ తెలిపారు. ఎన్నో సవాళ్లు, అదే సమయంలో ఎన్నో అవకాశాలు ఉన్న ఈ ప్రపంచంలో భారత్ ? అమెరికాల మధ్య ఉన్న సహకారం ఎంత సన్నిహితంగా ఉందో చెప్పడానికి ఇది మరో నిదర్శనం అని ఆయన అన్నారు. ఇక మార్క్ మాట్లాడుతూ.. రూబియో అమెరికా ? భారతదేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యం.. అది ఇరు దేశాల జాతీయ ప్రయోజనాలకు ముఖ్యమైనదని ఆయన అన్నారు. మన ఆవిష్కరణ ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమైన కీలక ఖనిజాలు, సరఫరా గొలుసులకు ఇది దీర్ఘకాలిక విశ్వసనీయతనిస్తుంది. ఈ ఒప్పందంలో ఇరు దేశాలు వ్యూహాత్మక ప్రయోజనాలు ఉన్నాయి. క్రిటికల్ మినరల్స్ ఫోరమ్‌లో ఫిబ్రవరి 4వ తేదీన భారత్ చేరినప్పుడే ఈ ఒప్పందానికి పునాది పడిందది' అని రూబియో తెలిపారు.

# అమెరికాలో కాల్పుల ఘటన

## సూపర్ మార్కెట్‌లో కాల్పుల్లో భారతీయ మహిళ మృతి

వాషింగ్టన్,మే26 : అమెరికాలో విషాద ఘటన చోటుచేసుకుంది. వర్జీనియా రాష్ట్రంలోని ఒక సూపర్ మార్కెట్‌లో మే 23 శనివారం గుజరాత్‌కు చెందిన భారతీయ మహిళ దారుణ హత్యకు హత్యకు గురయ్యారు. మృతురాలు బిజాపూర్ ప్రాంతంలో మెహసానా జిల్లా జంత్రాల్ గ్రామానికి చెందిన మేఘనా పటేల్‌గా గుర్తించారు. మేఘ్నా పటేల్ దుకాణం లోపల ఉండగా.. ఆ సమయంలోనే ఓ దుండగుడు కస్టమర్ తరహాలో లోపలికి వచ్చి సెకన్ల వ్యవధిలోనే ఆమెపై కాల్పులు జరిపాడు. దుండగుడు ఆమెపై విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఈ ఘటనకు సంబంధించి సీసీటీవీ ఫుటేజ్‌లో దృశ్యాలు కూడా బయటకు వచ్చాయి. ఈ కాల్పులు దోపిడీ ఉద్దేశంతోనే జరిగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# మహిళల భద్రత, గౌరవానికి ప్రాధాన్యం

మహిళల ఉన్నతే తెలంగాణ ప్రగతి అని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణ పరిమితి పెంచుతున్నట్లు మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళలను సంపద సృష్టించే శక్తిగా తీర్చిదిద్దుతున్నామని వ్యాఖ్యానించారు. మహిళల ఆదాయం పెరిగితే కుటుంబం బలపడుతుందని పేర్కొన్నారు. మంగళవారం బంజారాహిల్స్‌లో సఖి నివాస్ వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క హాజరై మాట్లాడారు. జూన్ 5వ తేదీన మహిళలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీ బస్సులు అందజేస్తారని తెలిపారు. మహిళా సంఘాల సోలార్ ప్లాంట్లను బుధవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మధిరలో ప్రారంభిస్తారని పేర్కొన్నారు. వర్కింగ్ ఉమెన్స్ భద్రత తమ ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. గ్రామీణ మహిళలకు హైదరాబాద్‌లో సురక్షిత వసతి కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. సఖి నివాస్‌లో 150 మంది మహిళలకు వసతి సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు. చిన్నపిల్లలతో వచ్చే తల్లులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధి మహిళల పురోగతితోనే ముడిపడి ఉందని నమ్మిన ప్రభుత్వం తమదని స్పష్టం చేశారు. మహిళలు కేవలం చిన్న చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఇందుకోసం మండలాల్లో రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను కేటాయించడానికి సిద్ధంగా ఉందన్నారు. కార్పొరేట్ మార్కెట్ రంగంలోకి మహిళలను తీసుకెళ్లేందుకు 'మహిళా శక్తి సూపర్ బాజార్ల'ను ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించారు.

# యూరియా సరఫరాలో కేంద్రం విఫలం

అయినప్పటికీ పంట అవశేషాలను కాల్చితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కూడా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. శాటిలైట్ సాంకేతికత ద్వారా పంట అవశేషాల దహనాన్ని గుర్తిస్తున్నామని తెలిపారు. రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. రాష్ట్రంపై బీజేపీ చేస్తున్న విమర్శలు అన్యాయమని మంత్రి వ్యాఖ్యానించారు. ఎల్‌నినో ప్రభావంతో సాధారణంగా పడే వర్షాలు తగ్గే అవకాశం ఉందని మంత్రి హెచ్చరించారు. అందువల్ల రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ రైతులకు భరోసా ఇచ్చే పంటగా మారుతోందని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ సాగుతో రైతులు స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉందని చెప్పారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో 'ఫార్మ్ టు హోమ్' విధానం

కొనుగోలుకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు.రైతులు, మత్స్యకారులు, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# దేశంలో అసహజ జనాభా మార్పు

మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ఆర్థికవేత్త డాక్టర్ షమికా రవి సభ్యులుగా ఉంటారని అమిత్‌షా తెలిపారు.కమిటీ మెంబర్‌గా హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ ఉంటారని చెప్పారు. దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న జనాభా మార్పులపై కమిటీ సమగ్ర మూల్యాంకనం చేసి పరిష్కారం సూచిస్తుందని అమిత్‌షా తెలిపారు. జనాభా మార్పు సమస్య భారతదేశ సార్వభౌమత్యం, జాతీయ భద్రత, సామాజిక సమతుల్యత, ఆదివాసీ సమాజాల పరిరక్షణకు పెను సవాలుగా మారిందన్నారు. మత, సామాజిక వర్గాల స్థాయిలో జనాభా మార్పుల సరళని కమిటీ విశ్లేషిస్తుందని చెప్పారు.

# వాహనదారులపై మళ్లీ పిడుగు

## సిఎన్‌జి ధరలు పెంచిన కేంద్రం

## వరుసగా నాలుగోసారి పెరిగిన ధరలు

న్యూఢిల్లీ : కేంద్రం మళ్లీ షాకిచ్చింది. సీఎన్‌జీ ధరలను మరోసారి పెంచింది. కిలో సీఎన్‌జీపై రూ.2 పెంచింది. పెరిగిన ధరలు మంగళవారం నుంచే అమలులోకి వచ్చాయి. తాజా పెంపుతో ఢిల్లీలో సీఎన్‌జీ ధర రూ.81.09 నుంచి రూ.83.09కి చేరింది. సీఎన్‌జీ ధరలను పెంచడం మే 15వ తేదీ నుంచి ఇది నాలుగోసారి కావడం గమనార్హం. మే 15వ తేదీన మొదట కిలోకు రూ.2 పెంచగా.. అనంతరం రెండుసార్లు ఒక్క రూపాయి చొప్పున కేంద్రం పెంచింది. తాజాగా మరో రూ.2 పెరగడంతో నాలుగోసారి సీఎన్‌జీ ధరలు పెరిగినట్లయ్యింది. గత 11 రోజుల్లో మొత్తం రూ.7 వరకు ధరలు పెరగడంతో వాహనదారులు, ఆటో, క్యాబ్, ట్రాన్స్‌పోర్ట్ రంగాలపై అదనపు భారం పడనుంది. ఎన్నికల ముందు ఇంధన ధరలు పెంచబోమని పదేపదే ప్రకటించిన కేంద్రం.. ఎన్నికలు ముగిశాక వరుసగా ధరలు పెంచుకుంటూ పోతున్నది. తాజాగా మరోసారి ఇంధన ధరలను పెంచింది. సోమవారం నాడు పెట్రోల్‌పై లీటర్‌కు రూ. 2.61, డీజిల్‌పై లీటర్‌కు రూ. 2.71 చొప్పున ధరలు పెరిగాయి. తాజా పెంపుతో మే 15 నుంచి లీటర్‌కు మొత్తం పెంపు రూ.7.5కు చేరింది. గడచిన 11 రోజుల్లో ఇంధన ధరలు పెరుగడం ఇది నాలుగోసారి.




# శాంతి భద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలి

**కమిషనర్ తరుణ్ జోషి**

**ఆమనగల్లు, మే 26(నినాదం):** ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి శాంతిభద్రతల నిర్వహణలో భాగంగా ఆమనగల్లు, కడ్తాల్ పోలీస్ స్టేషన్ లను ఆకస్మిక తనిఖీలో భాగంగా మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. అనంతరం పోలీస్ అధికారులతో సమావేశమైన కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి మాట్లాడుతూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించా లని, చట్ట వ్యవస్థను కట్టుదిట్టంగా అమలు చేయాలని, శాంతి భద్రతల పరిరక్షణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదే శించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజా ఫిర్యాదులను అత్యంత మర్యాదతో స్వీకరించాలని, బాధితుల సమస్యలను శ్రద్ధగా వినాలని,చట్టప్రకారం త్వరితగతిన పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు పోలీస్ వ్యవస్థపై నమ్మకం పెరిగేలా ప్రతి ఫిర్యాదును తీసుకోవాలని ఆయన ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియం త్రణ, ప్రజలతో స్నేహపూర్వక పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారిం చాలని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం లేకుండా, సమయపాలనతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్ యొక్క పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పర్యావరణాన్ని కాపాడుకో వడం ప్రతి ఒక్కరి బాధ్యత అంటూ పిలుపునిచ్చారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి వ్యక్తిని గౌరవంగా చూడడం, వారి సమస్యలను సత్వరంగా పరిష్కరించడం పోలీస్ శాఖ యొక్క ప్రధాన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం డిసిపి కె నారాయణరెడ్డి, మహేశ్వరం ఏసిపి ఎస్ జానకి రెడ్డి. సీఐలు వెంకటేశ్వర్లు. సైదిరెడ్డి. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# బీఆర్ఎస్ సర్పంచుల పెండింగ్ బిల్లులు నిలిపివేయడం దారుణం

**గ్రామాల అభివృద్ధిలో రాజకీయ కక్షలు తగదు..**
**నిధుల లేమితో కొంటుపడుతున్న పల్లెల అభివృద్ధి**
**తక్షణమే నిధులు మంజూరు చేయాలని కలెక్టర్కు**
**మాజీ ఎమ్మెల్యే బొల్లం, సర్పంచులు, నాయకుల వినతి**



**కోదాడ, మే 26(నినాదం):** కోదాడ నియోజకవర్గంలో రాజకీయ కక్షతో బి ఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచుల నిధులు నిలిపివేయటం అత్యంత దారుణమని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం తక్షణమే నిధులు విడుదల చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవర్ కు సర్పంచులు నాయకుల తో కలిసి వినతిపత్రం అందజేశారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకున్న సర్పంచి లపై అధికార ప్రభుత్వం రాజకీయ వివక్షతతో నిధులు మంజూరు చేయకపోవడం శోచనీయమన్నారు... గ్రామాలలో పారిశుద్ధ్యము తాగునీరు మౌలిక వసతుల పనులకు పెండింగ్ నిధులు మంజూరు చేయాలని ఆయన కలెక్టర్ ను కోరారు... గ్రామాల అభివృద్ధికి అత్యవసర బడ్జెట్ కేటాయించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో అధిక సంఖ్యలో బీ ఆర్ఎస్ మద్దతుదారులు గెలిచినప్పటికీ కేవలం రాజకీయ కక్షతో ఆయా గ్రామాలకు మంజూరు కావలసిన విధులను ప్రభుత్వం నిలిపివేయడం దుర్మార్గమన్నారు.. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాలు దాటుతున్నప్పటికీ గ్రామాభివృద్ధిని గ్రామాల అభివృద్ధిని పట్టించుకోవడం లేదని విమర్శించారు.. వీధి దీపాలు ట్రాక్టర్ డీజిల్ వంటి కనీస అవసరాలకే నిధులు లేక పల్లెలు దినావస్థకు చేరుకున్నాయన్నారు.... ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులను రాజకీయ కారణాలతో ఇబ్బంది పెట్టడం అంటే ప్రజల తీర్పును అవమానించటమేనన్నారు.. రాజకీయాలకతీతంగా గత ప్రభుత్వం పల్లెల సమగ్ర అభివృద్ధికి నెలలేని కృషి చేసిందని పేర్కొన్నారు.. వివక్షత చూపకుండా తక్షణమే సర్పంచుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ఆయన కలెక్టర్ ను కోరారు మాజీ ఎమ్మెల్యే వెంట సర్పంచ్లతోపాటు బిఆర్ఎస్ నాయకులు సుంకర అజయ్ కుమార్ కంది బండ సత్యనారాయణ బట్టు శివాజీ తొ గరు రమేష్ కోల ఉపేందర్ నర్సిరెడ్డి శీలం సైదులు జానకి రామాచారి భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## కాళేశ్వరం ఆలయ చైర్మన్‌ను
# వెంటనే తొలిగించాలి

**మహిళా వేదిశీపు చట్టం కింద కేసు నమోదు చేయాలి**
**కుల సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ పీక కిరణ్**



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవ్‌పూర్ మండలం కాళేశ్వర క్షేత్రంలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాల్లో గోదావరిలో స్థానాలు ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దర్శనానికి వచ్చిన మహిళా భక్తులను వేధింపులకు గురి చేసిన దేవలయ చైర్మన్ మోహన్ శర్మను వెంటనే తొలిగించాలని అతని పై మహిళా వేధింపు చట్టం కేసు నమోదు చేయాలని కుల సంఘాల జయంట్ యాక్షన్ కమిటీ భూపాలపల్లి జిల్లా చైర్మన్ పీకా కిరణ్ డిమాండ్ చేసారు. మంగళవారం కాళేశ్వరంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వరంగల్ నుంచి వచ్చిన మహిళ భక్తులను ఏక వచనంగా రావే, పోవే అని భక్తుల మధ్య కించపరచడం శోచనీయమని అన్నారు. అదే అగ్రకులాలకు చెందిన మహిళలను అణగారిన వర్గాలు వేధిస్తే మీరు ఊరుకుంటారా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సరస్వతి అంత్య పుష్కరాలను నిర్వహిస్తుండగా మోహన శర్మ లాంటి కీచకుడు దేవస్థానం ప్రతిష్టను అభాసుపాలు చేస్తున్నాడని పేర్కొన్నారు.ఆలయ దేవస్థానం చైర్మన్ గా ఎస్సీ ఎస్టీలను నియమించాలని ఈసందర్భంగా ఆయన కోరారు. లేనియెడల రెండు రోజుల్లో కాళేశ్వరం దేవస్థానం ఈ ఓ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు ఈ సమావేశంలో కుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటి కన్వీనర్ అజ్మీరా పూల్ సింగ్ నాయక్,లింగమల్ల సదవాలిరావు, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## లారీలు, మిల్లర్ల సమస్యలు
# ధాన్యం కొనుగోలుకు అడ్డు కావద్దు

**బీజేపీ మండల అధ్యక్షుడు మేడిపల్లి పూర్ణచందర్**



**మహాముత్తారం, మే 26(నినాదం):** లారీలు, మిల్లర్ల సమస్యలు రైతుల ధాన్యం కొనుగోళ్లకు అడ్డు కాకుండా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు మేడిపల్లి పూర్ణచందర్ అన్నారు. మంగళవారం మహాముత్తారం మండలం వజినేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకెపి సెంటర్ ని ఆయన సందర్శించారు. లారీలు రాకపోవడం ,మిల్లర్ సరిగా కొనుగోలు చేయకపోవడం వల్ల రైతుల వడ్లు ఐకెపి సెంటర్ లో ఉన్నాయని ఆయన తెలిపారు. తేమశాతం 7,8 వచ్చిన కూడా ఇంకా వడ్లు కొనుగోలు కేంద్రంలోనే ఉండటం సంబంధించిన అధికారుల నిర్లక్ష్యమేనన్నారు. రెండు, మూడు రోజులకు ఒక లారీ వస్తే ఈ ధాన్యం కొనుగోలు ఎప్పుడూ పూర్తి చేస్తారని ప్రశ్నించారు. రైతులకు జరుగుతున్న నష్టాన్ని వివరించాలని ఆడిషనల్ కలెక్టర్‌కు ఫోన్ చేయగా వారు అందుబాటులోకి రాలేదని, మాలాంటి వారి ఫోన్ లే లిఫ్ట్ చేయడం లేదని, మరి సామాన్య రైతులు వారి గోస ఎవరికి చెప్పుకుంటారని ఆయన వాపోయారు. ఇప్పటికైన ప్రభుత్వం అధికారులు వడ్ల కొనుగోలు వేగం పెంచకపోతే రైతుల పక్షాన బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు "లిరైతు గోస –బీజేపీ బరోసాలి" కార్యక్రమంలో భాగంగా మండల కమిటీ రైతుల తరుపున పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు బీజేపీ మండల ఉపాధ్యక్షుడు లింగమల్ల సదువలి రావు, బీజేపీ మండల నాయకులు అరుణ్, శ్రీశైలం, రాజబాబు, ముత్తయ్య ,రాజు పాల్గొన్నారు.

## సామాజిక సేవలో మేము సైతం
# అంటూ ఉత్సాహంగా తండ్రీ, కొడుకులు

**కోలా సుశీల ఫౌండేషన్**
**ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ**
**నాలుగవ రోజు సూరారం డివిజన్ పలు**
**ప్రాంతాలలో మజ్జిగ పంపిణీ**



**కుత్బుల్లాపూర్, మే26 (నినాదం) :** సామాజిక సేవా కార్యకర్త పర్యావరణ ప్రేమికుడు కోలా రవీందర్ ముదిరాజ్ దశాబ్దాల కాలంగా పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ సంచుల నివారణకు ప్లాస్టిక్ విస్తరాకుల నిషేధం వంటి అంశాలపై నిరంతరము పోరాటం సాగిస్తూనే ఉంటాడు. పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి ఇతను ఒక సాధనంగా నేర్చుకునే విధంగా పాఠ్యాంశములో చేర్చి విద్యార్థులు విధిగా ఈత నేర్చుకునే విధంగా ప్రోత్సహించాలంటూ, అందుకు విద్యార్థులకు అదనంగా రెండు మార్కులు పరీక్షలలో బోనస్ మార్కులుగా ఇచ్చి ప్రతి విద్యార్థి ఈత నేర్చుకునే విధంగా ప్రభుత్వము ఆదేశాలు ఇవ్వాలంటూ ప్రభుత్వ ముఖ్య నేతలు, ఉన్నతాధికారులకు వినతి పత్రాలు ఇస్తూనే పోరాటాలు సాగిస్తున్నాడు. ఈ తరుణంలో ప్రస్తుత వేసవి ఎండల తీవ్రత అధికంగా ఉన్న తరుణంలో కోలా రవీందర్ ముదిరాజ్ అతని కుమారుడు కోలా శ్రీకాంత్ ముదిరాజులు కోలా సుశీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం నాలుగవ రోజు సూరారం కాలనీ లాస్ట్ బస్టాప్, ఎంబి గ్రామర్ స్కూల్, అంబేద్కర్ విగ్రహం వద్ద, 60 గజాల ప్రాంతాలలో ప్లాస్టిక్ గ్లాసులకు బదులు పేపర్ గ్లాసులలో మజ్జిగను అందజేశారు.ఈ సందర్భంగా పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తన ఇంటి ముందు, అరుగుపైన గాని ఒక కుర్చీ వేసి బిందెలో, కుండలో కానీ దారిన పోయే వారి వేసవి దాహార్తిని తీర్చుటకు కావలసిన తాగు నీటిని ఉంచాలని, అట్టి బిందె పై చల్లటి, తెల్లటి గుడ్డలు కట్టి పెట్టినట్లయితే మీరు సల్లగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో విక్రమ్ రెడ్డి, వేణు, శివ, కేశవ్, యాదవ్, లాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల రుణం తీర్చుకుంటా

**ఎన్నారైబొగ్గుల మౌలాలి**




**హుజూర్ నగర్ (మఠంపల్లి) మే 26 (నినాదం) :** విద్య బుద్ధులు నేర్పిన పాఠశాల ఋణం తీర్చుకుంటానని ఎన్ ఆర్ ఐ బొగ్గుల మౌలాలి అన్నారు. మఠంపల్లి మండలం రఘునాథపాలెం గ్రామంలోని జడ్పీ హైస్కూల్లో మంగళవారం జిహెచ్ఎం బీ. పిచ్చయ్య ఏర్పాటు చేసిన మన పాఠశాల–మనందరి బాధ్యత కరపత్రాలను ఆవిష్కరణకు ఎన్నారై మౌలాలి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదివినందుకు నేను చాలా గర్వపడుతున్నానని విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల ఋణం తీర్చుకునే అవకాశం కల్పించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని పాఠశాల మౌలిక సదుపాయాల కోసం తన వంతు సహాయ సహకారాన్ని అందిస్తానని ఈ పాఠశాలలో ఈ సంవత్సరం 10వ తరగతి చదివిన విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరచడం సంతోషం గర్వించదగ్గ విషయమని చర్ల హరిణి రెడ్డి అనే విద్యార్థి నియోజకవర్గంలోనే టాప్ మార్కులు సాధించటం పాఠశాల ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉన్నదని అన్నారు. అనంతరం పాఠశాల మొత్తం కలియ తిరుగుతూ తరగతి గదులు ల్యాబ్ రూమ్ ను పరిశీలించారు. అనంతరం చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆయనతో పాటు చదివిన కొంతమంది పూర్వ విద్యార్థులు స్నేహితులతో మాట్లాడి యోగ క్షేమాలు తెలుసు కున్నారు. పాఠశాల ఉపాధ్యాయుల కోరిక మేరకు ముందుగా అత్యవసరంగా పాఠశాల తరగతి గదుల మొత్తానికి పెయింటింగ్ వేయించాలని చెప్పగానే ఎన్నారై మౌలాలి స్పందించి పాఠశాల విద్యా సంవత్సరం ప్రారంభోత్సవానికి ముందుగానే అన్ని చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎస్.కె మౌలాలిని పాఠశాల ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. ఇట్టి కార్యక్రమంలో సర్పంచ్ మాకం కమనీ నరసింహారావు, పిఎసిఎస్ చైర్మన్ జవ్వాజి రామచంద్రయ్య, ఉప సర్పంచ్ తానం శ్రీనివాస్ రెడ్డి, పిఎసిఎస్ వై చైర్మన్ బాబు నాయక్, పంచాయతీ వార్డు సభ్యులు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ నాగేంద్రమ్మ గ్రామ పెద్దలు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బక్రీద్‌కు అదనపు
# తాగునీరు సరఫరా చేయాలి

**'ది సిటిజన్స్ కౌన్సిల్' విజ్ఞప్తి**



**రాజేంద్రనగర్, మే 26( నినాదం):** బక్రీద్ పండుగను పురస్కరించుకుని నేక్నాంపూర్, మణి కొండ నార్సింగి సర్కిల్–45 పరిధిలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగినంత తాగునీటిని సరఫరా చేయాలని 'ది సిటిజన్స్ కౌన్సిల్' జలమండలి అధికారులను కోరింది. ఈ మేరకు మంగళవారం నార్సింగి సర్కిల్–45 వాటర్ బోర్డు డిప్యూటీ జనరల్ మేనేజర్ కి ది సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షులు దీ.ఉపేంద్రనాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి షేక్ ఆరీఫ్ మహమ్మద్, గోల్కొండ హిల్స్ ప్రెసిడెంట్ ఖుర్షిద్, గోల్డెన్ వ్యూ ప్రెసిడెంట్ ఫయాజ్, అల్కాపూర్ నివాసి లైక్ ల తో కలిసి ఈ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిల్ ప్రతినిధులు మాట్లాడు తూ: "పండుగ సమయంలో గృహ అవసరాలు, పరిశుభ్రత నిర్వహణ కొరకు నీటి వినియోగం సాధారణ రోజుల కంటే చాలా ఎక్కువగా ఉంటుంది. ఇటీవల ఈ ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లు, విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలు కొత్త నివాస ప్రాంతాలు భారీగా పెరగడంతో నీటి అవసరం కూడా గణనీయంగా పెరిగింది. కాబట్టి, ప్రజలు పండుగను సంతోషంగా జరుపుకునేలా బక్రీద్ పర్వదినాన అదనపు తాగునీటి సరఫరా, పంపిణీ చేయాలని డీజీఎంని విజ్ఞప్తి చేశామన్నారు.ఈ కార్యక్రమంలో సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు స్థానిక నివాసితులు పాల్గొన్నారు.

# కంకరతో కష్టాల బాట.. ప్రజల ఆవేదన



**భీమదేవరపల్లి మే 26 (నినాదం):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో అభివృద్ధి పేరుతో ప్రారంభించిన రోడ్డు పనులు ప్రజలకు ఉపశమనం ఇవ్వాల్సింది పోయి ఇబ్బందుల బాట పట్టిస్తున్నాయి. ఎస్బీఐ బ్యాంక్ నుంచి బీసీ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నారు. కంకర పోసి నెలలు గడిచినా పనులు ముందుకు సాగకపోవ డంతో ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. రూ.1.35 కోట్ల నిధులతో 2024–25 ఆర్థిక సంవత్సరంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. అయితే రెండు నెలల క్రితం మరమ్మతుల పేరుతో రోడ్డుపై కంకర పోసిన అధికారులు అనంతరం పనులను పూర్తిగా నిలిపివేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నా రు. దీంతో రోడ్డు మొత్తం కంకర రాళ్లతో నిండిపోగా కాలినడకన వెళ్లేవారికి, ద్విచక్ర వాహనదారులకు ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ప్రతిరోజూ విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు ఈ రహదారినే ఉపయోగించాల్సి వస్తోందని కాలనీ వాసులు చెబుతున్నారు. వర్షం పడితే పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని, వాహనాలు జారి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను తక్షణమే పూర్తి చేసి బీసీ కాలనీ ప్రజల ఇబ్బందులను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# పీవీ విజ్ఞాన కేంద్రం పనులు త్వరగా పూర్తి చేయాలి

**జూన్ 28 నాటికి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి**
**హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



**భీమదేవరపల్లి మే 26 (నినాదం):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలో నిర్మిస్తున్న పీవీ విజ్ఞాన కేంద్రం అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం మాజీ ప్రధానమంత్రి దివంగత పాములపర్తి వెంకట నరసింహారావు స్వగ్రామమైన వంగరలో నిర్మాణంలో ఉన్న పీవీ విజ్ఞాన కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పీవీ స్మృతి వనంలోని ఫోటో గ్యాలరీ, సైన్స్ మ్యూజియం, సమావేశ మందిరాన్ని సందర్శించిన కలెక్టర్, అసంపూర్తిగా ఉన్న పనులను సత్వరమే పూర్తి చేయాలని పర్యాటక శాఖ, కుడా అధికారులకు సూచించారు. తాగునీటి పైపులైన్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ 28 నాటికి అన్ని పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని పేర్కొన్నారు. అనంతరం మాజీ ప్రధాని పీవీ నరసింహారావు స్వగృహంలో ఏర్పాటు చేస్తున్న ఫోటో మ్యూజియాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. పీవీ నరసింహారావు రాష్ట్ర ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానమంత్రిగా పనిచేసిన కాలంలో జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులతో దిగిన అరుదైన ఫోటోలను కుటుంబ సభ్యులతో కలిసి పరిశీలించారు. వివిధ సందర్భాల్లో దిగిన ఫోటోల ప్రాముఖ్యతను పీవీ కుటుంబ సభ్యులు పీవీ ప్రభాకర్ రావు, ఎమ్మెల్సీ సురభి వాణి దేవి, పీవీ మదన్ మోహన్ జిల్లా కలెక్టర్‌కు వివరించారు. అదేవిధంగా వివిధ దేశాల నుంచి పీవీ నరసింహారావుకు లభించిన పురస్కారాలు, ఆయన రచించిన పుస్తకాలను కలెక్టర్ పరిశీలించారు. ముందుగా పీవీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, స్థానిక తహసీల్దార్ రాజేష్, పర్యాటక శాఖ డీఈ ధనరాజ్, ఏఈ కీర్తి తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ అభివృద్ధి నిధులపై యువత నిఘా

**శివాయపల్లిలో పారదర్శకత**
**కోసం సమాచార హక్కు ద్వారా దరఖాస్తు**
**ప్రజాధనం వినియోగం ప్రజలకు తెలియాలని డిమాండ్**



**పెద్ద శంకరంపేట్, మే26 (నినాదం) :** పెద్ద శంకరంపేట్ మండలం శివాయపల్లి గ్రామానికి వచ్చిన నిధులు, వాటిని ఏఏ పనుల నిమిత్తం ఖర్చు చేశారనే పూర్తి వివరాలు వెల్లడించాలని కోరుతూ గ్రామ యువకులు సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేశారు. మంగళవారం గ్రామ యువకులు ముందుకు వచ్చి ఎంపీడీవో క్రాంతి కుమార్‌కు సమాచార హక్కు పత్రాన్ని అందజేశారు. గ్రామ అభివృద్ధి కోసం వచ్చిన నిధుల వివరాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని యువకులు తెలిపారు. పనుల వారీగా చేసిన ఖర్చులు, మంజూరైన పనులు, పూర్తయిన పనులు, పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలు ఇవ్వాలని కోరారు. ప్రజాధనం వినియోగంలో పారదర్శకత ఉండాలని, గ్రామ ప్రజలకు నిజమైన సమాచారం అందాలని యువకులు పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి పేరుతో వచ్చిన నిధులు ఎలా వినియోగించారో ప్రజలకు తెలియజేయడం అధికారుల బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి ప్రవీణ్, కుక్కల అంజయ్య, చిలకముక్కు మల్లేశం, చిలకముక్కు వెంకటేశం, దండు చంద్రయ్య, దండు బేత్తయ్య, కుక్కల శ్రీను, చిలకముక్కు సత్యయ్య, కుక్కల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

HDFC BANK
We understand your world

రిజిస్టర్డ్ ఆఫీస్: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ పరేల్ (వెస్ట్), ముంబయి-400013., హైదరాబాద్ రోడ్, బషీర్‌బాగ్, హైదరాబాద్-500029. బ్రాంచ్ ఆఫీసు: నెం. 154, చోహా రాజేంద్ర టవర్స్, 8వ అంతస్తు, జవహర్‌లాల్ నెహ్రూ రోడ్, అరుంబక్కం, చెన్నై-600106

డిమాండ్ నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3(1)తో చదవబడుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్స్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (SARFAESI యాక్ట్, 2002)లోని సెక్షన్ 13(2) క్రింద
ఇందుమూలముగా తెలియజేయడమేమనగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్స్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (సదరు చట్టము) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడుతూ సదరు చట్టములోని సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి అయిన ఈ క్రింది సంతకముదారు రిజిస్టర్డ్ పోస్టు ద్వారా 06.05.2026న సదరు చట్టములోని సెక్షన్ 13(2) క్రింద అధీకృత అధికారి ద్వారా డిమాండ్ నోటీసు జారీ చేసి క్రింద తెలిపిన రుణగ్రహీత(లు)లను వారికి జారీ చేసిన డిమాండ్ నోటీసులో తెలిపిన బకాయి మొత్తమును తిరిగి చెల్లించవలసిందిగా సదరు రుణగ్రహీత(లు)లను కోరడమైనది. పైన తెలిపిన దానికి సంబంధించి సదరు రుణగ్రహీత(లు)ల ద్వారా అమలు పరచిన ఇతర పత్రములు/ఏవైన వ్రాతపూర్వకములతో చదవబడుతూ రుణ ఒప్పందం క్రింద చెల్లించవలసిన, పూర్తి చెల్లింపు తేదీ వరకు మరియు/లేదా రుణము తీరే వరకు క్రింద తెలిపిన తేదీ(లు) ల నుండి సదరు డిమాండ్ నోటీసులో వివరముగా తెలిపినట్లు అనుషంగిక ఖర్చులు, చార్జీలు, తదుపరి వడ్డీ, ధరలతో క్రింద తెలిపిన పట్టికలోని బకాయి మొత్తమును ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ కు సదరు రుణగ్రహీత(లు) లను చెల్లించవలసిందిగా మరోసారి కోరడమైనది. రుణము తిరిగి చెల్లింపుకు సంబంధించి సదరు రుణగ్రహీత(లు) హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ కు క్రింద తెలిపిన ఆస్తులను తనఖా పెట్టినారు.

| రుణగ్రహీత/హామీదారు పేరు & చిరునామా/రుణ సదుపాయము | డిమాండ్ నోటీసు తేది & ఎన్‌పిఏ తేది నాటికి మొత్తం | ఆస్తి వివరములు |
|---|---|---|
| రుణగ్రహీతలు: 1. వివిడ్ విజన్, నెం. 9, బిగ్ స్ట్రీట్, కిల్పాక్ గార్డెన్ కాలనీ, కిల్పాక్, చెన్నై, తమిళనాడు-600010. 2. తునుగుంట్ల వెంకట ఫణి విక్రమ్, సి301, తులివే విహ, 13, న్యూ ఏటిసి కాలనీ రోడ్డు, అన్నా నగర్ ఈస్ట్, చెన్నై-600102. 3. రాజం ఎస్, నెం. 9, బిగ్ స్ట్రీట్, కిల్పాక్ గార్డెన్ కాలనీ, కిల్పాక్, చెన్నై, తమిళనాడు-600010. 4. తునుగుంట్ల సుందర రామయ్య, 5. తునుగుంట్ల లక్ష్మి ఇరువురి చిరునామా: 15-14-305 3/2, నలంద నగర్, సుభమ్ కన్వెన్షన్ సెంటర్ వెనుక, గుంటూరు, ఆంధ్రప్రదేశ్- 522006. రుణ సదుపాయము రకము: 1) డ్రాప్‌లైన్ ఓవర్‌డ్రాఫ్ట్ ఫెసిలిటీ ఖాతా నెం. 50200094200240 | డిమాండ్ నోటీసు తేది: 06.05.2026 రుణ ఖాతా నెం. 50200094200240 కు సంబంధించి బకాయి మొత్తం: రూ. 35,53,645/- (రూపాయలు ముప్పై ఐదు లక్షల యాభై మూడు వేల ఆరు వందల నలభై ఐదు మాత్రమే) బకాయిలు పూర్తిగా చెల్లించే తేదీ వరకు వర్తించే భవిష్య వడ్డీ అదనము. ఎన్‌పిఏ తేది: 29.04.2026 | షెడ్యూల్-ఏ: గుంటూరు జిల్లా, గుంటూరు రిజిస్ట్రేషన్ సబ్ జిల్లా, గుంటూరు సిటీ 4/1819, బ్రోడీపేట, గుంటూరు, గుంటూరు గ్రా॥లోని డి.నెం. 33/ఏ, గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని పాత వార్డు నెం. 2, వార్డు నెం. 3, బ్లాక్ నెం. 5లో గల సంబంధిత టి.ఎస్. నెం. 336, మున్సిపల్ డోర్ నెం. 5-55-81, పాత అసెస్‌మెంట్ నెం. 3558 గల ఆస్తి యావదాస్తి. సరిహద్దులు: ఉత్తరం: కంటేటి సత్యనారాయణ ఆస్తి, దక్షిణం: మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు, తూర్పు: మున్సిపల్ కార్పొరేషన్ గల్లీ బజార్, పడమర: పాటూరి కృష్ణ కుమారి కి చెందిన ఆస్తి. కొలతలు: ఉత్తరం: 63 అడుగుల 6 ఇంచులు, దక్షిణం: 62 అడుగుల 3 ఇంచులు, తూర్పు: 106 అడుగుల-3 ఇంచులు, పడమర: 106 అడుగుల-0 ఇంచులు, ఈ సరిహద్దుల లోపల అన్ని అనుభోగ హక్కులు మొ॥ వాటితో సహా 743 చ॥గ॥లు లేదా 624.24 చ॥మీ॥ల విస్తీర్ణము గల స్థలం. షెడ్యూల్-బి: పైన వాటాల కొరకు షెడ్యూల్-"ఏ" ఆస్తిలో నిర్మించిన మొదటి అంతస్తులోని నైరుతి మూల ఏర్పాటు చేసినట్లు మొత్తం షెడ్యూల్ 'ఏ' ఆస్తికి గాను 40 చ॥గ॥లు లేదా 33.45 చ॥మీ॥ల విస్తీర్ణము గల అవిభాజ్య మరియు అస్పష్టమైన వాటాతో పాటు ఒక నివాస ఫ్లాట్ నెం. 1 యావదాస్తి. సరిహద్దులు: తూర్పు: ఈ ఫ్లాట్ మరియు ఫ్లాట్ నెం. 2 మధ్య ఉమ్మడి గోడ, దక్షిణం: గ్రౌండ్‌లోని రోహిణి హోమ్స్‌లోని ఖాళీ ఏరియా, పడమర: గ్రౌండ్‌లోని రోహిణి హోమ్స్‌లోని ఖాళీ ఏరియా, ఉత్తరం: స్టెయిర్‌కేస్, లిఫ్ట్ మరియు కారిడార్. ఈ సరిహద్దుల పరిధిలతో గుంటూరు సిటీ, సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా మరియు రిజిస్ట్రేషన్ జిల్లా గుంటూరు అధికార పరిధిలో అనుభోగ మరియు అనుబంధ హక్కులతో కలుపుకొని ఉమ్మడి హక్కులు మరియు కామన్ మరియు అన్ని సదుపాయములతో పాటు సెల్లార్‌లో ఒక కార్ పార్కింగ్ ఏరియా కేటాయింపుతో కలుపుకొని మరియు రోహిణి హోమ్స్‌లోని మొదటి అంతస్తులో నైరుతి మూల గల ఫ్లాట్ నెం. 1 యావదాస్తి. |

ఒక వేళ సదరు రుణగ్రహీతలు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌కు మీరు చెల్లించుటలో విఫలమైనచో, వర్తించు రూల్స్ మరియు చట్టములోని సెక్షన్ 13(4) క్రింద పైన తెలిపిన సెక్యూర్డ్ ఆస్తులపై సదరు రుణగ్రహీతల బాధ్యత మరియు పర్యవసానములతో చర్యలు తీసుకొనుటకు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ వారు ముందుకు సాగెదరు. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా అమ్మకము, లీజు మరియు ఏదైన ఇతర విధములైన రుణములతో పైన తెలిపిన ఆస్తులను బదిలీ చేయుటకు సదరు చట్టములోని సెక్షన్ 13(13) క్రింద సదరు రుణగ్రహీత(లు)లను నిషేధించినారు. సదరు చట్టము మరియు రూల్స్‌లోని నిబంధనలను ఎవరైన వ్యక్తి వ్యతిరేకించినను లేదా ఉల్లంఘించినను చట్టము క్రింద కారాగారము మరియు/లేదా జరిమానాతో శిక్షార్హులు. ఇందుకు సంబంధించి ఎటువంటి తదుపరి నోటీసు జారీ చేయబడదని గమనించగలరు.

తేది: 06.05.2026, ప్రదేశం: చెన్నై
సం/- అధీకృత అధికారి, హెచ్‌డిఎఫ్ బ్యాంక్ లిమిటెడ్

## లిక్కర్ కేసులో అన్ని ఆధారాలు సమర్పించాం

మాదంతా చట్టబద్ధమైన సంపాదనే
ఎపి సిట్ కక్షపూరిత కేసులు పెడుతోంది
న్యాయబద్ధంగానే కేసులను ఎదుర్కొంటాం
చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు మోహిత్ రెడ్డి

**అమరావతి, మే 26 (నినాదం):** ఏపీ లిక్కర్ స్కాంలో ఈడీ విచారణ అనంతరం వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు మోహిత్ రెడ్డి స్పందించారు. ఏపీ సిట్ కక్షపూరితంగా తమపై కేసులు నమోదు చేసిందని ఆరోపించారు. అయితే ఆ కేసులను న్యాయపరంగానే ఎదుర్కొంటామని చెప్పారు. ఈడీ అధికారులు అడిగిన అన్ని ఆస్తుల వివరాలనూ అందజేశామని తెలిపారు. విచారణకు తమవంతుగా పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు తాము సంపాదించిన ఆస్తుల వివరాలన్నింటినీ ఈడీకి సమర్పించామని మోహిత్ రెడ్డి వెల్లడించారు. తమ కుటుంబం సంపాదించిన ప్రతి రూపాయీ కష్టార్జితమే తప్ప అక్రమంగా సంపాదించలేదని స్పష్టం చేశారు. ముడుపుల సొమ్ముతో ఆస్తులు కొనుగోలు చేశారంటూ ఆరోపణలు మాత్రమే ఉన్నాయని, వాటిలో నిజం లేదన్నారు. తాము సంపాదించిన ప్రతి పైసా కష్టపడి సంపాదించిన డబ్బేనని పేర్కొన్న మోహిత్ రెడ్డి.. ఈ కేసులపై న్యాయస్థానంలో పోరాటం కొనసాగిస్తామని వెల్లడించారు. కాగా, రాష్ట్రంలో సంచలనం రేపిన లిక్కర్ స్కాం కేసులో ఈడీ విచారణను మరింత వేగవంతం చేసింది. ఈ వ్యవహారంలో మనీలాండరింగ్ ఆరోపణలపై ప్రత్యేక దృష్టి సారించిన ఈడీ.. విచారణలో భాగంగా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసుల మేరకు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి భార్యతో పాటు ఆయన కుమారుడు మోహిత్ రెడ్డి నేడు (మంగళవారం) ఈడీ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు.

## తనను కొనడం మీ తరం కాదు

డబ్బుకు అమ్ముడు పోయే వ్యక్తిని కాదు
వైఎస్ అవినాశ్ రెడ్డికి బిటెక్ రవి సవాల్

**కడప, మే 26 (నినాదం):** తనను కొనడం వైఎస్ అవినాష్ రెడ్డి వల్ల కాదు కదా.. ఆయన సోదరుడు వైఎస్ జగన్ వల్ల కూడా కాదని పులివెందుల టిడిపి ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. డబ్బు మీద వ్యామోహం, డబ్బు మీద కక్కుర్తి కానీ తనకు లేదని.. అది మీకు మాత్రమే ఉందంటూ వైఎస్ అవినాశ్ రెడ్డి సోదరులకు ఆయన చురకలంటించారు. కడప ఎంపీ అవినాష్ రెడ్డి సోమవారం బీటెక్ రవిపై వ్యాఖ్యలు చేశారు. దీనిపై మంగళవారం కడపలో బీటెక్ రవి స్పందించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి విలేకర్లతో మాట్లాడుతూ.. అమరావతి తీర్మానానికి మద్దతు ఇవ్వకుంటే రూ.15 కోట్లు ఇస్తామని చెప్పింది మీరు కదా? అని కడప ఎంపీని ఆయన సూటిగా ప్రశ్నించారు. తాను గతంలో విజయ సాయిరెడ్డిని కలిసి ఉంటే గత ఆరు సంవత్సరాలుగా మీరు ఎందుకు మౌనంగా ఉన్నారంటూ వారిని ఈ సందర్భంగా బీటెక్ రవి నిలదీశారు. 2014లో స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్ అవినాష్ రెడ్డి తనను ఉల్లిమెళ్లలోని తన తోట వద్దకు పిలిపించి కసునూరు ఎంపీటీసీ అంశంపై ఎందుకు చర్చించారన్నారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య అంశంలో హైకోర్టులో సీబీఐ కేసును విత్‌డ్రా చేయడానికి తనతోపాటు ఆదినారాయణ రెడ్డికి బ్లాంక్ చెక్ ఆఫర్ చేయడం నిజం కాదా? .. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని క్యాంపుల్లోని అసంతృప్తుల వివరాలను తమకు చెప్పింది మీరు కాదా? అంటూ వైఎస్ అవినాష్ రెడ్డికి ఈ సందర్భంగా బీటెక్ రవి ప్రశ్నలు సంధించారు. ÷రాజశేఖర రెడ్డి రెండవ సారి ముఖ్యమంత్రి అయిన తరువాత బీబీఎమ్‌కు వచ్చిన వర్క్‌ను రద్దు చేయించి.. తద్వారా రూ.15 కోట్ల కమిషన్ తీసుకుని ఇళ్లు కట్టుకున్నది మీరని బీటెక్ రవి కుండబద్దలు కొట్టారు. అలాంటి నువ్వు.. నాపై మాట్లాడేదంటూ అవినాశ్ రెడ్డిపై బీటెక్ రవి నిప్పులు చెరిగారు. అరటి రైతుల కడుపు కొట్టి కమిషన్‌లు తీసుకున్న నేపథ్యం మీదంటూ అవినాష్ రెడ్డి తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. రాజేశ్వర్ రెడ్డి, గణకణపల్లి కృష్ణారెడ్డిలను అడిగితే మీ ఎర్రచందనం దొంగతనాల గురించి వివరిస్తా రన్నారు. మీ తాటాకు చప్పుడులకు తాను భయపడేది లేదంటూ అవినాష్ రెడ్డికి బీటెక్ రవి స్పష్టం చేశారు. ఉలిమెళ్ల తోటలో ఏం జరగలేదని చెబితే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానంటూ అవినాష్ రెడ్డికి సవాల్ విసిరారు. ఇప్పటివరకు పుష్ప 1 మాత్రమే అయింది.. ఇంకా పుష్ప 2, పుష్ప 3 కూడా చూపిస్తామని అవినాష్ రెడ్డిని బీటెక్ రవి హెచ్చరించారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్న కారు : ప్రమాదంలో ముగ్గురు మృతి

**కాకినాడ, మే 26 (నినాదం):** తూర్పు గోదావరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గోకవరం మండలం కొత్తపల్లి శివారులో ట్రాన్స్‌ఫార్మ ్‌ను కారు ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు మృతి చెందగా.. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మలిశాల గ్రామానికి చెందిన ఎనిమిది మంది మారేడుమిల్లి ఏజెన్సీ ప్రాంతానికి విహారయాత్రకు వెళ్లారు. జగ్గంపేటలోని ట్రావెల్స్ నుంచి కృష్ణ అనే వ్యక్తి ఇన్నోవా వాహనాన్ని సెల్ఫ్ సర్వీస్ కోసం తీసుకొచ్చారు. ఆయనతో పాటు మరో ఏడుగురు ఆ వాహనంలో మారేడు మిల్లి వెళ్లారు. తిరిగొస్తుండగా.. కొత్తపల్లి శివారు జీడిపిక్కల ఫ్యాక్టరీ వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కొండిపూడి వివేక్ (19), బల్లిలా పద్మ (19), గట్ల లక్ష్మీ (3) మృతి చెందగా.. కృష్ణ, కందిగట్ల నాని, రామకృష్ణ దొర, దుర్గ, నవ్యకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటన జరిగిన వెంటనే సమాచారం అందుకు పోలీసులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు.

## రాష్ట్రంలో 'ఫార్మ్ టు హోమ్' విధానం

రైతుల నుంచి నేరుగా ప్రజలకు ఉత్పత్తులు
అధికారులను ఆదేశించిన సిఎం చంద్రబాబు



**అమరావతి, మే 26 (నినాదం):** రాష్ట్రంలో 'ఫార్మ్ టు హోమ్' విధానాన్ని అమలు చేయాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు చేరేలా కొత్త మార్కెటింగ్ వ్యూహాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల రైతులకు మెరుగైన ధరలు లభించడంతో పాటు మధ్యవర్తుల ప్రభావం తగ్గుతుందని చెప్పారు. వ్యవసాయ అనుబంధ రంగాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వ్యవసాయం, ఆక్వా, పశుసంవర్ధక రంగాలను మరింత బలోపేతం చేసే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా దేవరపల్లి మండలం యడవోలు సమీపంలో 'కోకో సిటీ' ఏర్పాటు చేయనున్నట్లు సీఎం వెల్లడించారు. అలాగే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు జులై నెలలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కడప జిల్లా పులివెందులలో నిర్మాణంలో ఉన్న ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను మంజూరు చేసినట్లు సీఎం పేర్కొన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత పరిశీలనకు ఈ ల్యాబ్ ఉపయోగపడు తుందని తెలిపారు. ఆక్వా రంగానికి ప్రోత్సాహంగా కొత్త ఆక్వా కనెక్షన్లకూ విద్యుత్ సబ్సిడీ వర్తింపజే యనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటిం చారు. అలాగే మత్స్యకారుల సంక్షేమం కోసం 200 మెకనైజ్డ్ బోట్ల కొనుగోలుకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. రైతులు, మత్స్యకారులు, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## బ్రిటీష్ వాళ్లకు ఊడిగం చేసిన చరిత్ర వైఎస్ కుటుంబానిది

చరిత్ర మరచి జగన్ మాట్లాడుతున్నాడు: ఎమ్మెల్సీ భూమిరెడ్డి



**అమరావతి, మే 26 (నినాదం):** జగన్ కుటుంబ రాజకీయాలన్నీ రక్త మాంసాలతో నిండినవేనని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ధ్వజమెత్తారు. మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రిటీష్ వాళ్లకు సాయం చేసిన చరిత్ర వైఎస్ కుటుంబానిదని దుయ్యబట్టా రు. స్వాతంత్య్ర ఉద్యమం సమయం లో బ్రిటీష్ వాళ్లకు జగన్ కుటుంబం ఆహారం సరఫరా చేసిందని తెలిపారు. బ్రిటీష్ వాళ్ల మన్ననల కోసం దేశ స్వాతంత్య్రానికి వ్యతిరేకంగా పనిచేశారని రాంగోపాల్ రెడ్డి ఆరోపించారు. రాజారెడ్డి బ్రిటీష్ సైన్యంలో చేరి వారి కోసం పనిచేయలేదని చెప్పే ధైర్యం జగన్‌కు ఉందా అని ప్రశ్నించారు. మంగపేట ముగ్గురాయి గనుల కోసం వెంకటనరసయ్యను జగన్ కుటుంబం హత్య చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్య్రం÷-ర వచ్చే వరకూ రాజారెడ్డి దేశాలు పట్టుకుని తప్పించుకుని తిరిగాడని మండిపడ్డారు. హత్య చేయించటంతో పాటు చేసిన వారికి సుపారీ చెల్లించకుండా మోసం చేసిన చరిత్ర వైఎస్‌దని భూమిరెడ్డి ఆక్షేపించారు. ఇంత ఘన చరిత్ర కుటుంబ నేపథ్యం ఉన్న జగన్.. శాంతి కాముకుడిగా మాట్లాడటం విడ్డూరమని ఎద్దేవా చేశారు.


## ప్రొద్దుటూరులో టిడిపి వర్గాల మధ్య ఘర్షణ

లాఠీఛార్జ్ చేసి అదుపు చేసిన పోలీసులు



**కడప, మే 26 (నినాదం):** వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరులో మంగళవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. కడప జిల్లా ప్రొద్దుటూరులో అధికార టీడీపీకి చెందిన ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, మరో నేత ప్రవీణ్ రెడ్డి వర్గాల మధ్య తీవ్ర ఆధిపత్య పోరు రచ్చకెక్కింది. ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి కుమారుడు కొండారెడ్డి భాగస్వామిగా ఉన్న ఎస్.ఎస్. షాపింగ్ మాల్ వద్ద రెండు వర్గాలు పరస్పరం రాళ్ల దాడికి పాల్పడ్డాయి. షాపింగ్ మాల్‌ను ప్రభుత్వ అనుమతులకు వ్యతిరేకంగా నిర్మించారంటూ ఇటీవల తెదేపా మాజీ ఇంఛార్జి ప్రవీణ్ మీడియా సమావేశంలో ఆరోపించారు. ఫర్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు తనిఖీకి వచ్చారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, ప్రవీణ్ వర్గీయులు మాల్ వద్దకు చేరుకున్నారు. ఇరు వర్గాలు పరస్పరం రాళ్లదాడికి దిగాయి. పోలీసులు లాఠీఛార్జి చేసి ఇరు వర్గాలను చెదరగొట్టారు. స్థానిక ఎస్.ఎస్. షాపింగ్ మాల్ నిర్మాణంలో నిబంధనలు ఉల్లంఘించారంటూ ప్రవీణ్ రెడ్డి చేసిన ఫిర్యాదుపై ఫైర్ సేఫ్టీ అధికారులు తనిఖీలకు రావడంతో ఈ వివాదం మొదలైంది. సదరు మాల్‌లో ఎమ్మెల్యే కుమారుడు కొండారెడ్డి భాగస్వామి కావడంతో, తనిఖీల సమయంలో ఇరు వర్గాల అనుచరులు అక్కడికి భారీగా చేరుకున్నారు. ఈ క్రమంలో ఇరు పక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుని, పరస్పరం రాళ్లు రువ్వుకునే వరకు వెళ్ళింది. ఈ ఘర్షణతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురికాగా, సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేయడానికి లాఠీఛార్జ్ చేసి ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## స్త్రీశక్తి థీమ్‌తో మహానాడు : సీఎం చంద్రబాబు



**అమరావతి, మే 26 (నినాదం):** టీడీపీ మహానాడు 2026ను ఈసారి పూర్తిగా వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు, గ్రామ స్థాయి కార్యకర్తలతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహానాడు నిర్వహణ, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక దిశానిర్దేశం చేశారు. గతంలో కోవిడ్ సమయంలో కూడా డిజిటల్ పద్ధతిలో మహానాడు నిర్వహించా మని గుర్తు చేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మరోసారి వర్చువల్ విధానాన్నే ఎంచుకున్నామని చెప్పారు. ఇంత పెద్ద ఎత్తున వర్చువల్ రూపంలో మహానాడు నిర్వహించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. తెలుగువారు ఆసక్తిగా ఎదురు చూసే కార్యక్రమం మహానాడు అని, పార్టీకి అది ఒక భావోద్వేగమని సీఎం చంద్రబాబు అన్నారు. మహానాడు ద్వారా పార్టీ ప్రజలకు ఏ సందేశం ఇస్తుందో అన్న ఆసక్తి అందరిలో ఉంటుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 1845 క్లస్టర్ల పరిధిలో మహానాడు నిర్వహిస్తున్నామని తెలిపారు. పార్టీ ఎదుగుదలకు, కార్యకర్తలు నాయకులుగా ఎదగడానికి క్లస్టర్ విధానం ఉపయోగపడుతుందని వివరించారు. ఈసారి 'స్త్రీశక్తి' థీమ్‌తో మహానాడు నిర్వహిస్తున్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. క్లస్టర్ల వారీగా క్షేత్రస్థాయిలో జరిగే మహానాడులో రాష్ట్రస్థాయి నాయకులు కూడా పాల్గొంటారని సీఎం చంద్రబాబు తెలిపారు. మహానాడులో సరైన మార్గనిర్దేశం చేసుకుని వాటిని అమలు చేయాలని సూచించారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని తిరుగులేని శక్తిగా నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ప్రజా ప్రతినిధులు, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న ప్రతి ఒక్కరిలో జవాబుదారీతనం ఉండాలని.. అప్పుడే ప్రజలు విశ్వసిస్తారని అన్నారు. పార్టీ కార్యకర్తలు అన్ని విధాలా సాధికారత సాధించేలా కృషి చేయాలని సూచించారు. ఎన్టీఆర్‌కు ఘన నివాళులు అర్పించడంతో పాటు రాష్ట్రాభివృద్ధికి పునరంకితమయ్యేలా మహానాడును నిర్వహించుకుందామని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

## మెగా డీఎస్సీపై వైసీపీ విషప్రచారం: దేవినేని ఉమామహేశ్వరరావు



**అమరావతి, మే 26 (నినాదం):** వైసీపీపై మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తీవ్ర విమర్శలు గుప్పించారు. మెగా డీఎస్సీ విషయంలో వైసీపీ నేతలు విషప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి నారా లోకేష్‌కు వస్తున్న ప్రజాదరణను తట్టుకోలేక ఫేక్ ట్వీట్లు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

**డీఎస్సీపై మాట్లాడే హక్కు లేదు**

మెగా డీఎస్సీని పూర్తిగా పారదర్శకంగా నిర్వహించామని, భవిష్యత్తులో కూడా అదే విధంగా నిర్వహిస్తామని దేవినేని ఉమ స్పష్టం చేశారు. నిరుద్యోగులను మోసం చేసిన వైసీపీకి డీఎస్సీపై మాట్లాడే హక్కు లేదన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని మండిపడ్డారు. ఉపాధ్యాయులను అవమానించిన వైసీపీ నేతలు ముందుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ ప్రక్రియను అడ్డుకునేందుకు 220కి పైగా కేసులు వేశారని ఆరోపించారు. రాష్ట్రానికి గత 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చామని, 22 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

**'నా తెలుగుదేశం – నా బాధ్యత'**

టీడీపీ మహానాడును విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పనిచేస్తున్నాయని దేవినేని ఉమ పేర్కొన్నారు. 'నా తెలుగుదేశం – నా బాధ్యత' నినాదంతో మహానాడు నిర్వహిస్తున్నామని చెప్పారు. మండుటెండలను కూడా లెక్కచేయకుండా కార్యకర్తలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారని వెల్లడించారు. మహానాడు పార్టీ భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం చేసే కీలక వేదిక అని ఆయన అన్నారు.

**అక్రమాలు బయటపడతాయి**

ఈ క్రమంలోనే 'చిన్నప్పన్న' అరెస్టుతో వైసీపీ అక్రమాలు బయటపడుతున్నాయని పేర్కొన్నారు. వందల కోట్ల రూపాయల అక్రమాలు విచారణలో వెలుగులోకి వస్తున్నాయని, అధికారాన్ని అడ్డుపెట్టుకుని వేల కోట్ల రూపాయల దందాలకు పాల్పడ్డారని ఆరోపించారు. 2004 నుంచి జరిగిన అక్రమాలన్నీ ఒక్కొక్కటిగా బయటపడతాయని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు హెచ్చరించారు.

## భారీ ఈదురు గాలులు..

నష్టాన్ని అంచనా వేస్తున్నాం :
ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్



**మైలవరం, మే26 (నినాదం):** భారీ ఈదురు గాలుల వల్ల నష్టపోయిన వారిని కూటమి ప్రభుత్వం ఆదుకుం టుందని స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ హామీ ఇచ్చారు. మంగళవారం మైలవరం ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకర్లతో ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. ఈదురు గాలులకు చెట్లు విరిగిపడి గృహాలు దెబ్బతిన్నాయని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులకు ఎటువంటి నష్టం వాటిల్లలేదని పేర్కొన్నారు. దెబ్బతిన్న గృహలను అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తారని చెప్పారు. విద్యుత్ స్తంభాలు పడిపోయి తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని తెలిపారు. మంగళవారం సాయంత్రానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తారన్నారు. ధాన్యం కొనుగోళ్లు జరగలేదని కొందరు పని పాట లేని వారు మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. 95 శాతం ధాన్యం కొనుగోలు చేసి.. ఆ నగదు రైతుల ఖాతాల్లో వేయడం జరిగిపోయిందని వివరించారు. గత ప్రభుత్వంలో మూడు నెలలకు కూడా ధాన్యం నగదు పడేవి కావని వైసీపీ తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. అసలు వాస్తవాలు రైతులకు తెలుసునని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ వెల్లడించారు. ఇటీవల మైలవరంలో ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ఈ గాలులకు కరెంట్ స్తంభాలు విరిగిపడ్డాయి. భారీ చెట్లు కూడా నెలకొరిగాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ పైవిధంగా స్పందించారు.

## లిక్కర్ కేసులో ఈడీ దూకుడు

చెవిరెడ్డి భార్య పేరుతో అక్రమ లావాదేవీల గుర్తింపు

**అమరావతి, మే26 (నినాదం):** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తన విచారణను తీవ్రతరం చేసింది. ఈ స్కాంలో అక్రమ నగదు చలామణి , హవాలా మార్గాల ద్వారా భారీగా నిధులు చేతులు మారాయనే ఆరోపణలపై ఈడీ దృష్టి సారించింది. ఇందులో భాగంగానే వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబానికి ఈడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసుల ఆధారంగా చెవిరెడ్డి భార్య, ఆయన కుమారుడు తాజాగా ఈడీ విచారణకు హాజరయ్యారు. మద్యం వ్యాపారాలు, లైసెన్సుల కేటాయింపుల వ్యవహారంలో చెవిరెడ్డి భార్య పేరిట భారీ ఎత్తున అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు ఈడీ ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు సమాచారం. హవాలా మార్గాల ద్వారా కోట్ల రూపాయల మేర చేతులు మారినట్లు వస్తున్న ఆధారాలపై అధికారులు వీరిని విచారించారని తెలుస్తోంది. ఈ కుంభకోణంలో చెవిరెడ్డి భార్యతో పాటు ఆయన కుమారుడి పాత్రపై కూడా ఈడీ కీలక ఆధారాలు సేకరించిందని సమాచారం. ఈ కేసులో మరికొందరు రాజకీయ ప్రముఖులు, అధికారుల పేర్లు కూడా వెలుగులోకి వచ్చే అవకాశం ఉండటంతో, తాజా ఈడీ విచారణ రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

## కులం గురించి మాట్లాడింది చాలు..


నేను చిట్టా విప్పితే.. పవన్ కల్యాణ్ ఫైర్



**అమరావతి, మే26 (నినాదం):** జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధానితో దేశభవిష్యత్ గురించే మాట్లాడతానని అన్నారు. వాళ్లను వీళ్లను అరెస్ట్ చేయమని ఎందుకు అడుగుతానని మండిపడ్డారు. పది మంది ఉగ్రవాదులు దేశాన్ని వణికిస్తుంటే 20వేల మంది ఉన్న మీరు ఎంతమంది గుండాలను అరికట్టగలరని వ్యాఖ్యానించారు. కులం గురించి ఇక మాట్లాడింది చాలని తాను చిట్టా విప్పితే ఎవరూ తట్టుకోలేరని హెచ్చరించారు. సగటు జీవి ఆవేదనను జనసేన అర్థం చేసుకుంటుందని అన్నారు. అందరూ వదిలేసింది పట్టుకోవడమే జనసేన ప్రత్యేకత అని చెప్పారు. కార్యకర్తలు కూడా జనసేన భావజాలాన్ని అలవర్చుకోవాలని సూచించారు. క్రమశిక్షణ కలిగిన ఫోర్స్ జనసేనకు కావాలన్నారు. మనదగ్గర 20వేల మంది సాధక్ లు ఉన్నారని అన్నారు. తనకు రాజకీయాలు అవసరంలేదని సామాజికమార్పు కావాలని వ్యాఖ్యానించారు. ఉద్యమకారుడి నుండి తాను సాధకుడిగా మారానని వ్యాఖ్యానించారు. రాష్ట్ర భవిష్యత్ కోసమే ఆ క్షణం నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. ఆ రోజు తీసుకున్న నిర్ణయం ఈరోజు కోట్ల నిధులకు నాందిపలికిందని అన్నారు. ఎవరైనా ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. చాలా మంది తనను హింసించారని మీరు గట్టిగా నిలబడితే ఎదుటివాడు భయపడిపోవాలని కార్యకర్తలకు సూచించారు. వేల కోట్లు తనకు అవసరంలేదని కార్యకర్తలే తన ఆస్తి అని చెప్పారు.

## బీచ్‌ను ముద్దాడిన ఆకాశం..

విశాఖ బీచ్‌లో అరుదైన దృశ్యం



**విశాఖపట్నం, మే26 (నినాదం):** విశాఖ బీచ్ రోడ్డులో అరుదైన దృశ్యం కనిపించింది. వాతా వరణం పూర్తిగా మారిపోవడంతో ఒక్కసారిగా నల్లమబ్బులు కమ్ముకున్నాయి. దీంతో బీచ్ రోడ్డులో సముద్రం ఆకాశం కలిసినట్టుగా సన్నివేశాలు కనిపిం చాయి. మరోవైపు సాయంత్రమే చీకటిపడిపోయింది. దీంతో బీచ్ మబ్బులు బ్లాక్ అండ్ వైట్ గా కనిపిస్తూ ఆకట్టుకున్నాయి. ఈ అరుదైన విజువల్స్ చూస్తూ పర్యాటకులు ఎంజాయ్ చేశారు. తమ ఫోన్ కెమెరాలలో అందమైన చిత్రాలను బంధించారు. ఇక కేవలం వైజాగ్‌లోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా వాతావర ణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. తిరుపతి జిల్లాలో పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. నగరిలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురి సింది. విద్యుత్ సరఫరాకు సైతం అంతరాయం ఏర్పడింది. పుత్తూరులో ఈదు రు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ రోజు వర్షం కురిసినప్పటికీ గత వారం రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. మరో నాలుగు రోజుల పాటు కూడా వడగాలుల తీవ్రత ఉంటుందని వాతావరణశాఖ పేర్కొంది. కొన్ని జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, కొన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ప్రకాశం, పల్నాడు, పశ్చిమగోదావరి, బాపట్ల, గుంటూరు, కృష్ణా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. నెల్లూరు, ఎన్టీఆర్, ఏలూరు, తూ.గో, కాకినాడ, కోనసీమ, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

## పవన్‌లా మాట తప్పను!

వైఎస్ జగన్‌ను కలిసిన సుగాలి ప్రీతి తల్లిదండ్రులు



**కర్నూలు, మే26 (నినాదం):** తమ కుమార్తె సుగాలి ప్రీతికి న్యాయం చేయాలని కోరుతూ ఆమె తల్లిదండ్రులు పార్వతి, రాజు నాయక్ వైసీపీ అధినేత వైఎస్ జగన్‌ను కలిశారు. 2017లో తమ కుమార్తె పై జరిగిన దారుణ అత్యాచారం, హత్య కేసులో తొమ్మిదేళ్లు గడుస్తున్నా ఇంకా న్యాయం జరగలేదని వారు ఆయన ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం ఈ కేసు విషయంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు ఆరోపించారు. గతంలో తమ కుటుంబానికి కర్నూలులో 5 సెంట్ల ఇంటి స్థలం, 5 ఎకరాల వ్యవసాయ భూమితో పాటు ప్రీతి తండ్రికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించినందుకు జగన్‌కు వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. వారి ఆవేదన విన్న జగన్.. ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం వారికి దక్కాల్సిన ప్రయోజనాల సాధన కోసం పోరాడుతామని, ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

**పవన్ కల్యాణ్ మాట తప్పారు: ప్రీతి తల్లి**

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై ప్రీతి తల్లి తీవ్ర విమర్శలు చేశారు. గతంలో న్యాయం చేస్తానని మాటిచ్చిన పవన్.. ఇప్పుడు పదవిలోకి వచ్చాక డీఎన్ఏ రిపోర్టులు తారుమారయ్యాయని, తాను ఏమీ చేయలేనని చేతులెత్తేశారని మండిపడ్డారు. న్యాయం అడిగితే పవన్ తన అనుచరులు, వీర మహిళలు, మంత్రులతో తమపై మూకుమ్మడి దాడికి ఉసిగొల్పారని ఆరోపించారు. అంతేకాకుండా తన అంగవైకల్యాన్ని, కులాన్ని ఎత్తిచూపుతూ తీవ్రంగా అవమానిస్తున్నారని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. పవన్‌లా తాను మాట తప్పనని, న్యాయం కోసం పోరాడతానని జగన్ తమకు ధైర్యం చెప్పారని ఆమె స్పష్టం చేశారు.

## విజయవాడ విమానాశ్రయంలో 'ఎబోలా' వైరస్ స్క్రీనింగ్..

అప్రమత్తమైన ఏపీ సర్కార్!

**విజయవాడ,మే26 (నినాదం):** ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వైరస్ కేసులు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా కేంద్ర పౌర విమాన యాన శాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు ఎబోలా వైరస్ స్క్రీనింగ్ పరీక్షలను ప్రారంభించారు.

**లక్షణాలు ఉంటే క్వారంటైన్..**

విదేశీ ప్రయాణికులను నిశితంగా పరిశీలించేందుకు ఎయిర్‌పోర్టులో ప్రత్యేకంగా స్క్రీనింగ్ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం సింగపూర్ నుంచి విమానాశ్రయానికి చేరుకున్న ప్రయాణికులకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు ఆరోగ్య సిబ్బంది ఎబోలా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. స్క్రీనింగ్ సమయంలో ఎవరికైనా ఎబోలా వైరస్ లక్షణాలు ఉన్నట్లు గుర్తిస్తే, వారిని క్వారంటైన్‌కు తరలించేలా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ప్రాణాంతక ఎబోలా వైరస్ రాష్ట్రంలోకి ప్రవేశించకుండా అడ్డుకునేం దుకు విదేశాల నుంచి వచ్చే ప్రతి ప్రయాణికుడికి ఈ పరీక్షలు తప్పనిసరి చేసినట్లు విమానాశ్రయ అధికారులు స్పష్టం చేశారు.

# శుద్ధి యురేనియం అప్పగించాల్సిందే

## ఇరాన్‌తో చర్చలపై తాజాగా ట్రంప్ వెల్లడి

వాషింగ్టన్, నినాదం:

అమెరికా`ఇరాన్ మధ్య జరుగుతున్న శాంతి చర్చల్లో అణు కార్యక్రమం కీలకాంశంగా మారింది. శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవాలని అమెరికా కోరుతుండగా, అందుకు ఇరాన్ పూర్తిగా అంగీకరించడం లేదు. తాజాగా ఇరాన్ అణు కార్యక్రమంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ వద్ద ఉన్న అధికంగా శుద్ధి చేసిన యురేనియంను అమెరికాకు అప్పగించాలని, లేదంటే అంతర్జాతీయ పర్యవేక్షణలో పూర్తిగా ధ్వంసం చేయాలని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యక్రమం ప్రపంచ దేశాలకు ముప్పుగా మారే అవకాశముందని ట్రంప్ హెచ్చరించారు. అధిక శుద్ధి చేసిన యురేనియం ద్వారా అణ్వాయుధాల తయారీ సాధ్యమవుతుందని, అందుకే దీనిపై కఠిన చర్యలు అవసరమని పేర్కొన్నారు. అమెరికా జాతీయ భద్రతను కాపాడేందుకు అవసరమైతే మరింత కఠిన నిర్ణయాలు తీసుకుంటామని కూడా చెప్పారు . కాగా, తమ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ అంగీకరించినట్టు వార్తలు వస్తున్నాయి. తాము అణ్వాయుధం కోసం వెంపర్లాడడం లేదని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఇరాన్ శుద్ధి చేసిన ఆ యురేనియాన్ని అమెరికాకు అప్పగించాలని లేకపోతే నాశనం చేయాలని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ట్రూత్‌లో పోస్ట్ పెట్టారు. శుద్ధి చేసిన యురేనియంను నిర్వీర్యం చేసేందుకు అమెరికాకు అప్పగించాలి. లేకపోతే అటామిక్ ఎనర్జీ కమిషన్ లేక దాని సమానస్థాయి సంస్థ ఇరాన్‌తో సమన్వయం చేసుకొని.. ఒక ఆమోద యోగ్యమైన ప్రదేశంలో దానిని నాశనం చేయాలని ట్రంప్ రాసుకొచ్చారు. తన వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ సూత్రప్రాయంగా అంగీకరించిందని ఇప్పటికే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇదిలాఉంటే.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. 70కి పైగా హెజ్‌బొల్లా స్థావరాలను టార్గెట్ చేసింది. 10 కమాండ్ సెంటర్లు సహా ఆయుధ డిపోలను ధ్వంసం చేసినట్లు ఆ దేశ సైన్యం వెల్లడించింది.

# మహిళల భద్రత, గౌరవానికి ప్రాధాన్యం

## - సంపద సృష్టించే శక్తిగా మహిళలకు ప్రోత్సాహం
## - సఖి నివాస్ వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ప్రారంభించిన సీతక్క

హైదరాబాద్, నినాదం:

మహిళల భద్రత, వారి గౌరవానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రావిణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క చెప్పారు. మహిళల ఉన్నతే తెలంగాణ ప్రగతి అని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణ పరిమితి పెంచుతున్నట్లు మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళలను సంపద సృష్టించే శక్తిగా తీర్చిదిద్దుతున్నామని వ్యాఖ్యానించారు. మహిళల ఆదాయం పెరిగితే కుటుంబం బలపడుతుందని పేర్కొన్నారు. మంగళవారం బంజారాహిల్స్‌లో సఖి నివాస్ వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క హాజరై మాట్లాడారు. జూన్ 5వ తేదీన మహిళలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీ బస్సులు అందజేస్తారని తెలిపారు. మహిళా సంఘాల సోలార్ ప్లాంట్లను బుధవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మధిరలో ప్రారంభిస్తారని పేర్కొన్నారు. వర్కింగ్ ఉమెన్స్ భద్రత తమ ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. గ్రావిOణ మహిళలకు హైదరాబాద్‌లో సురక్షిత వసతి కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. సఖి నివాస్‌లో 150 మంది మహిళలకు వసతి సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు. చిన్నపిల్లలతో వచ్చే తల్లులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధి మహిళల పురోగతితోనే ముడిపడి ఉందని నమ్మిన ప్రభుత్వం తమదని స్పష్టం చేశారు. మహిళలు కేవలం చిన్న చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఇందుకోసం మండలాల్లో రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను కేటాయించడానికి సిద్ధంగా ఉందన్నారు. కార్పొరేట్ మార్కెట్ రంగంలోకి మహిళలను తీసుకెళ్లేందుకు 'మహిళా శక్తి సూపర్ బాజార్ల'ను ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించారు.

# ఎండల తీవ్రత మరింత పెరుగుదల

## రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక ఉష్ణోగ్రతలు

హైదరాబాద్ : ఈ ఏడాది నైరుతి రుతుపవనాల రాక మరింత ఆలస్యమయ్యే పరిస్థితులు ఉన్నట్టు వాతావరణశాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. దీంతో ఎండల తీవ్రత మరింతగా కొనసాగనుంది. వరుసగా రోహిణి రెండోరోజు కూడా ఎండలు మండుతున్నాయి. నిజానికి రుతుపవనాలు ఈనెల 26న కేరళ తీరాన్ని తాకుతాయని అంచనా వేసినప్పటికీ వాతావరణ మార్పులతో, జూన్ 5నుంచి 10 వరకు నైరుతి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉన్నదని తెలిపింది. జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో ఎల్‌నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదయ్యే సూచనలున్నట్టు హెచ్చరించింది. 20 జిల్లాల్లో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాంలో అత్యధికంగా 46.5 డిగ్రీలు, మంచిర్యాల జిల్లా దండేపల్లిలో 46.4, సూర్యాపేట జిల్లా మద్దిరాలలో 46.4, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో 46.3, ఖమ్మం జిల్లా ఏన్కూర్‌లో 46.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని తెలిపింది. రాష్ట్రంలో మరో నాలుగురోజులపాటు తీవ్రమైన ఎండలు, వడగాలులు ఉంటాయని వాతావరణశాఖ వెల్లడించింది. దీంతో ఆయా జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసినట్టు తెలిపింది.రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బ మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. ఈ క్రమంలోనే ఆదివారం ఒక్కరోజే దాదాపు 42మంది మృతి చెందారు. ఒక్క వరంగల్‌లోనే అత్యధికంగా 20మంది మృతి చెందగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10మంది, కరీంనగర్‌లో 8 మంది, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మృత్యువాతపడ్డారు. రాబోయే రోజుల్లో కూడా 43 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అధికారులు హెచ్చరించారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్నం వరకు ఎండలు దంచికొట్టగా, సాయంత్రం మాత్రం అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిశాయని వివరించింది. ముఖ్యంగా నల్లగొండ, వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసినట్టు తెలిపింది. కామారెడ్డి, మెదక్, పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో మోస్తరు వాన కురువగా, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్‌లో భారీ వర్షం కురిసినట్టు పేర్కొన్నది.



# సంతాన ప్రాప్తి, ఐశ్వర్య ప్రదాయిని: పద్మిని ఏకాదశి వ్రతం

**పద్మిని ఏకాదశి ఉపవాసం:**
**ఆధ్యాత్మిక సాధన - వైజ్ఞానిక సత్యం**

హిందూ ధార్మిక సంప్రదాయంలో కాల గణన అనేది కేవలం లౌకిక అవసరాల కోసం ఏర్పడింది కాదు; అది మానవ జీవనాన్ని ఆధ్యాత్మిక ఉన్నతి వైపు నడిపించే ఒక దివ్య మార్గం. ఈ కాల చక్రంలో ప్రతి మాసానికి, ప్రతి తిథికి ఒక విశిష్టమైన ప్రాధాన్యత ఉంది. అటువంటి తిథులలో అత్యంత పుణ్యప్రదమైనది, హరిప్రియమైనది ఏకాదశి తిథి. సాధారణంగా చాంద్రమానం ప్రకారం సంవత్సరానికి ఇరవై నాలుగు ఏకాదశులు వస్తాయి. కానీ, సూర్య గమనానికి, చంద్ర గమనానికి మధ్య ఉన్న కాల వ్యత్యాసాన్ని సమన్వయం చేస్తూ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి ఖగోళ శాస్త్ర నియమబద్ధంగా సంభవించే అధిక మాసంలో మరో రెండు ఏకాదశులు అదనంగా చేరతాయి. ఆ అదనపు తిథులలో అధిక మాసపు శుక్ల పక్షంలో వచ్చే పరమ పవిత్రమైన ఏకాదశినే 'పద్మిని ఏకాదశి' అని పిలుస్తారు. దీనినే 'కమలా ఏకాదశి' అని కూడా అంటారు. వైష్ణవ సంప్రదాయంలో అధిక మాసానికి 'పురుషోత్తమ మాసం' అని పేరు ఉండడం వల్ల, ఈ మాసంలో వచ్చే పద్మిని ఏకాదశి వ్రత ఆచరణకు సాధారణ ఏకాదశుల కంటే అనంత రెట్ల పుణ్యఫలం లభిస్తుందని పురాణ వాఙ్మయం ఘోషిస్తోంది. ఈ రోజున ఉపవాస దీక్షను ఆచరించి శ్రీమహావిష్ణువును భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే కోటి యజ్ఞాలు చేసిన ఫలితంతో పాటు అశ్వమేధ యాగానికి మించిన సత్ఫలితాలు లభిస్తాయని హైందవ ధర్మ నిష్ఠుల నమ్మకం. 'పద్మిని' అనే పదానికి కమలసంబంధమైనది, సాక్షాత్తు లక్ష్మీ స్వరూపమైనది అనే గంభీరార్థాలు ఉన్నాయి. అందువల్ల ఈ ఏకాదశిని కేవలం నారాయణుని అనుగ్రహం కోసమే కాక, అష్టైశ్వర్య ప్రదాత అయిన శ్రీమహాలక్ష్మి కటాక్షాన్ని కూడా ఏక కాలంలో పొందే దివ్య దినంగా భక్తులు భావిస్తారు.

భారతీయ సనాతన పురాణాలలో ఈ ఏకాదశి యొక్క మహిమను, విశిష్టతను వ్యాస మహర్షి విస్తారంగా వర్ణించారు. ముఖ్యంగా 'స్కాంద పురాణం', 'పద్మ పురాణం' లోని ఉత్తర ఖండంలో పద్మిని ఏకాదశి వైభవం సుదీర్ఘంగా ప్రస్తావించబడింది. ద్వాపర యుగంలో ధర్మరాజు అయిన యుధిష్ఠిరుడు శ్రీకృష్ణుడిని అధిక మాస విశిష్టతను, అందులో వచ్చే శుక్లపక్ష ఏకాదశి ప్రాముఖ్యతను వివరించమని కోరినప్పుడు, పరమాత్ముడైన ఆ కృష్ణ పరమాత్మ స్వయంగా ఈ వ్రత విధానాన్ని వివరించినట్లు కథనం. సాధారణ మాసాల్లో చేసే దానధర్మాలు, నదీ స్నానాలు ఒక ఎత్తయితే, పురుషోత్తమ మాసంలో చేసే పద్మిని ఏకాదశి వ్రతం మానవుడి అనంత జన్మల పాపక్షయాన్ని కలిగించి, అంతిమంగా మోక్ష మార్గాన్ని సుగమం చేస్తుందని జగద్గురువు అయిన శ్రీకృష్ణుడు పేర్కొన్నాడు. భౌతిక ప్రాపంచిక సుఖాలలో మునిగి తేలే మానవుడికి ఆధ్యాత్మిక చైతన్యాన్ని ప్రసాదించే అమృత ఘడియ ఈ తిథి.

పద్మిని ఏకాదశి ఆవిర్భావానికి మరియు దాని ప్రాశస్త్యానికి సంబంధించి పురాణాలలో ఒక అద్భుతమైన చారిత్రక కథనం ప్రసిద్ధిలో ఉంది. త్రేతాయుగంలో హైహయ వంశానికి చెందిన కృతవీర్యుడు అనే రాజు మహిష్మతీ నగర రాజధానిగా భూమండలాన్ని పరిపాలించేవాడు. ఆయన మహాబలశాలి, సత్యసంధుడు, ధర్మపరాయణుడు అయినప్పటికీ, అతనికి సంతానం కలగలేదు. సామ్రాజ్య లక్ష్మి ఉన్నా, సంతాన లక్ష్మి లేకపోవడంతో ఆ రాజు, అతని భార్య అయిన పద్మిని తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. పుత్రసంతానం లేని జీవితం నిరర్థకమని భావించిన ఆ రాజదంపతులు, రాజ్యభారాన్ని అమాత్యులకు అప్పగించి, గంధమాదన పర్వతానికి తరలివెళ్లి కఠోర తపస్సు ప్రారంభించారు. కృతవీర్యుడు వేల సంవత్సరాలు తపస్సు చేసినా ఆశించిన ఫలితం దక్కలేదు. ఆ సమయంలో పద్మిని దేవి అనసూయా మాతను ఆశ్రయించి, తన భర్త తపస్సుకు ఫలితం దక్కే మార్గాన్ని, సంతాన ప్రాప్తిని కలిగించే వ్రతాన్ని ఉపదేశించమని ప్రార్థించింది. అప్పుడు అనసూయ ఆమెకు ముల్లోకాలలో అత్యంత దుర్లభమైన, మూడు సంవత్సరాలకు ఒకసారి వచ్చే అధిక మాస పద్మిని ఏకాదశి వ్రతాన్ని శాస్త్రోక్తంగా ఆచరించమని సూచించింది. అనసూయా దేవి ఆజ్ఞానుసారం పద్మిని దేవి అత్యంత నిష్ఠతో, నిర్జల ఉపవాసంతో, రాత్రి జాగరణలతో ఆ ఏకాదశి వ్రతాన్ని సంపూర్ణం చేసింది.

ఆమె అచంచలమైన భక్తికి, వ్రత ప్రభావానికి ప్రసన్నుడైన లక్ష్మీపతి శ్రీమహావిష్ణువు ప్రత్యక్షమై, వరం కోరుకోమనగా, ఆమె తన భర్త కోరికను తీర్చమని వేడుకుంది. అప్పుడు విష్ణుమూర్తి కృతవీర్యుడికి ముల్లోకాలలో ఎవరి చేతిలోనూ ఓడిపోని, కేవలం భగవదంశ సంభూతుడి చేతిలో మాత్రమే మరణం పొందే పరాక్రమవంతుడైన కుమారుడు జన్మిస్తాడని వరమిచ్చాడు. ఆ వ్రత ఫలంగా, పద్మిని దేవి గర్భాన కార్తవీర్యార్జునుడు జన్మించాడు. సహస్రబాహువులతో, అజేయమైన శౌర్యంతో విరాజిల్లిన కార్తవీర్యార్జునుడు లంకాధినేత అయిన రావణాసురుడిని సైతం యుద్ధంలో ఓడించి బంధించిన మహావీరుడు. ఒక సాధారణ స్త్రీ ఆచరించిన వ్రతం వల్లే అంతటి అసాధారణ కుమారుడు జన్మించాడనే ఈ పురాణ గాథ ద్వారా పద్మిని ఏకాదశి వ్రతం సంతాన ప్రాప్తిని, పోయిన ఐశ్వర్యాన్ని, శత్రువులపై విజయాన్ని ప్రసాదిస్తుందని భక్తులలో అచంచలమైన విశ్వాసం ఏర్పడింది.

ఈ ఏకాదశి వ్రత ఆచరణ విధానం అత్యంత కఠినమైనది, క్రమశిక్షణతో కూడుకున్నది. వ్రతాన్ని ఆచరించదలచిన భక్తులు దశమి నాడే తమ మనస్సును, శరీరాన్ని సిద్ధం చేసుకోవాలి. దశమి నాడు కేవలం సాత్వికాహారాన్ని, అది కూడా పగటి పూట ఒక పూట మాత్రమే భుజించి, కాంస్య (కంచు) పాత్రలను, మాంసాహారాన్ని, ఉల్లి, వెల్లుల్లి వంటి తామసిక పదార్థాలను పూర్తిగా విసర్జించాలి. ఏకాదశి రోజున సూర్యోదయానికి ముందే, బ్రహ్మ ముహూర్తంలో లేచి, నదీ స్నానం లేదా తీర్థ స్నానం ఆచరించి, తెల్లటి వస్త్రాలను ధరించాలి. పూజా మందిరంలో శ్రీమహావిష్ణువు సువర్ణ లేదా రజత విగ్రహాన్ని ప్రతిష్ఠించి, మట్టి పాత్రలలో దీపాలను వెలిగించాలి. నిర్మలమైన మనస్సుతో తులసీ దళాలు, సుగంధ పుష్పాలు, చందనంతో స్వామిని పూజించి, 'ఓం నమో నారాయణాయ' అనే అష్టాక్షరీ మంత్రాన్ని నిరంతరం జపించాలి. రోజంతా హరికథా శ్రవణం, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, గజేంద్ర మోక్షం, భగవద్గీత పఠనం చేయడం వల్ల ఆధ్యాత్మిక శక్తులు జాగృతమవుతాయి. ఏకాదశి నాడు సంపూర్ణ ఉపవాసానికి ప్రాధాన్యత ఉంది. అశక్తులు పండ్లు, పాలు వంటి ఫలాహారాన్ని స్వీకరించవచ్చు. రాత్రంతా నిద్రపోకుండా భజనలు, కీర్తనలతో జాగరణ చేయడం ఈ వ్రతంలో అత్యంత ముఖ్యమైన ఘట్టం. మరుసటి రోజు అనగా ద్వాదశి నాడు ఉదయాన్నే స్నానాది కార్యక్రమాలు ముగించుకుని, విష్ణుపూజ చేసి, బ్రాహ్మణులకు లేదా పేదలకు అన్నదానం, వస్త్రదానం చేసిన తర్వాతే భోజనం చేసి వ్రతాన్ని ముగించాలి. దీనినే 'పారణ' అంటారు. ఈ విధంగా త్రికరణ శుద్ధిగా ఆచరిస్తేనే వ్రత ఫలం సిద్ధిస్తుంది.

పద్మిని ఏకాదశి కేవలం బాహ్య ఆచారాలకు సంబంధించిన పండుగ మాత్రమే కాదు; ఇది మనిషిని అంతర్ముఖుడిని చేసే అద్భుతమైన ఆధ్యాత్మిక సాధన. ఉపవాసం అనే పదానికి 'భగవంతునికి సమీపంగా వసించడం' అని అర్థం. ఆహారాన్ని త్యజించడం ద్వారా ఇంద్రియాలు తమ ప్రాపంచిక సుఖాల నుంచి మళ్లుతాయి. దీనివల్ల మనస్సు చంచలత్వం కోల్పోయి, ఏకాగ్రత లభిస్తుంది. ఆధునిక వైద్య శాస్త్రం మరియు పోషకాహార పరిశోధనలు సైతం ఏకాదశి ఉపవాసంలోని వైజ్ఞానిక సత్యాన్ని అంగీకరిస్తున్నాయి. నిరంతరం శ్రమించే జీర్ణవ్యవస్థకు నిర్దిష్ట వ్యవధిలో విశ్రాంతిని ఇవ్వడం ద్వారా శరీరంలోని అవయవాల పనితీరు మెరుగవుతుంది. శరీరంలో పేరుకుపోయిన విషపదార్థాలు (టాక్సిన్స్) బయటకు పంపబడి, రక్తం శుద్ధి అవుతుంది. ఉపవాసం వల్ల మెదడులోని నరాల చైతన్యం పెరిగి, మానసిక ఒత్తిడి తగ్గుతుందని, గుండె ఆరోగ్యానికి ఇది ఎంతో మేలు చేస్తుందని ఆధునిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సనాతన ధర్మం ఆరోగ్య సూత్రాలను ఆధ్యాత్మికతతో ముడిపెట్టి మానవాళికి అందించిన జీవన విధానానికి ఏకాదశి సంప్రదాయమే అతిపెద్ద నిదర్శనం.

తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో పద్మిని ఏకాదశిని భక్తులు పరమ పవిత్రంగా జరుపుకుంటారు. గ్రామీణ ప్రాంతాల నుండి నగరాల వరకు ఉన్న వైష్ణవ ఆలయాలన్నీ హరినామ స్మరణతో మారుమోగుతాయి. తిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయం, యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం, భద్రాచలం సీతారామచంద్ర స్వామి ఆలయం, అహోబిలం, మంగళగిరి వంటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో ఈ రోజున ప్రత్యేక అభిషేకాలు, ఊంజల్ సేవలు, సహస్రనామార్చనలు వైభవంగా నిర్వహిస్తారు. గృహాలలో మహిళలు సాయంత్రం వేళల్లో ఆకాశదీపాలు, తులసి కోట ముందు దీపారాధనలు చేసి లక్ష్మీనారాయణుల కృప కోసం ప్రార్థిస్తారు. ప్రస్తుత ఆధునిక కాలంలో, యాంత్రిక జీవన విధానం వల్ల మానవుడు తీవ్రమైన మానసిక ఆందోళనలను, అశాంతిని ఎదుర్కొంటున్నాడు. ఇటువంటి తరుణంలో పద్మిని ఏకాదశి వంటి పర్వదినాలు మనిషికి ఆత్మనిగ్రహాన్ని, మానసిక ప్రశాంతతను మరియు నైతిక శక్తిని ప్రసాదిస్తాయి. భౌతిక సంపదల వెనుక పరిగెత్తే క్రమంలో మానవత్వాన్ని, ఆధ్యాత్మిక విలువలను మరచిపోకూడదనే శాశ్వత సందేశాన్ని ఈ వ్రతం అందిస్తుంది. యుగయుగాలుగా భారతీయ సంస్కృతిని, సనాతన జీవన వైభవాన్ని సమున్నతంగా నిలిపిన ఇటువంటి పర్వదినాల ప్రాశస్త్యాన్ని తెలుసుకుని, వాటిని ఆచరించడం నేటి తరానికి ఎంతో ఆవశ్యకం.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**కాలమిస్ట్...9440595494**

# చాపకింద నీరులా ఎబోలా వ్యాప్తి !

ఎబోలా వణికిస్తోంది. కరోనా అంత వేగంగా కాకపోయినా మెల్లగా చాపకింద నీరులా విస్తరిస్తోంది. దీంతో ఇప్పుడు ప్రపంచ దేశాలకు కొత్త తలనొప్పి ప్రారంభం అయ్యింది. ఆఫ్రికా దేశాల నుంచి ఇతర దేశాలకు విస్తరించకుండా కట్టుదిట్టమైన చర్యలకు ఉపక్రమించారు. ఇప్పటికే ప్రపంచ దేశాలు అప్రమత్తం అయ్యాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా అన్ని దేశాలకు హెచ్చరికలు జారీచేసింది. కేవలం వారాల వ్యవధిలోనే మ డు దేశాలకు పాకిన ఎబోలా వందల మందికి సోకింది. భౌగోళికంగా కూడా ఈ వ్యాధి వ్యాపించిన ప్రదేశంలో కట్టడి చేయడం చాలా కష్టమని అంతర్జాతీయ ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మనుషులకు సోకే నాలుగు రకాల ఎబోలా వైరస్‌ల్లో బుండిబుగ్యో ఒకటి. దీనిని ఉగాండాలోని ఓ పర్వత ప్రాంతంలో తొలిసారి కనుగొన్నారు. గతంలో రెండుసార్లు మాత్రమే వ్యాపించడంతో అధికారులు పెద్దగా దృష్టిపెట్టలేదు. ఫలితంగా తాజాగా వ్యాపించిన ప్రదేశంలోని ల్యాబ్ పరీక్షల్లో దీనిని గుర్తించే సౌకర్యం లేకపోవడంతో.. గుర్తించేందుకు జాప్యం జరిగింది. మొదటి దీనిని గుర్తించేందుకు నమ నాను వేల మైళ్ల దూరంలో ఉన్న గవర్నమెంట్ రీసెర్చి ల్యాబ్‌కు పంపాల్సి వచ్చింది. ఈశాన్య కాంగోలోని యుద్ధ ప్రభావిత ప్రాంతమైన ఉగాండా సరిహద్దుల్లో తొలి ఎబోలా కేసు నమోదైంది. అక్కడ ఒక హెల్త్ వర్కర్ వాంతులు, జ్వరంతో చికిత్స తీసుకొని కొన్ని రోజుల్లోనే మరణించారు. ఆ తర్వాత ఆ మృతదేహాన్ని అంత్యక్రియల కోసం ఇంటికి తరలించారు. దానిని తాకిన చాలా మందికి కొన్నాళ్లకే ఎబోలా లక్షణాలు బయటపడ్డాయి. వైరస్ సోకిన వారికి కొన్ని వారాలపాటు వ్యాధి లక్షణాలు బయటపడకపోవడంతో ఎక్కువ మందికి సోకే అవకాశం కలుగుతోంది. వ్యాధి వ్యాపించిన ప్రదేశం కాంగోలో ప్రధాన మైనింగ్ కేంద్రం కావడంతో జనాభా రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో 2018లో ఎబోలా వ్యాపించిన సమయంలో దానిని కట్టడి చేయడానికి ఏకంగా రెండేళ్ల సమయం పట్టింది.ఎబోలాలో జైర్ అనే స్ట్రెయిన్ అత్యంత వేగంగా వ్యాపిస్తుంది. దీంతో పోలిస్తే బుండిబుగ్యో ఎబోలా వైరస్ కొంచెం నెమ్మదిగానే తన సంఖ్యను పెంచుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. పశ్చిమాఫ్రికా ప్రాంతంలో 2014లో 11,300 మంది ప్రాణాలు తీసింది జైర్ వేరియంట్. ఇది చరిత్రలోనే అతిపెద్ద ఎబోలా వ్యాప్తి. దీంతో పోలిస్తే బుండిబుగ్యో వేరియంట్ సోకిన వారిలో 30? మంది మాత్రమే ప్రాణాలు కోల్పోయారు. కాకపోతే దీనికి ఇప్పటి వరకు ఎలాంటి వ్యాక్సిన్, చికిత్స లేకపోవడం ఇబ్బందికరంగా మారింది.ఈశాన్య కాంగోలోని ఇటూరి ప్రావిన్స్‌లో ఎబోలా వేగంగా వ్యాపిస్తోంది. రోజు రోజుకూ మృతులసంఖ్య పెరుగుతుండటంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ బుండిబుగ్యో ఎబోలాను అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనకరమైన పబ్లిక్ హెల్త్ ఎమ్జ◌ం◌్గ□న్సీగా ప్రకటించింది. ప్రస్తుతం కాంగో, ఉగాండ, దక్షిణ సూడాన్‌లలో వ్యాప్తి తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించింది. మరోవైపు భారత ప్రభుత్వం కూడా బుండిబుగ్యో ఎబోలాపై అప్రమత్తమైంది. ప్రజలు అత్యవసరమైతే తప్ప కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాలకు ప్రయాణించవద్దని హెల్త్ అడ్వైజరీ జారీ చేసింది. ఇపపటివరకు కాంగోలో మొత్తం 867 మందికి ఈ వ్యాధి వ్యాపించగా.. 204 మరణాలు నమోదయ్యాయి. ఎబోలా ఎఫెక్ట్ భారత్‌పైనా పడింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో ఈ నెలాఖరులో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగాల్సిన నాల్గవ 'ఇండియా`ఆఫ్రికా ఫోరమ్ సమ్మిట' వాయిదా పడింది. ఆఫ్రికా ఖండంలోని కొన్ని దేశాల్లో ప్రస్తుతం కలకలం రేపుతున్న ఎబోలా వైరస్ వ్యాప్తి దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు భారత ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. మరోవైపు ముందస్తు జాగ్రత్తగా కేంద్ర ఆరోగ్య శాఖ దేశవ్యాప్తంగా అప్రమత్తత ప్రకటించింది. ముందుగా నిర్దేశిరచిన షెడ్యూల్ ప్రకారం 4వ ఇండియా`ఆఫ్రికా ఫోరమ్ సమ్మిట్ మే 28 నుంచి మే 31 వరకు న్యూఢిల్లీలో జరగాల్సి ఉంది. ఈ క్లిష్ట సమయంలో ఆఫ్రికా దేశాలకు భారత్ తన పూర్తి సంఘీభావాన్ని తెలియజేసిందని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. 'ఆఫ్రికా సీడీసీ' నేతృత్వంలో జరుగుతున్న ప్రజారోగ్య సన్నద్ధత, అత్యవసర పరిస్థితుల నియంత్రణ ప్రయత్నాలకు భారత్ తన వంతు సాంకేతిక, వైద్య సహకారాన్ని అందించడానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేసింది. ఎబోలా వ్యాప్తి నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య సేవల డైరెక్టరేట్ జనరల్ అంతర్జాతీయ ప్రయాణికులకు కీలకమైన హెల్త్ అడ్వైజరీ జారీ చేసింది. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే వారు లేదా ఆయా దేశాల వి దుగా`ప్రయాణించి భారత్‌కు వచ్చే వారు ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్‌కు ముందే తమ ఆరోగ్య పరిస్థితిని అధికారులకు నివేదించాలని ఆదేశించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ 'హై`రిస్క్'గా వర్గీకరించిన డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, సౌత్ సూడాన్ దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా ఉంచనున్నారు. ఎబోలా లక్షణాలు ఉన్నా లేదా బాధితులతో పరిచయం ఉన్నా ప్రయాణికులు స్వచ్ఛందంగా విమానాశ్రయ ఆరోగ్య అధికారులకు తెలపాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి భారతదేశంలో ఎక్కడా ఒక్క ఎబోలా కేసు కూడా నమోదు కాలేదని అధికారిక వర్గాలు స్పష్టం చేశాయి. డబ్ల్యూహెచఓ సూచనల ప్రకారం ప్రభుత్వం అన్ని ముందస్తు నివారణ చర్యలను తీసుకుంటోంది. అన్ని రాష్ట్రా□లు, కేంద్రపాలిత ప్రాంతాలు ఎబోలా నివారణకు అవసరమైన సన్నద్ధతతో ఉండాలని కేంద్రం ఆదేశించింది. 'ప్రభుత్వం పూర్తి అప్రమత్తంగా ఉంది. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం.. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ విషయంలో అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మండని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

సంపాదకీయం

# ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అభివృద్ధికి వరమా? ఉపాధికి ముప్పా?

**ప్రపంచాన్ని వేగంగా మార్చేస్తున్న సాంకేతిక విప్లవం ఏదైనా ఉందంటే అది "ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (AI)". ఒకప్పుడు సినిమాల్లో మాత్రమే కనిపించిన "మనుషుల్లా ఆలోచించే యంత్రాలు" ఇప్పుడు నిజ జీవితంలోకి వచ్చేశాయి. మొబైల్ ఫోన్‌లో మాట్లాడే వాయిస్ అసిస్టెంట్ నుంచి, బ్యాంకుల్లో మోసాలను గుర్తించే వ్యవస్థల వరకు, ఆసుపత్రుల్లో రోగ నిర్ధారణ నుంచి రైతుకు వాతావరణ సూచనలు ఇచ్చే యాప్‌ల వరకు... AI ప్రతి రంగంలోకి చొరబడుతోంది. అయితే ఇదే AI భవిష్యత్తులో ఉద్యోగాలకు ముప్పుగా మారుతుందా? లేక సమాజానికి కొత్త అవకాశాల ద్వారాలు తెరుస్తుందా? అన్న చర్చ ప్రపంచవ్యాప్తంగా సాగుతోంది.**

### AI అంటే ఏమిటి?

మనిషి చేసే ఆలోచన, నిర్ణయం, విశ్లేషణ, నేర్చుకునే సామర్థ్యాన్ని కంప్యూటర్లలో అమలు చేయడమే ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్. అంటే మనిషిలా డేటాను అర్థం చేసుకుని, నిర్ణయాలు తీసుకునే యంత్ర వ్యవస్థ. Chatbots, Self-driving vehicles, Voice Assistants, Facial Recognition, Smart Robots అన్నీ AI ఉదాహరణలే.

### ఉద్యోగాలకు AI ముప్పు నిజమేనా?

AI వల్ల ఎక్కువగా చర్చకు వస్తున్న అంశం "ఉద్యోగాల కోత". ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ రంగంలో ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఒకప్పుడు పదిమంది చేసే పనిని ఇప్పుడు AI ఆధారిత టూల్స్ ఒకరితోనే పూర్తి చేయిస్తున్నాయి.

### ప్రభావితమవుతున్న రంగాలు:

సాఫ్ట్‌వేర్ కోడింగ్, డేటా ఎంట్రీ, కాల్ సెంటర్లు, బ్యాంకింగ్ సేవలు
అకౌంటింగ్,
మీడియా కంటెంట్ తయారీ,
గ్రాఫిక్ డిజైన్, ఇప్పటికే అనేక కంపెనీలు AI వాడకంతో ఉద్యోగులను తగ్గిస్తున్నాయి. "ఆటోమేషన్" పేరుతో మనుషుల స్థానంలో యంత్రాలు వస్తున్నాయి. ప్రత్యేకంగా సాధారణ పనులు చేసే ఉద్యోగాలకు ప్రమాదం ఎక్కువగా ఉంది.

### సాఫ్ట్‌వేర్ రంగానికి దెబ్బ ఎందుకు?

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు గతంలో కోడ్ రాయడానికి గంటల సమయం తీసుకునేవారు. ఇప్పుడు AI కొన్ని నిమిషాల్లోనే కోడ్ సూచనలు ఇస్తోంది. టెస్టింగ్, బగ్ ఫిక్సింగ్, డాక్యుమెంటేషన్ వంటి పనులు ఆటోమేటిక్ అవుతున్నాయి. అందువల్ల కంపెనీలు తక్కువ మంది ఉద్యోగులతో ఎక్కువ పని చేయగలుగుతున్నాయి.
దీంతో కొత్త నియామకాలు, తగ్గుతున్నాయి.
ఫ్రెషర్లకు అవకాశాలు కష్టమవుతున్నాయి.
అధిక జీతాల ఉద్యోగాలపై ఒత్తిడి పెరుగుతోంది.అయితే మరోవైపు AI నేర్చుకున్న వారికి కొత్త అవకాశాలు కూడా వస్తున్నాయి. AI Engineers, Data Scientists, Cyber Security Experts, Machine Learning Specialists వంటి ఉద్యోగాలకు డిమాండ్ పెరుగుతోంది.

### సమాజానికి AI వల్ల లాభాలేమిటి?

AIని కేవలం ఉద్యోగాల కోణంలో మాత్రమే చూడలేం. ఇది సమాజానికి అనేక రంగాల్లో ఉపయోగపడుతోంది. వైద్య రంగం, AI ఆధారిత స్కానింగ్ ద్వారా వ్యాధులను త్వరగా గుర్తిస్తున్నారు. క్యాన్సర్ వంటి వ్యాధుల నిర్ధారణలో ఖచ్చితత్వం పెరుగుతోంది. వ్యవసాయం రైతులకు వాతావరణ హెచ్చరికలు, పంటల వ్యాధుల గుర్తింపు, నీటి వినియోగ నియంత్రణ వంటి సేవలు అందుతున్నాయి. విద్య
AI ద్వారా వ్యక్తిగత బోధన సాధ్యమవుతోంది. విద్యార్థి బలహీనతలను గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇవ్వగలుగుతోంది.
రవాణా
ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నివారణ, స్మార్ట్ ట్రాన్స్‌పోర్ట్‌లో AI కీలక పాత్ర పోషిస్తోంది.

### ప్రభుత్వ సేవలు

ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం, అవినీతి తగ్గించడం, డేటా విశ్లేషణ ద్వారా మంచి పాలన అందించడం సాధ్యమవుతోంది.

### ప్రభుత్వాలకు AI వల్ల ప్రయోజనాలేమిటి?

ప్రభుత్వాలు AIని ఇప్పుడు "భవిష్యత్తు పాలనా ఆయుధం"గా చూస్తున్నాయి.
ముఖ్య ప్రయోజనాలు:
ప్రజా సేవల వేగవంతం
పన్నుల ఎగవేత నియంత్రణ,
నేరాల విశ్లేషణ,
స్మార్ట్ సిటీల అభివృద్ధి,
ఆరోగ్య, విద్య రంగాల్లో మెరుగైన పర్యవేక్షణ,
ప్రకృతి విపత్తుల ముందస్తు హెచ్చరికలు.
భారత్ కూడా "డిజిటల్ ఇండియా", "AI మిషన్" పేరుతో AI అభివృద్ధిపై భారీగా దృష్టి పెడుతోంది. నిరుద్యోగులకు AI ఎలా ఉపయోగపడుతుంది?
AIని భయంగా కాకుండా "కొత్త నైపుణ్యాల అవకాశం"గా చూడాలి. గతంలో కంప్యూటర్లు వచ్చినప్పుడు కూడా ఉద్యోగాలు పోతాయని భయపడ్డారు. కానీ కొత్త ఉద్యోగాలు కూడా పుట్టుకొచ్చాయి. అలాగే AI కూడా కొత్త రంగాలను తెస్తోంది.
AI వల్ల వచ్చే కొత్త అవకాశాలు:
AI టూల్స్ ట్రైనింగ్,
డిజిటల్ మార్కెటింగ్,
యూట్యూబ్, కంటెంట్ క్రియేషన్,
ఫ్రీలాన్సింగ్,
డేటా అనలిసిస్, సైబర్ సెక్యూరిటీ, రోబోటిక్స్
AI ఆధారిత స్టార్టప్స్
గ్రామీణ యువత కూడా మొబైల్, ఇంటర్నెట్ సహాయంతో AI టూల్స్ నేర్చుకుని ఉపాధి పొందే అవకాశాలు ఉన్నాయి.
AI వల్ల వచ్చే ప్రమాదాలు కూడా ఉన్నాయి.

AIకి లాభాలున్నట్లే ప్రమాదాలు కూడా ఉన్నాయి.

### ప్రధాన ముప్పులు:

ఉద్యోగాల కోత
ఫేక్ వీడియోలు, డీప్ ఫేక్ మోసాలు,
వ్యక్తిగత గోప్యతకు భంగం,
సైబర్ నేరాలు,
యంత్రాలపై అధిక ఆధారపడటం,
మానవ ఆలోచనా శక్తి తగ్గిపోవడం.
అందుకే AIపై నియంత్రణ చట్టాలు అవసరం. టెక్నాలజీ మనిషిని నియంత్రించకుండా, మనిషి టెక్నాలజీని నియంత్రించే విధానం ఉండాలి.

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఒకేసారి అవకాశం కూడా... సవాలు కూడా. దీనిని పూర్తిగా వ్యతిరేకించడం సాధ్యం కాదు. ప్రపంచం AI వైపు వేగంగా పయనిస్తోంది. కానీ ఈ మార్పులో మనిషి వెనుకబడకూడదు. విద్యా వ్యవస్థలో మార్పులు, కొత్త నైపుణ్యాలపై శిక్షణ, యువతకు సాంకేతిక అవగాహన పెంపు అత్యవసరం. "AI మన ఉద్యోగాన్ని తీసేస్తుందా?" అన్న భయంతో కాకుండా... "AIతో కలిసి ఎలా ఎదగాలి?" అన్న దిశగా ఆలోచించినవారే భవిష్యత్తులో నిలబడగలరు.

ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9440287170.
kamareddyab@gmail.com



# ప్రశ్నించే గొంతుకను అణచడమే కాంగ్రెస్ ధ్యేయమా?

## సమస్యల పరిష్కారం పై ప్రభుత్వం దృష్టి సారించాలి

## బీజేపీ నియోజకవర్గ ఇంచార్జీ భోగ శ్రావణి

**జగిత్యాల ప్రతినిధి, మే 26 (నినాదం)**

ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రశ్నించే గొంతుకలను అణిచివేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని, ప్రజా సమస్యలపై దృష్టి సారించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని బీజేపీ నియోజకవర్గ ఇంచార్జీ డాక్టర్ భోగ శ్రావణి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బిజెపి జగిత్యాల నియోజకవర్గ కార్యాలయం కమల నిలయంలో ప్రత్యేక విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇటీవల కేంద్రీయ విద్యాలయం కోసం స్థలం కేటాయించాలని కోరుతూ నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరాహార దీక్షకు పోలీసులు అనుమతి నిరాకరించారని, అయితే పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచారని ఆరోపిస్తూ కాంగ్రెస్ నేతలు ధర్నా చేయడానికి పోలీసులు ఏ విధంగా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. తమకో న్యాయం, అధికార పార్టీ నేతలకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు. శాంతియుతంగా చేసే దీక్షకు పోలీసులు అనుమతి నిరాకరించి, కాంగ్రెస్ నేతలు చేపట్టిన ధర్నాకు మాత్రం పోలీసులు అనుమతి ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ధర్నా ముసుగులో అన్ని రకాల దుకాణాలను బందు చేయించి, అత్యవసర సమయంలో ఉపయోగపడే మెడికల్ దుకాణాలను సైతం మూసి వేయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఓవైపు ధాన్యం కొనుగోలు సక్రమంగా జరగక కల్లాలు సక్రమంగా ఏర్పాటు చేయక రైతులు దాన్యం ఆరబెట్టుకోవడానికి కూడా ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఒక బస్సు డ్రైవరు ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నించగా అతని ఉద్యోగాన్ని తొలగించి రోడ్డుపైన వచ్చే విధంగా చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లుతుందన్నారు. అన్యాయాన్ని ప్రశ్నించిన ప్రతి ఒక్కరిని ఇబ్బందులకు గురి చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటేనన్నారు. పెట్రోల్, డీజిల్ పై దేశంలోనే ఎక్కడా లేనివిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధికంగా ఎక్సైజ్ డ్యూటీ, వ్యాట్ జోడించి ఎక్కువ రేటుకు పెట్రోల్, డీజిల్ అమ్ముతున్నారని ఆరోపించారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో పెట్రోల్, డీజిల్ రేట్లను ప్రజలు గమనించాలని కోరారు. అడ్డగోలుగా ఎక్సైజ్ డ్యూటీ, వ్యాట్ పెంచుతూ సామాన్య జనాన్ని ఇబ్బందులు పెట్టడం రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలన్నారు. అంతేకాకుండా ఇటీవల నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ జగిత్యాల నియోజకవర్గానికి కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేయించగా దానిపైన కూడా రాజకీయం చేస్తూ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అనుకూలమైన స్థలం కేటాయించకుండా కుట్రలకు పాల్పడుతున్నారని విమర్శించారు. అనువైన స్థలాన్ని కాకుండా తన స్వలాభం కొరకు తనకు నచ్చిన ప్రాంతంలో స్థలానికి కేటాయించడానికి ప్రయత్నిస్తుండడం సిగ్గుచేటన్నారు. నియోజకవర్గంలో ఇంత జరుగుతున్నప్పటికీ జిల్లాకు చెందిన మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ ఏ విధంగా కూడా స్పందించకపోవడం బాధాకరమన్నారు. జిల్లా ప్రజల సమస్యలు పరిష్కరించలేని మంత్రి ఉండి కూడా లాభం లేదని విమర్శించారు. డ్యూటీ నుంచి తొలగించిన ఆర్టీసీ డ్రైవర్ ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని, ఐకెపి కేంద్రాల్లో కొనుగోలు సజావుగా జరిగే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో బిజెపి తరపున భారీ ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ బిజెపి ఫ్లోర్ లీడర్ వేముల శ్రీనివాస్,42వ వార్డు కౌన్సిలర్ నిమ్మల నాగరాజు, దూరిశెట్టి మమత, సిరిపురం శ్రీనివాస్, గట్టి పెల్లి జ్ఞానేశ్వర్,పవన్ సింగ్, చిట్యాల రాము, గడ్డల లక్ష్మి , మేడిపల్లి పుష్ప రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు

# పుష్కర స్నానం.. పుణ్యఫలం

## ఆరవ రోజు అంతంత మాత్రమే భక్తుల రద్దీ

## పుష్కరాలపై ఎండ ప్రభావం

## పుష్కర స్నానం ఆచరించిన దేవాదాయ కమిషనర్ హనుమంతరావు

**భూపాలపల్లి ప్రతినిధి, మే 26 (నినాదం):**

సరస్వతి నది అంత్య పుష్కరాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఆరవ రోజు భక్తుల రద్దీ అంతంత మాత్రంగానే నెలకొంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్, కర్ణాటక నుంచి భక్తులు కాళేశ్వరానికి కొద్ది సంఖ్యలో తరలివచ్చారు. గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతినదిలో పుష్కర పుణ్యస్నానాలు ఆచరించారు. నదీమాతకు పూజలు చేశారు. పిండ ప్రదాన పూజలు చేశారు. పితృదేవతలకు తర్పనాలు నిర్వహించారు. నదీమాతకు దీరె, సారె సమర్పించారు. ముత్తయిదువలు వాయినాలు ఇచ్చిపుచ్చుకు న్నారు. భక్తుల తాకిడి తక్కువగా ఉండటంతో పుష్కర ఘట్లు వెలవెల బోయాయి.

**ఎండ వేడి ప్రభావం..**

సరస్వతి నది అంత్య పుష్కరాలపై మెసేజ్ కాలం ఎండ వేడి ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. గత రెండు రోజులుగా ఎండ తీవ్రత పెరగడంతో భక్తులు పుష్కర స్నానానికి రావడానికి జంకుతున్నారు. స్కేల్ పై ఎండ తీవ్రత 51 వరకు చేరుతుండడంతో ప్రజలు ఇళ్లలో నుండి బయటకు



రాలేని పరిస్థితి నెలకొంది. ఉదయం 9 గంటల నుండి ఎండ వేడి పెరిగిపోతుండడంతో ప్రజలు రోడ్డు ఎక్కలేకపోతున్నారు. దీంతో పుష్కర స్నానాలకు వచ్చే భక్తుల సంఖ్య సైతం తగ్గిపోయింది. ఉష్ణోగ్రతల ప్రభావం మరో రెండు నుండి మూడు రోజులు కొనసాగే అవకాశం ఉండడంతో పుష్కర స్నానాలకు వచ్చే భక్తుల సంఖ్య సైతం అంతంత మాత్రమే ఉండే అవకాశాలు లేకపోలేదు. భక్తులు ఎండ వేడి ప్రభావాన్ని గురికాకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ భక్తులు మాత్రం స్నానాలకు రావడానికి సంకోచిస్తున్నారు.

**దేవాదాయ కమీషనర్ పూజలు..**

సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా మంగళవారం పవిత్ర త్రివేణి సంగమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు కమిషనర్ కు పూర్ణ కుంభ స్వాగతం పలికి శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామివారికి అభిషేకం మరియు పార్వతి దేవి ఆలయంలో అర్చనల అనంతరం అర్చక స్వాములు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పుష్కరాల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, రోజు రోజుకు భక్తుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా స్వామి దర్శనం సత్వరం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేస్తున్న దృష్ట్యా పరిశుభ్రత, భద్రత, తాగునీరు మరియు ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఎడిసి ఎం కృష్ణవేణి, ఆర్ జేసీ రామకృష్ణారావు, డిప్యూటీ కమిషనర్ ఆర్ సునీత, ఆలయ ఈవో ఎస్ మహేష్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**మ్యూజియంను సందర్శించిన కలెక్టర్లు..**

కాళేశ్వరంలో సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేసిన శిలా సంపద మ్యూజియంను మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ములుగు, మంచిర్యాల,



పెద్దపల్లి, జగిత్యాల కలెక్టర్లు బొర్కడే హేమంత్ సహదేవరావు, కుమార్ దీపక్, కోయ శ్రీహర్ష, సత్య ప్రసాద్ సందర్శించారు. మ్యూజియంలో భద్రపరచిన అద్భుతమైన శిలా సంపదను వారు ఆసక్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి మ్యూజియంలో ఉన్న ప్రతి శిలా విగ్రహం యొక్క చారిత్రక ప్రాధాన్యత, శిల్పకళా విశిష్టతను వివరించారు. మ్యూజియం ద్వారా చారిత్రక, సాంస్కృతిక మరియు పర్యాటక విలువలను సమర్థవంతంగా ప్రజలకు పరిచయం చేస్తున్న తీరు ప్రశంసనీయమని కలెక్టర్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ శిలా సంపదను రక్షించేందుకు తీసుకున్న చర్యలు, మ్యూజియం ఏర్పాటు చేసి భద్రపరచడం అభినందనీయమని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, యువతకు ఇది విజ్ఞానాన్ని పెంపొందించే కేంద్రంగా ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. మ్యూజియం నిర్వహణలో నాణ్యత, శుభ్రత మరియు సందర్శకులకు కల్పిస్తున్న సౌకర్యాలపై కలెక్టర్లు హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి మ్యూజియంలను మరింత అభివృద్ధి చేస్తే పర్యాటక రంగానికి మంచి ప్రోత్సాహం లభిస్తుందని సూచించారు.

అనంతరం సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లను కలెక్టర్ల బృందం సభ్యులు పరిశీలించారు. కాళేశ్వరం లో సరస్వతి అంత్య పుష్కరాలలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన టెంట్ సిటీ పుష్కర ఘాట్ కు చేరుకొని గోదావరి నది లో చేసిన ఏర్పాట్లు భక్తులు వేసవి నుండి ఉపశమనానికి ఏర్పాటు చేసిన స్ప్రింక్లర్స్ ద్వారా నీటి జల్లులు కురిసే విధానాన్ని పరిశీలించి ఘాట్ లో ఏర్పాటు చేసిన స్టోన్ క్లోడింగ్ పరిశీలించారు. అనంతరం దేవాలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ ఈఓ కలెక్టర్లకు శేషావస్త్రాలు అందించి వేదాశీర్వచనాలు అందించారు. అక్కడి నుంచి సరస్వతి ఘాట్ కు చేరుకొని సరస్వతి నవరత్న మాలా హారతి, సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్, నిజామాబాద్ అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, బుజంగరావు, విజయ లక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోళ్ల ప్రక్రియ వేగంగా జరిగేలా చూడాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి ప్రతినిధి, మే 26(నినాదం):**

తహసీల్దార్లు ప్రత్యేక అధికారులుగా వ్యవహరించి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగంగా జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. మంగళవారం ఐడిఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్డీఓలు, తహసీల్దార్లు, రైస్ మిల్లర్లు, ఏ.పి.ఎం లు, పిఏసిఎస్ సి.ఈ.ఓ లతో ధాన్యం కొనుగోళ్ల పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు జాప్యం లేకుండా జరిగేందుకు తహసీల్దార్లు ప్రత్యేక అధికారులుగా వ్యవహరించి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. మిగతా జిల్లాలతో పోలిస్తే మనజిల్లాలో పంటల కోతలు లేటుగా జరుగుతాయని కాబట్టి ఈ నెల చివరి వరకు ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యేలా చూడాలని స్పష్టంచేశారు. లారీల కొరత ఉన్న చోట



ట్రాక్టర్ల ద్వారా మిల్లులకు తరలించాలని సూచించారు.స్వచ్ఛందంగా ట్రాక్టర్ల ద్వారా రైతులు ధాన్యం మిల్లులకు తరలిస్తే ట్రాక్టర్ ఛార్జీలు చెల్లిస్తామని తెలిపారు. గోదాముల కొరత లేకుండా ఉండేందుకు పత్తి మిల్లులను సైతం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఏ.పి.ఎం లు, పిఏసిఎస్ సిఈఓ లు ట్యాబ్ ఎంట్రి త్వరిత గతిన పూర్తి చేసి గోదాములకు ,మిల్లులకు తరలించాలని సూచించారు. తహసిల్దార్లు ప్రతి మిల్లు దగ్గర రెవెన్యూ సిబ్బందిని నియమించి పటిష్ఠ పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యాన్ని కాంటా వేసి గన్ని సంచులలో నింపి టార్పాలిన్లను కప్పి ఉంచాలని సూచించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి కొనుగోళ్లు నిర్ణీత సమయానికి పూర్తయ్యేలా చూడాలని గన్ని సంచుల కొరత, టార్పాలిన్ ల కొరత ఉంటే వెంటనే పై అధికారులకు సమాచారం అందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, డిఎం రాములు, డిఆర్డీఓ బాల కృష్ణ, ఆర్డీఓలు హరికృష్ణ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.




# నష్టాల్లో ముగిసిన సూచీలు



దేశీయ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడం, అంతర్జాతీయ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాల నేపథ్యంలో మన సూచీలు నష్టాల్లో కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్ 700 పాయింట్ల వరకు పతనమైంది. ట్రేడింగ్‌ను సూచీలు నష్టాలతోనే ప్రారంభించాయి. ఉదయం సెన్సెక్స్ 76,224 వద్ద మొదలైంది. చివరకు 479 పాయింట్లు నష్టంతో 76,009 వద్ద ముగిసింది. నిఫ్టీ 118 పాయింట్లు క్షీణించి, 23,913 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సూచీలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, టీఎంపీవీ, టెక్ మహీంద్రా, నెస్లే, ఎటర్నల్ షేర్లు రాణించాయి. అపోలో హాస్పిటల్స్, విప్రో, భారతీ ఎయిర్‌టెల్, ట్రెంట్, టీసీఎస్ షేర్లు నష్టపోయాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.73 వద్ద ముగిసింది. అమెరికా–ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కొలిక్కి వస్తుందన్న అంచనాల మధ్య క్రితం సెషన్‌లో సూచీలు రెండు వారాల గరిష్ఠాలకు చేరుకున్నాయి. అంతలోనే ఆ ఆశలకు అమెరికా దాడులు గండికొట్టాయి. దాంతో చమురు ధరలు పెరిగాయి. ఈ పరిణామాల నేపథ్యంలో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు నేటితో ముగియడంతో మదుపర్లు కాస్త అప్రమత్తత పాటించారు. మరోవైపు ఆసియా మార్కెట్లు కూడా నష్టాల్లో కదలాడాయి.

# భారీగా తగ్గిన వెండి



మంగళవారం బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరలు పతనమయ్యాయి. ఇరాన్ పై అమెరికా సైన్యం తాజాగా దాడులు జరపడంతో సురక్షిత పెట్టుబడులుగా భావించే ఈ లోహాలపై అమ్మకాల ఒత్తిడి పెరిగింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ లో బంగారం ఫ్యూచర్స్ సుమారు రూ.1,000 వరకు పడిపోయాయి. ఇక వెండి ఫ్యూచర్స్‌లో కూడా దాదాపు 2 శాతం మేర క్షీణత కనిపించింది. ఉదయం 10:25 గంటల సమయంలో ఎంసీఎక్స్‌లో జూన్ 5 గోల్డ్ ఫ్యూచర్స్ 0.61% నష్టంతో రూ.971 తగ్గి రూ.1,58,110 వద్ద ట్రేడ్ అయింది. ఇంట్రాడేలో రూ.1,58,000 కనిష్ఠ స్థాయిని తాకింది. మరోవైపు జూలై 3 సిల్వర్ ఫ్యూచర్స్ కూడా అమ్మకాల ఒత్తిడికి గురైంది. ఇంట్రాడేలో సుమారు 2% నష్టంతో రూ.5,000 కంటే ఎక్కువగా పతనమై రూ.2,71,972 కనిష్ఠాన్ని నమోదు చేసింది. కాగా, దక్షిణ ఇరాన్‌లోని క్షిపణి ప్రదేశాలు, పడవలపై అమెరికా సైన్యం దాడులు జరపడమే ఈ పతనానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. చర్చల కోసం ఇరాన్ తమ ప్రతినిధులను దోహాకు పంపిన సమయంలోనే ఈ దాడులు జరగడం గమనార్హం. అయితే అమెరికా దీనిని 'ఆత్మరక్షణ' చర్యగా పేర్కొన్నది. ఇదిలావుంటే ఈ భౌగోళిక ఉద్రిక్తతల కారణంగానే బులియన్ మార్కెట్లో ధరలు ప్రభావితమయ్యాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# 3.37 గిగావాట్ అవర్ ఎనర్జీ స్టోరేజ్




## అదానీ గ్రీన్ ఎనర్జీ రికార్డ్..

అదానీ గ్రీన్ ఎనర్జీ రికార్డు సృష్టించింది. గుజరాత్‌లోని ఖవ్‌డాలో 3.37 గిగావాట్ అవర్ బ్యాటరీ సామర్థ్యంతో ఎనర్జీ స్టోరేజ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ప్రకటించింది. దీంతో చైనా వెలుపల ఒకే చోట నిర్మించిన ప్రపంచంలోనే అతిపెద్ద బ్యాటరీ స్టోరేజీ సిస్టమ్‌గా ఇది నిలిచింది. దీని ద్వారా దాదాపు 10 లక్షల ఇళ్లకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయొచ్చు. ఈ భారీ ప్రాజెక్టును కేవలం 10 నెలల్లోనే అదానీ గ్రీన్ ఎనర్జీ పూర్తి చేయడం విశేషం. ఇందులో భాగంగా 1.37 గిగావాట్ అవర్ కెపాసిటీని మార్చిలోనే కంపెనీ ప్రారంభించింది. మిగిలిన సామర్థ్యాన్ని జోడించి మొత్తం 3.37 గిగావాట్ అవర్ కెపాసిటీకి చేర్చింది. దీని ద్వారా దాదాపు 10 లక్షల ఇళ్లకు రోజంతా సరిపడా విద్యుత్‌ను ఎలాంటి అంతరాయం లేకుండా అందిస్తామని కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాగర్ అదానీ తెలిపారు. సౌర, పవన వ్యవస్థల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును నిల్వ ఉంచి, అవసరమైనప్పుడు వాడుకునేలా ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఈ ప్రాజెక్టును నిర్మించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా దేశ ఇంధన రంగానికి స్వావలంబన, సుస్థిరత లభిస్తుందని దీనివల్ల నాణ్యమైన, అందుబాటు ధరలో విద్యుత్ లభిస్తుందని వెల్లడించారు.

# ఎలక్ట్రిక్ కారును ఆవిష్కరించిన ఫెరారీ



లగ్జరీ కార్ల తయారీ కంపెనీ ఫెరారి... కొత్తగా పూర్తి స్థాయి ఎలక్ట్రిక్ కారను ఆవిష్కరించింది. లూస్ అనే ఆ కారు ఖరీదు సుమారు ఆరున్నర లక్షల డాలర్లు. ఇటలీ బ్రాండ్ ఫెరారీ కంపెనీ తొలిసారి ఫైవ్ సీటర్ వాహనాన్ని తయారు చేసింది. లవ్‌ఫ్రమ్ ఏజెన్సీ సహకారంతో దీన్ని డిజైన్ చేశారు. సోషల్ మీడియాలో కొత్త ఎలక్ట్రిక్ ఫెరారీ కారుపై ప్రశంసలు కురుస్తున్నాయి. మాస్టర్‌క్లాస్ డిజైన్‌లో ఉన్నట్లు కొందరు పేర్కొన్నారు. అయితే ఎలక్ట్రిక్ కార్ల వ్యాపారంలో ప్రస్తుతం డిమాండ్ తక్కువగా ఉంది. దీంతో సూపర్ కార్లు తయారు చేసే లాంబోర్గిని, పోర్షే కంపెనీలు ప్రస్తుతం ఈవీ కార్లను అనుకున్నంత ఉత్పత్తి చేయడం లేదు. చైనా బ్రాండ్ల నుంచి తీవ్రమైన పోటీ ఉన్న నేపథ్యంలోనూ లగ్జరీ కంపెనీలు ఈవీ కార్లను లాంచ్ చేయలేక పోతున్నాయి. లూస్ అంటే ఇటలీ భాషలో కాంతి అని, ఈ కారును డెవలప్ చేసేందుకు అయిదేళ్లు పట్టిందని ఫెరారీ సీఈవో బెనడెట్టో విగ్నా తెలిపారు. లూస్ ఎలక్ట్రిక్ కారు వీల్స్‌కు ఎలక్ట్రిక్ మోటార్లు ఉన్నాయని, కేవలం 2.5 సెకన్లలో ఆ కారు 96 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుందని ఫెరారీ నిపుణులు చెబుతున్నారు. కారుకు సంబంధించిన అన్ని పరికరాలను ఇన్‌హౌజ్‌లోనే తయారీ చేసినట్లు చెప్పారు.



# ఎయిర్‌టెల్ 'ప్రయారిటీ పోస్ట్‌పెయిడ్' సేవకు మద్దతు

**హైదరాబాద్; బ్యూరో మే 26 ( నినాదం ):**


ఫై జి ఆధారిత 'ప్రయారిటీ పోస్ట్‌పెయిడ్' సేవ నెట్ న్యూట్రాలిటీ నిబంధనలకు విరుద్ధం కాదని భారతీ ఎయిర్‌టెల్ డీఓటీ ప్యానెల్‌కు స్పష్టం చేసింది. ఈ సేవలో ఎలాంటి కంటెంట్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడం, బ్లాక్ చేయడం లేదా థ్రాట్లింగ్ ఉండదని తెలిపింది.రద్దీ సమయాల్లో కూడా పోస్ట్‌పెయిడ్ వినియోగదారులకు స్థిరమైన వేగం అందించేందుకు ఫై జి నెట్‌వర్క్ స్లైసింగ్ సాంకేతికతను వినియోగిస్తున్నామని ఎయిర్‌టెల్ పేర్కొంది. ఈ సేవ వల్ల ప్రీపెయిడ్ వినియోగదారుల సేవా నాణ్యతపై ఎలాంటి ప్రభావం ఉండదని వెల్లడించింది. ప్రస్తుతం ఫై జి సామర్థ్య వినియోగం 38 శాతమేనని, అందులో పోస్ట్‌పెయిడ్ ట్రాఫిక్ వాటా కేవలం 4 శాతమని తెలిపింది.ఫై జి ప్రధాన సాంకేతికతలను వినియోగించకుండా పరిమితులు విధిస్తే, దేశంలో సిక్స్ జి అభివృద్ధి సామర్థ్యంపై ప్రభావం పడే అవకాశముందని ఎయిర్‌టెల్ అభిప్రాయపడింది.

# లక్షల మంది ఉద్యోగులను కాపాడుకోవడమే అసలైన సవాల్

## ఐబీఎం ఇండియా చీఫ్

భారతదేశంలో కృత్రిమ మేధ, మానవ వనరులను సమర్థవంతంగా వినియోగించడంపై ప్రముఖ టెక్ సంస్థ ఐబీఎం ఇండియా చీఫ్ సందీప్ పటేల్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ ఏఐలో అగ్రగామిగా నిలవాలంటే.. నైపుణ్యాభివృద్ధి, విధానాల విషయంలో ప్రభుత్వం, కంపెనీలు, విద్యాసంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే, ఐటీ కంపెనీలు ఉద్యోగులకు తిరిగి శిక్షణ ఇవ్వడంపైనా దృష్టిపెట్టాలని అన్నారు. అన్ని రంగాల్లోకి ఏఐ శరవేగంగా దూసుకొస్తున్నప్పటికీ.. ఈ కొత్త టెక్నాలజీ భారత్‌కు సవాల్ కాదు.. లక్షల మంది ఉద్యోగులను కాపాడుకోవడమే అసలైన సవాల్ అన్నారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడారు.

"ఏఐ రేసులో భారత్ దేశానికి ఉన్న ప్రత్యేక ప్రయోజనం యువతే. దేశ జనాభాలో సగం కన్నా ఎక్కువమంది 30 ఏళ్లలోపు వారే. ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ శ్రామిక శక్తిని నిర్మించడానికి ఇదొక గొప్ప అవకాశం. ఏఐ వేగానికి తగ్గట్టుగా నైపుణ్యాలను అందిపుచ్చుకోకపోతే.. మానవ వనరులు అనే ప్రత్యేకత వల్ల ప్రయోజనం ఉండదు" అని పటేల్ హెచ్చరించారు. మరోవైపు, కృత్రిమ మేధ కారణంగా ఐటీ రంగంలో ఉద్యోగులు ఉపాధి కోల్పోతున్నారు. జనరేటివ్ ఏఐ టూల్స్ కోడ్ రాస్తున్నాయి, డేటాను విశ్లేషిస్తున్నాయి. ఎంట్రీ లెవెల్ సిబ్బంది చేసే పనులనూ చకచకా పూర్తి చేస్తున్నాయి. ఏఐతో పూర్తిగా ఉద్యోగాలు పోనప్పటికీ.. అది పని స్వరూపాన్ని మాత్రం మార్చనుంది. నియామకాల సమయంలో కంపెనీల ఎంపికలూ మారనున్న పరిస్థితుల నేపథ్యంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి



## 'సర్'పై అన్ని పార్టీల సమీక్షా సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



**కుత్బుల్లాపూర్, మే 26 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ ఐఏఎస్ (ఈఆర్ఓ) ఆధ్వర్యంలో నిర్వహించిన అన్ని రాజకీయ పార్టీలతో కలిసి నిర్వహించిన సర్వపక్ష సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు. రాబోయే ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ సర్ ( స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్) కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో బి.ఎల్.ఓ, బి.ఎల్.ఏ లు ఏ విధంగా సమన్వయంతో పని చేయాలనే విధానంపై ఈ సమీక్షా సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణల ప్రక్రియను పారదర్శకంగా, విజయవంతంగా పూర్తి చేయడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై జోనల్ కమిషనర్ పలు సూచనలు చేశారు. ఈ సమీక్షా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ తరపున కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ముఖ్య నాయకులు మొహమ్మద్ జాకీర్, బేక్ శీను, బైరి ప్రశాంత్, శివ కుమార్ పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**పటాన్చెరు, మే26(నినాదం):** నూతనంగా ఏర్పడిన గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డును అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని అన్నారం, దోమడుగు, వీరన్న గూడెం, బొంతపల్లి, గుమ్మడిదలలో 15 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు స్థానిక పాలకవర్గం సభ్యులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ప్రతి వార్డులో మౌలిక వసతులతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటు గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని వివిధ పరిశ్రమల సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్యా గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దశరథ్, సీనియర్ నాయకులు విజయ్ భాస్కర్ రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గణితశాస్త్రంలో కస్ప శ్రీలతకు పీహెచ్.డీ.



**పటాన్చెరు, మే26(నినాదం):** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత, గణాంక శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని కస్ప శ్రీలత డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'నానోద్రవాలు, హైబ్రిడ్ నానోద్రవాలు అయస్కాంత-ద్రవగతి ప్రవాహ విశ్లేషణ' చేసి, ఆమె సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివారెడ్డి షేరి మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ డాక్టరల్ పరిశోధన, శక్తి వ్యవస్థలు, ఎలక్ట్రానిక్స్ శీతలీకరణ, పర్యావరణ నమూనా వంటి అధునాతన సాంకేతిక అనువర్తనాలలో ఉష్ణ, ద్రవ్యరాశి బదిలీ సామర్థ్యాన్ని మెరుగుపరచడంపై దృష్టి పెట్టినట్టు తెలియజేశారు. ఈ అధ్యయనం, నానోద్రవాలు, హైబ్రిడ్ నానోద్రవాలతో కూడిన సంక్లిష్ట నాన్-లీనియర్ ప్రవాహ వ్యవస్థలను విశ్లేషించడానికి గాలెర్కిన్ ఫైనైట్ ఎలిమెంట్ పద్ధతిని, మ్యాట్ లాబ్-ఆధారిత సిమ్యులేషన్లను ఉపయోగించిందన్నారు. ఈ పరిశోధన ఫలితాలు ఉష్ణ-ద్రవ వ్యవస్థలు, గతిశాస్త్ర పరిశోధనల పురోగతికి గణనీయంగా దోహదపడతాయని వివరించారు. డాక్టర్ శ్రీలత సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రెజా, గణిత, గణాంక శాస్త్ర విభాగాధిపతి డాక్టర జాదవ్ గణేష్, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

**దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య**

**పట్టుదలతో ముందుకు సాగితే దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించగలరు**

**టీజీఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి**





**సంగారెడ్డి బ్యూరో, మే 26 (నినాదం):** దివ్యాంగుల సంక్షేమం, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలంగాణ దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య పేర్కొన్నారు.మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో టీజీఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి,తెలంగాణ దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యలు దివ్యాంగులకు ఉచిత సహాయ ఉపకరణాలు, స్కూటీలు, బ్యాటరీ వీల్ చైర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 30 మందికి స్కూటీలు, 15 మంది లబ్ధిదారులకు బ్యాటరీ వీల్ చైర్లు ఉచితంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. దివ్యాంగులు స్వయం ఆధారితంగా జీవించేందుకు అవసరమైన సహాయ ఉపకరణాలు, ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాలు అందుబాటులోకి తీసుకువస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల దివ్యాంగులు కూడా ప్రభుత్వ సేవలు సులభంగా పొందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. టీజీఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, పట్టుదల, మనోధైర్యం ఉంటే జీవితంలో ఏదైనా సాధించవచ్చని అన్నారు. దివ్యాంగులు సవ్యాంగులకు దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తూ తమ ప్రత్యేకతను చాటు కుంటున్నారని కొనియాడారు. లక్ష్య సాధనకు కృషి, ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమని చెప్పారు. దివ్యాంగులు తమలో ఉన్న ప్రతిభను వెలికితీసుకుని సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్య, ఉపాధి రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తాను స్టాఫ్ నర్స్‌గా పనిచేసిన రోజుల్లో లెప్రసీ వార్డులో సేవలు అందించిన అనుభవాలను గుర్తు చేసుకుంటూ, చేసే పనిలో సేవాభావం, నిబద్ధత ఉంటేనే నిజమైన సంతృప్తి లభిస్తుందన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం కోసం జిల్లా సంక్షేమ శాఖ ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. వారికి అత్యుత్తమ సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వసంతరావు, షఫీ, నర్సింలు, రాయకోటి నరసింహులు పాల్గొన్నారు.

## జనగణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

**రాష్ట్ర సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ భారతి హొల్లికేరి**



**హైదరాబాద్ ప్రతినిధి, మే 26 (నినాదం):** ప్రజల నుండి సమగ్ర సమాచారాన్ని సేకరించి జనగణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ భారతి హొల్లికేరి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ పరిధిలోని పూరానాపూల్ ప్రాంతంలో జరుగుతున్న జనగణన ప్రక్రియను మంగళవారం ఉదయం జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ కే.సత్యనారాయణ తో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటికి తిరుగుతూ ఎనుమరేటర్లు నిర్వహిస్తున్న సర్వే విధానం, ప్రజల నుండి వివరాల సేకరణ, నమోదు ప్రక్రియపై భారతి హొల్లికేరి స్వయంగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి పూర్తి స్థాయిలో వివరాలు నమోదు చేయాలని, ప్రభుత్వం నిర్దేశించిన 34 ప్రశ్నలను తప్పనిసరిగా సేకరించాలని అధికారులకు సూచించారు. జనగణన ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితమైన సమాచారం నమోదు చేయడం అత్యంత ముఖ్యమని ఆమె తెలిపారు. ప్రజలు కూడా అధికారులకు సహకరించి సరైన సమాచారం అందించాలని కోరారు. ఈ పర్యటనలో చార్మినార్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సరిత, సంబంధిత విభాగాల అధికారులు, సూపర్వైజర్లు, ఎనుమరేటర్లు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో స్వర్ణకుమారి తనిఖీ





**ఆమనగల్లు,మే 26(నినాదం):** తలకొండపల్లి మండలం గట్టి ఇప్పలపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో స్వర్ణకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో ఆసుపత్రిలోని ఓపి సేవలు, వార్డులు, ల్యాబ్, ఫార్మసీ, మందుల నిల్వలు, పారిశుధ్య పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి,పలు రికార్డులను పరిశీలించారు. హాజరు రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్, రోగుల కేస్ షీట్లు తనిఖీ చేసి,వైద్య సిబ్బందితో మాట్లాడారు.ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై డిఎంహెచ్‌వో . అసంతృప్తి వ్యక్తం చేస్తూ, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న వైద్యులు,వైద్య సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటున్నానని హెచ్చరించారు.ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి పేద రోగికి నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. సమయపాలన పాటించాలని,డాక్టర్లు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు.మందుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు.. ఆసుపత్రి ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలి అని సిబ్బందికి సూచించారు.గర్భిణీ స్త్రీలకు అందుతున్న సేవలు,పీహెచ్సీలో సంబంధించిన వ్యాక్సిన్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.టీకా. కార్యక్రమాలు,సీజనల్ వ్యాధుల నివారణ ప్రభుత్వ ఆదేశానుసారం వడదెబ్బ కు సంబంధించి కేసుల వివరాలపై ఆరా తీశారు. రాబోయే వర్షాకాలం దృష్ట్యా డెంగ్యూ,మలేరియా వంటి విష జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు.రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో తలకొండపల్లి.గట్టి ఇప్పలపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

**టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల రెడ్డి**



**సంగారెడ్డి బ్యూరో, మే 26 (నినాదం):** మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల రెడ్డి అన్నారు. సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులకు ఇప్పటివరకు రెండు కోట్ల రూపాయల రుణాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలలో వడ్డీ లేని రుణాలను పంపిణీ చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వడ్డీ లేని రుణాలను పూర్తిగా మహిళా సంఘాల సభ్యులకు అందించినట్లు తెలిపారు. పట్టణంలో 212 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో అనరులకు కేటాయించిందని విమర్శించారు. అధికారులు కూడా అందుబాటులో ఉండేవారు కాదని తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమని అధికారులు, ప్రజా ప్రతినిధులు నిత్యం ప్రజల మధ్య ఉంటున్నారని తెలిపారు. ఇందిరా శక్తి కింద 119 మందికి రుణాలను మంజూరు చేసినట్లు వివరించారు. చీరలు రెండు రంగుల్లో ప్రభుత్వం పట్టణంలో 29 వేల మంది మహిళా సంఘాల సభ్యులకు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూన వనిత, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, టిఎంసి విజయభారతి, కౌన్సిలర్లు , మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



# నాలాల అభివృద్ధితో ముంపు తీవ్రత తగ్గింపు






**బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే వివేకానంద్**

**కుత్బుల్లాపూర్, మే 26 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 131- కుత్బుల్లాపూర్ డివిజన్ సూర్య నగర్, రామిరెడ్డి నగర్ లలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పర్యటించి రామ్ రెడ్డి నగర్ నాలా బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా స్టార్మ్ వాటర్ సమస్య, అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనుల సమస్యలను కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల లో కోట్లాది రూపాయల నిధులతో కాలనీల గుండా వెళుతున్న మురుగు కాలువకు అన్ని ప్రాంతాలలో ఇప్పటికే రిటర్నింగ్ వాల్ నిర్మాణం చేపట్టామని, వర్షాకాలంలో కాలనీలలోని ఇళ్లలోకి నీరు చేరకుండా బ్రిడ్జి నిర్మాణ పనులను చేపట్టామని పేర్కొన్నారు.రామ్ రెడ్డి నగర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరై టెండర్ ప్రక్రియ కూడా పూర్తయిందని అతి త్వరలో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి తరగతిన పూర్తి చేస్తామని, తద్వారా ఇళ్లలోకి వరద నీరు చేరకుండా ఉంటుందన్నారు. బ్రిడ్జి నాలా పనులతో పాటు సూర్య నగర్ లో అంతర్గత సిసి రోడ్లు, స్టాం వాటర్ పనులను త్వరగతిన చేపట్టి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు స్థానిక హనుమాన్ దేవాలయం, శ్రీ శక్తిగణపతి దేవాలయంలలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ రవి, ఎలక్ట్రికల్ ఏఈ రవీందర్ రెడ్డి, జిహెచ్ఎంసి ఏఈ అభిలాష్, రామ్ రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు యాదవ రెడ్డి, కార్యవర్గ సభ్యులు హీరాలాల్ బాటి, చంద్రశేఖర్ రెడ్డి, సుభాష్ గౌడ్, సురేష్ కుమార్, రాజన్న, సూర్య నగర్ కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అశోక్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వి. సురేష్, ఉపాధ్యక్షులు రమణయ్య, కుత్బుల్లాపూర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు యాదగిరి బాపూ, వనం శ్రీనివాస్, బొంబాయి శ్రీను, రాకేష్ జలిగం, ఎండి.నజీరుద్దీన్, రమణారెడ్డి, ఆంజనేయులు, అజయ్, వెంకటేష్, సుధాకర్ రెడ్డి, శ్రీనాథ్, జయం చారి తదితరులు పాల్గొన్నారు.

## పాలీసెట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థికి సన్మానం



**కొడంగల్, మే 26(నినాదం):** పాలీసెట్ ఫలితాలలో 5013 ర్యాంక్ సాధించిన కొడంగల్ వాసి గోపాలకృష్ణ వాశిష్ట కు కొడంగల్ మున్సిపల్ రెండు వార్డు కౌన్సిలర్ ఆర్ వాణిశ్రీ మధుసూదన్ యాదవ్ దంపతులు మంగళవారం శాలువా పూలదండ లతో సన్మానించి అభినందనలు తెలిపారు.ఈకార్యక్రమంలో వి.రవీంద్ర చారి, బండిగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి తాండా.. ప్రతి గ్రామానికి రోడ్లు నిర్మిస్తాం

**ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి**



**వికారాబాద్, మే 26(నినాదం):** ప్రతి తాండాకు, ప్రతి గ్రామానికి రోడ్లు నిర్మిస్తామని పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం మహమ్మదాబాద్ మండలం నంచర్ల ఎక్స్ రోడ్డు జూలపల్లి వయా కోయిల్ బాయి తండా వరకు రూ.7.00కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నూతన బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రోడ్డు సౌకర్యాలు కల్పించడం ద్వారా ప్రజలకు రవాణా ఇబ్బందులు తొలగడంతో పాటు అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రతి తాండా, ప్రతి గ్రామానికి రోడ్లు నిర్మించి తీరుతామని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజల ఆరాధ్యుడు కేసీఆర్

**సభ్యత్వ నమోదుకు డోకాలేదు**

**రైతులు హరి గోసపడుతుంటే స్పందించని ప్రభుత్వం**

**ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**



**వికారాబాద్, మే 26(నినాదం ):** తెలంగాణ రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నం రాష్ట్ర సాధించిన బి ఆర్ ఎస్ అధినేత కే సి ఆర్ రాష్ట్ర ప్రజల ఆరాధ్యుడని మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే పి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో డిజిటల్ సభ్యత్వం నమోదు సన్నాహక సమావేశాన్ని పార్టీ అధ్యక్షుడు మెతుకు ఆనంద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధినేత కేసీఆర్ రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నం రాష్ట్ర సాధన చేసిన ఆరాధ్యుదని అన్నారు. ఆయన పాలనలో ప్రజలందరు సుభిక్షంగా ఉన్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఏదో ఒక రకంగా ప్రభుత్వం నుండి లబ్ది పొందిన వారేనని వారిలో మనసుల్లో పార్టీ పట్ల సద్భావం కలిగి ఉన్నారని ఈ తరుణంలో విరివిగా డిజిటల్ సభ్యత్వాన్ని నమోదు చేయాలని సూచించారు. ప్రజల్లో లోలోపల అభిమానంఇమిడి ఉన్నదని ఈ సదావకాశన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రం లో రైతులు గోస తీస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. వరి కుప్పల వద్ద రైతులు ప్రాణాలు విడుస్తున్న ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు.గతప్రభుత్వ ఆయాంలో రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసిందని, అదేవిధంగా రైతులకు రైతు బంధు అందించి ఆదుకున్నదని అన్నారు. నేడు రైతులు వారు శ్రమించి పండించిన పంటను రోడ్లపై వేసుకుని కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్న తీరు దురదృష్టకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడం లేదని చెబుతున్న ప్రభుత్వం కేంద్రాన్ని ఎందుకు నిలదీయడం లేదని, ఎందుకు సంప్రదించడం లేదని ఆమె ప్రశ్నించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని అక్షరాల కాంగ్రెస్ ప్రభుత్వమే బొందపెట్టిందని ఆరోపించారు. రైతులను అరిగోస పెడుతూ మాటలతో కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి రైతుల విషయంలో నాటకాలాడుతోందని విమర్శించారు. రైతుబంధు, పంట కొనుగోళ్లు, సాగునీటి అంశాల్లో రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో రైతులు, తెలంగాణ ప్రజలు ఈ ప్రభుత్వానికి ఓటుతో గట్టి బుద్ధి చెబుతారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సభత్వ నమోదు ఇంచార్జి గట్టు రాంచంద్రరావు, సీనియర్ నాయకులు నాగేందర్ గౌడ్, శుభప్రద పటేల్, విజయ్ కుమార్, ఆయా మండలాల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాపూర్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

- **ఎన్నారై ఈజీఎస్ నిధులతో రైతు గోదాం, మహిళా మండలి భవనాలకు భూమిపూజ**



**దుబ్బాక, మే 26 (నినాదం):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా దుబ్బాక మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో సోమవారం పలు అభివృద్ధి పనులకు ఘనంగా భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్నారై ఈజీఎస్ నిధులతో చేపట్టనున్న ఈ అభివృద్ధి కార్యక్రమాలకు గ్రామ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శంకుస్థాపనలు జరిగాయి. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైతులు, మహిళలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఐకెపి రైతుల సౌకర్యార్థం రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న రైతు గోదాం నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. రైతులు పండించిన ధాన్యం మరియు ఇతర వ్యవసాయ ఉత్పత్తులను సురక్షితంగా నిల్వ చేసుకునేందుకు ఈ గోదాం ఉపయోగపడనుంది. గోదాం నిర్మాణంతో నిల్వ సౌకర్యాలు మెరుగుపడి రైతులు తమ పంటను తక్షణం తక్కువ ధరకు అమ్మాల్సిన పరిస్థితి తగ్గుతుందని అధికారులు తెలిపారు. భవిష్యత్తులో రైతులకు ఆర్థికంగా కూడా ఇది ఉపయోగకరంగా మారుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామ మహిళల సంక్షేమం, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని రూ.10 లక్షల నిధులతో మహిళా మండలి భవన నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేపట్టారు. మహిళలు సమావేశాలు నిర్వహించుకోవడానికి, శిక్షణా కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహించేందుకు ఈ భవనం ఉపయోగపడుతుందని నాయకులు తెలిపారు. మహిళా సంఘాల బలోపేతానికి ఇటువంటి భవనాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కింద గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. రైతులు, మహిళలు, యువతకు ఉపయోగపడే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను గ్రామంలో తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. గ్రామాభివృద్ధిలో ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని ఆయన సూచించారు. అభివృద్ధి పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు పనులను సమయానికి పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఏఈ సూర్యప్రకాశ్, ఏఈ రిజ్వాన్, ఏపీఎం రామకృష్ణ, సీసీ పరుశురాం, సీఏవీవో కనకరాజు రవీందర్, అధ్యక్షురాలు పద్మశ్రీలత, కవిత, బాయవ్వ, ఉపసర్పంచ్ విజయ్‌కుమార్, ఏఎంసీ డైరెక్టర్ మహేందర్ రెడ్డి, వార్డు సభ్యులు, మండల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌ను మోడల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతాం

కేంద్ర నిధులతో నగర రూపురేఖలు మారుస్తాం...
అభివృద్ధే లక్ష్యమని స్పష్టం
కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**కరీంనగర్, మే26(నినాదం) :** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ భవన రెండో అంతస్తు నిర్మాణ పనుల ప్రారంభోత్సవ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. గత మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధి బాధ్యత తీసుకుంటానని ఇచ్చిన హామీ మేరకు వంద రోజుల్లోనే రూ.840 కోట్ల నిధులు తీసుకువచ్చామని తెలిపారు. ఇందుకు ప్రధాని నరేంద్ర మోదీ , కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకరించిందన్నారు.జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ సహా అధికారులు కష్టపడి ప్రతిపాదనలు సిద్ధం చేసి వేగంగా పంపించారని ప్రశంసించారు. ప్రతిపాదనలు పంపిన 48 గంటల్లోనే ఢిల్లీలో సమావేశం ఏర్పాటు చేయించామని, వెంటనే కేంద్ర బృందం కరీంనగర్‌కు వచ్చిందన్నారు. కొందరు అధికారులు యూసీఎఫ్ జాబితాలో కరీంనగర్ చేరకపోవచ్చని చెప్పినా, పట్టుదలతో కేంద్రాన్ని ఒప్పించి చేర్పించామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 17 ప్రాజెక్టులకు మాత్రమే ఆమోదం లభించగా, అందులో కరీంనగర్ ఉండటం గర్వకారణమన్నారు. యూసీఎఫ్ నిధులతో కరీంనగర్ కార్పొరేషన్ రూపురేఖలు మారనున్నాయని, డంపింగ్ యార్డు కోసం కూడా రూ.80 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. గతంలో నిధుల కొరతతో కార్పొరేటర్లు ఎదుర్కొన్న ఇబ్బందులు తనకు తెలుసని, ఇప్పుడు పుష్కల నిధులతో అభివృద్ధి పనులు వేగంగా చేపట్టవచ్చన్నారు. గతంలో రూ.900 కోట్ల స్మార్ట్ సిటీ నిధులు, అమృత్-1, అమృత్-2 పథకాల ద్వారా రూ.277 కోట్ల పనులు చేపట్టినట్లు గుర్తుచేశారు. శివారు ప్రాంతాల అభివృద్ధితో పాటు నగరంలో పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతానన్నారు. తన ఏడేళ్ల ఎంపీ పదవీకాలంలో రూ.20 వేల కోట్లకు పైగా నిధులు తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. శాతవాహన కళాశాలకు 12బి హోదా, న్యాయ కళాశాల మంజూరు, ఎస్ఆర్ఆర్ కళాశాలకు స్వయంప్రతిపత్తి హోదా తీసుకువచ్చామని చెప్పారు. అంబేద్కర్ స్టేడియం, జమ్మికుంట స్టేడియం అభివృద్ధికి నిధులు అందించామని తెలిపారు.కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో ప్రభుత్వ ఆసుపత్రులకు వైద్య పరికరాలు అందించామని, ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఉచిత సైకిళ్లు పంపిణీ చేశామని, త్వరలో మళ్లీ పంపిణీ చేపడతామని వెల్లడించారు.కరీంనగర్ కార్పొరేషన్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని వేల కోట్ల నిధులు తీసుకువస్తానని చెప్పారు.

కేంద్ర పారామిలిటరీ గ్రూప్ కేంద్రం ఏర్పాటుకు 14 ఎకరాలు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ బెటాలియన్‌ల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని చెప్పారు. దక్షిణ భారత సిబ్బంది ఉత్తర తూర్పు ప్రాంతాల్లోనే విధులు నిర్వహించడం వల్ల కుటుంబాలకు దూరమవుతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఇక్కడే బెటాలియన్‌లు ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

ఎన్నికల వరకు మాత్రమే రాజకీయాలు ఉంటాయని, ఆ తరువాత అభివృద్ధే లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. రూ.50 కోట్ల పట్టణాభివృద్ధి నిధులతో అన్ని డివిజన్‌లలో అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయని, మరో రూ.50 కోట్ల విడుదల కోసం ప్రతిపాదనలు పంపామని వెల్లడించారు. భవిష్యత్తులో వచ్చే ప్రతి పథకంలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని మున్సిపాలిటీలను చేర్చేందుకు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమం లో మునిసిపల్ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, మేయర్ కోలగాని శ్రీనివాస్,సూడా చైర్మన్ కోమిటి రెడ్డి నరేందర్ రెడ్డి, ఉప మేయర్ యాదగిరి సునీల్ రావు,కార్పొరేటర్స్ తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం ప్రక్రియలో నిబంధనలు పాటించాలి

కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, మే 26 (నినాదం):** రైతు సంక్షేమంలో ప్రభుత్వం చేపట్టిన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని హాజీపూర్ మండల కేంద్రంలో గల శ్రీ రాజరాజేశ్వరి రైస్ మిల్, శ్రీ సాయి మణికంఠ రైస్ మిల్‌లను మండల తహసిల్దార్ పుష్పలతతో కలిసి సందర్శించి ధాన్యం దిగుమతి, నిల్వ ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దాన్యం నిల్వ, తరలింపులో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. లక్షెట్టిపేట మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాము, ఇటిక్యాల లోని కొనుగోలు కేంద్రాన్ని మండల తహసిల్దార్ దిలీప్ కుమార్ తో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతోపాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని గోదాములలో నిల్వ చేయాలని తెలిపారు. కొనుగోలు చేసి తరలించిన మొక్కజొన్నలను సైతం గోదాములలో నిలువ చేయాలని తెలిపారు. అనంతరం మంచిర్యాల పట్టణంలోని ఎ.సి.సి. ప్రాంతంలో గల హనుమాన్ ఆగ్రో ఇండస్ట్రీస్ ను బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల, బెల్లంపల్లి, తాండూర్ (కోటపల్లి ఇంచార్జ్) తహసిల్దార్లు రఫతుల్లా, కృష్ణ, జ్యోత్స్న లతో కలిసి సందర్శించారు. ప్రభుత్వం రైతుల కొరకు చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎలాంటి అవాంతరాలు లేకుండా పారదర్శకంగా, వేగంగా నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశిత సమయానికి అనుగుణంగా ధాన్యం ప్రక్రియను వేగవంతం చేయాలని, లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూసార పరిరక్షణే ధ్యేయం : ఎమ్మెల్యే జారె

రైతులకు పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ



**దమ్మపేట, మే 26(నినాదం) :** రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణ స్పష్టం చేశారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని, పంట దిగుబడుల్లో నేల ఆరోగ్యం కీలకపాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు, రాష్ట్రవ్యాప్తంగా రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు భూసార ఆరోగ్య పరిరక్షణ, రసాయన ఎరువుల వినియోగం తగ్గింపు లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను అందిస్తోందని ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ వెల్లడించింది. ఇందులో భాగంగా అశ్వారావుపేట నియోజకవర్గం, దమ్మపేట మండల హెడ్‌క్వార్టర్స్‌లో వ్యవసాయ శాఖ మరియు సహకార శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరై, ఆయన చేతుల మీదుగా రైతులకు రాయితీపై పచ్చిరొట్ట ఎరువుల గ్రీన్ మానూర్ విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం పచ్చిరొట్ట పంటల సాగు ద్వారా భూసార ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భూమిలో సేంద్రియ కర్బనాన్ని పెంపొందించడంతో పాటు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడంలో పచ్చిరొట్ట పంటలు ఎంతో దోహదపడతాయన్నారు. రైతులందరూ భూసార పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచిస్తూ.. జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలను ప్రభుత్వం అందిస్తున్న 50 శాతం సబ్సిడీని ఉపయోగించుకుని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఏఈఓ ఎస్ , మండల వ్యవసాయ అధికారులు ఎమ్ఏఓ ఎస్ రైతులకు ఈ పచ్చిరొట్ట విత్తనాల ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పించి, విత్తనాల పంపిణీని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు,

ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవిరాంబాబు, సొసైటీ ఉపాధ్యక్షులు కట్టం యర్రప్ప, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రమేష్, రావు గంగాధర్ రావు, మందలపల్లి సర్పంచ్ గుజ్జులశ్రీనివాసరావు, బొల్లికొండ నాగేశ్వరరావు,చిన్నశెట్టి సత్యనారాయణ, చిన్నశెట్టి యుగంధర్, పగడాల రాంబాబు, పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలి

నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి



**వెల్దుర్తి, మే 26 (నినాదం) :** ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి విల్లులకు తరలించాలని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు. మంగళవారం నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి మాసాయిపేట మండల కేంద్రంలోని వెంకట సాయి రైస్ మిల్లును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కొనుగోలు కేంద్రాల నుంచి వరి ధాన్యం తరలింపులో జరుగుతున్న జాప్యంపై తహసిల్దార్, జ్ఞాన జ్యోతి, ఆర్ఐ, దన్ సింగ్ నాయక్ లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ ఉన్న వరి ధాన్యాన్ని త్వరగా పూర్తి చేయాలని రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీరన్న గారి కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ పసుల వెంకటేశం, పెరమండ్ల రమేష్, ఎంపిటిసి చెరుకు సిద్ధరాములు గౌడ్, వెల్దుర్తి మండల శాఖ మహేష్ రెడ్డి, కార్యకర్తలు పోశయ్య యాదవ్, చుట్టుపక్కల గ్రామాల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

## నకిలీ పత్తి విత్తనాల విక్రయదారులపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల మెరుపు దాడులు

నలుగురు అరెస్ట్, 6.7 క్వింటాళ్ళ నకిలీ విత్తనాలు, వాహనం స్వాధీనం



**వికారాబాద్, మే 26(నినాదం ):** జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐ పి ఎస్ గారి ఆదేశాల మేరకు, వికారాబాద్ జిల్లాలో నిషేధిత, నకిలీ పత్తి విత్తనాల విక్రయాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. టాస్క్‌ఫోర్స్ సీ ఐ ఎస్ కె అన్వార్ పాషా ఆధ్వర్యంలో విడివిడిగా సోమవారం జరిపిన రెండు వ్యూహాత్మక దాడులలో భారీ ఎత్తున నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు. మొదటి దాడిలో, పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ బృందం రావులపల్లి వద్ద నిఘా ఉంచి తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో నిషేధిత, నకిలీ పత్తి విత్తనాలను అక్రమంగా తరలిస్తున్న ఉప్పలపాటి వసంత రావు (37, వ్యాపారం, స్వస్థలం: బాపట్ల జిల్లా, ప్రస్తుత నివాసం: యాద్గిర్ జిల్లా, కర్ణాటక) అనే వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుండి 2.5 క్వింటాళ్ళ నకిలీ పత్తి విత్తనాలతో పాటు, రవాణాకు ఉపయోగించిన ఆక్టివా జూపిటర్ వాహనాన్ని (నెంబర్: కె ఏ 33 ఈ వవ1467) స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో నిందితుడైన యాణగుంది (సేడం, కర్ణాటక) గ్రామానికి చెందిన మహేందర్ రెడ్డి ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. పట్టుబడిన నిందితుడిని, స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కొడంగల్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

అదేవిధంగా టాస్క్‌ఫోర్స్ అన్వార్ పాషా నేతృత్వంలోనే జరిగిన రెండో దాడిలో దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో పునాకాల సురేష్ (40, వ్యవసాయం, స్వస్థలం: ప్రకాశం జిల్లా, ప్రస్తుతం నివాసం: సేడం, కర్ణాటక), కళ్యాణ్ వీరేష్ (43, వ్యాపారం, నివాసం: పాఖాల్, చందాపూర్, కర్ణాటక) మరియు తలారి వేణు (35, వ్యవసాయం, నివాసం: నీటూరు, దౌల్తాబాద్, వికారాబాద్ జిల్లా) ఉన్నారు. వీరి నుంచి సుమారు 4.2 క్వింటాళ్ళ నకిలీ పత్తి విత్తనాలను టాస్క్‌ఫోర్స్ బృందం స్వాధీనం చేసుకుంది. ఈ ముగ్గురు నిందితులను, విత్తనాలను తదుపరి దర్యాప్తు కోసం దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు ఇన్స్పెక్టర్ అన్వార్ పాషా తెలిపారు. మొత్తం మీద ఈ రెండు దాడుల్లో కలిపి 6.7 క్వింటాళ్ళ నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా ఐ పి ఎస్ మాట్లాడుతూ అమాయక రైతులను మోసం చేస్తూ, నిషేధిత నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఇటువంటి అక్రమ విక్రయాలపై నిరంతరం నిఘా ఉంటుందని, నకిలీ విత్తనాల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆమె కోరారు. సమర్థవంతంగా దాడులు నిర్వహించి నిందితులను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ సీ ఐ అన్వార్ పాషా, వారి బృందాన్ని ఎస్పీ అభినందించారు.

## మర్రిగూడ కేజీబీవీలో అడ్మిషన్లు ప్రారంభం

రూ. 1.5 కోట్లతో సకల వసతులు,
ప్రహరీ గోడ, ఆధునిక డార్మెంటరీల నిర్మాణం
టాప్ సాధించిన విద్యార్థినులకు ఎమ్మెల్యే
కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేతుల మీదుగా ప్రైజ్ మనీ
2026-27 విద్యాసంవత్సరానికి
సీట్ల వివరాలు విడుదల చేసిన ఎస్ఓ జ్యోతి



**మునుగోడు, మే 26( నినాదం):** పేద, మధ్యతరగతి విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా మునుగోడు నియోజకవర్గం. మర్రిగూడ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం సరికొత్త హంగులతో అలరారుతోంది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తల్లి సుశీలమ్మ ఫౌండేషన్ సహకారంతో రూ. 1.5 కోట్ల భారీ వ్యయంతో ఈ విద్యాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యార్థినుల భద్రత కోసం ప్రహరీ గోడ, విశాలమైన తరగతి గదులు, ఆధునిక డార్మెంటరీలు, బాత్రూమ్స్‌తో పాటు శారీరక దారుఢ్యానికి ప్రాధాన్యతనిస్తూ విశాలమైన క్రీడా ప్రాంగణాన్ని ఇక్కడ ఏర్పాటు చేసి ఇటీవలే ఘనంగా ప్రారంభించారు.

**ప్రతిభావంతులకు 'కోమటిరెడ్డి' ప్రైజ్ మని**

పాఠశాల ప్రత్యేక అధికారి జ్యోతి చొరవతో ఈ విద్యాలయం ఉత్తమ ఫలితాలను సాధిస్తూ దూసుకుపోతోంది. ఇటీవలే విడుదలైన పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఇక్కడి విద్యార్థినులు అత్యుత్తమ మార్కులు సాధించి పాఠశాల కీర్తిని చాటారు. కాగా, ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో చదువుకుంటూ క్లాస్ ఫస్ట్, సెకండ్, థర్డ్ వచ్చిన ప్రతిభావంతులైన విద్యార్థినులకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో సుశీలమ్మ ఫౌండేషన్ తరఫున ప్రత్యేకంగా ప్రైజ్ మనీ అందించి ప్రోత్సహిస్తున్నారు.

**అందుబాటులో ఉన్న సీట్ల వివరాలు**

2026-27 విద్యాసంవత్సరానికి గాను 6వ తరగతి నుండి ఇంటర్ వరకు ప్రవేశాలు ప్రారంభమైనట్లు ప్రత్యేక అధికారి జ్యోతి తెలిపారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న సీట్ల వివరాలు.

6వ తరగతి: 40 సీట్లు,7వ తరగతి: 20 సీట్లు, 8వ తరగతి: 05 సీట్లు

**ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం**

ఎంపీసీ : 40 సీట్లు, బైపీసీ : 40 సీట్లు, అనుభవజ్ఞులైన, సుశిక్షితులైన అధ్యాపకులచే బోధన. రుచికరమైన, నాణ్యమైన భోజన వసతి.పూర్తి ఉచిత హాస్టల్ సౌకర్యం. అర్హులైన విద్యార్థినుల తల్లిదండ్రులు ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు, అడ్మిషన్ల కొరకు వెంటనే పాఠశాల సిబ్బందిని సంప్రదించాలని ఎస్ఓ జ్యోతి కోరారు.

## వివోఏల సమ్మెకు మద్దతు తెలిపిన బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మెచ్చా

మాటలే తప్ప హామీల అమలు లేదు
విఓఏ ల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి
బిఆర్ఎస్ నేతల డిమాండ్




**దమ్మపేట, మే 26(నినాదం):** స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గత నాలుగు రోజుల నుండి విఓఏ లు వారి సమస్యలను పరిష్కరించాలని చేస్తున్న నిరవధిక సమ్మెకు అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు మండల నాయకులతో కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారికి మజ్జిగ ప్యాకెట్లు మరియు నిమ్మ సోడాను అందజేశారు. వారి ఆవేదనను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు బిఆర్ఎస్ పార్టీ నిలబడుతుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మానవీయ కోణంలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ 3000 నుంచి 5000 లకు పెంచారని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీని గాలికి వదిలేశారాని మండిపడ్డారు. ఈ రెండేండ్లలో విపరీతమైన పని చేయించుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం వారిని చిన్న చూపు చూడడం సరికాదని వెంటనే వివోఏ ల డిమాండ్లను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున వారితో కలిసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డ రమేష్, దారా యుగంధర్, పార్కలగండి సర్పంచ్ కొమరం సుశీల, ఊప సర్పంచ్ రామకృష్ణ, అబ్దుల్ జిన్నా, జలగం వాసు, రావుల శ్రీను, యార్లగడ్డ శ్రీనివాస్ రావు,మండవ సత్యనారాయణ,చీకటి రామయ్య, బుడే, దేవరపల్లి అజయ్ కుమార్,దారా రాము,గోళ్ళ భవనీ కృష్ణ యాదవ్, వెలుగోటి మహేష్,కాసిని శ్రీను,కుకలకుంట రవి, మండల బీసీ నాయకులు తాళ్ల వెంకటేశ్వరావు, ధర్మ, సతీష్, నాగేశ్వరరావు, కోర్సా వెంకటేష్, శంకర్, కనపర్తి కార్తీక్ తదితరులు ఉన్నారు.

## బాల్య వివాహాల వల్ల ఆడపిల్లలకు ఎన్నో అనార్థాలు

బాల్య వివాహాలు చట్టవిరుద్ధం
అంగన్వాడీ సూపర్ వైజర్ ఆర్.రేణుక



**రాజేంద్రనగర్, మే 26 (నినాదం) :** బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల ఆడపిల్లకు తనకే కాకుం డా సమాజానికి కూడా ఎంతో నష్టమని ఆర్. రేణుక అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం బండ్లగూడలోని వార్డు కార్యాలయంలో బాల్యవివాహాల నివారణ- బాల్యవివాహా లు చేయటం వల్ల జరిగే నష్టాలపై ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ప్రజ లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ రేణుక మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన తర్వాతే అమ్మాయిలకు, 21 ఏళ్లు నిండిన తర్వాతే అబ్బాయిలకు వివాహాలు చేయాలని సూచిం చారు. అమ్మాయి అబ్బాయిలకు పెళ్లి వయసు రాకముందే వివాహాలు చేసినట్లయితే వారు శారీర కంగా ఆర్థికంగా ఇతర సమస్యలతో బాధపడే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వా నిబంధనల ప్రకా రం అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లలోపు వివాహాలు జరిపించినట్లయితే చట్టప రంగా ఇరు కుటుంబాలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. చిన్న వయస్సులో వివాహా లు చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో పాటు బాలల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ఎక్కడైనా బాల్యవివాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 1098 టోల్ ఫ్రీ నెంబర్ కి ఫోన్ చేసి సమాచారం అందించవచ్చునన్నారు. బాల్య దశలో ఉన్నప్పుడు పౌష్టిక ఆహారం తీసుకోవడంతో పాటు సరైన విద్య బోధన క్రమశిక్షణ ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో టెంట్ హౌస్ యజమాని రాందాస్, వేద పండితుడు రాజేశ్వర్ శర్మ, నాదస్వర బృందం, ఐసిడిఎస్ సిబ్బంది పి రాజేశ్వరి, సరస్వతి, విశాలిని, లలిత, నాగలక్ష్మి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేస్తాం

## మంత్రి జూపల్లి కృష్ణారావు





**వనపర్తి ప్రతినిధి, మే 26 (నినాదం) :** ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేస్తామని రాష్ట్ర ఆబ్కారి, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు పూర్తి చేసి ఉమ్మడి పాలమూరు జిల్లాతో పాటు రంగారెడ్డి జిల్లాకు తాగు నీరు ఇచ్చేందుకు జూన్ మొదటి వారంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లా సందర్శించి సమీక్షించనున్న నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఏదుల రిజర్వాయర్ ను సందర్శించి పరిశీలించారు. వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి, నాగర్ కర్నూల్ శాసన సభ్యులు కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, అచ్చంపేట శాసన సభ్యులు వంశీకృష్ణ తో కలిసి ఏదుల రిజర్వాయర్ పంప్ హౌజ్ ను సందర్శించి ప్రస్తుత స్థితిగతులు, పూర్తి అయిన పనులను ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రిజర్వాయర్ గురించి ఇరిగేషన్ ఎస్.ఈ పార్థసారథి వివరిస్తూ (5) స్టేజిలలో డిజైన్ చేసిన ఈ ప్రాజెక్టు శ్రీశైలం ప్రాజెక్టు పారుతున్న నీటిని ఎత్తిపోతల ద్వారా నార్లాపూర్ (అంజనగిరి) రిజర్వాయర్ లో నింపి అక్కడి నుండి ఎత్తిపోసి 6.55 టి.యం.సి. ల నీటి సామర్థ్యంతో నిర్మించిన ఏదుల రిజర్వాయర్ నింపడం జరుగుతుందన్నారు. ఏదుల రిజర్వాయర్ నుండి వట్టెం, ఉదండపూర్, కే.పి.లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ల ద్వారా ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు సాగు, తాగు నీరు అందించడం జరుగుతుందన్నారు. ఏదుల సర్జిపుల్ నుండి 134 మీటర్ల ఎత్తున ఉన్న రిజర్వాయర్ నింపడానికి 10 మోటార్లు ఏర్పాటు చేయడం జరిగిందని, రోజుకు రెండు టి.యం.సి ల నీటిని ఎత్తిపోసేందుకు ఒక్కో పంపు 1.45 మెగావాట్ల సామర్థ్యం కలిగి ఉన్నట్లు తెలిపారు. సంవత్సరంలో 45 రోజుల పాటు 90 టి.యం.సి ల నీటిని ఎత్తిపోసేందుకు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడం జరిగిందని వివరించారు. మోటారు పంపుల సామర్థ్యం, వాటి ధర, మన్నిక తదితర విషయాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులన్నింటినీ వేగవంతంగా చేయడానికి, సమస్యల పరిష్కారం, అవాంతరాలను తొలగించడానికి ప్రాజెక్ట్ లను సందర్శించినట్లు చెప్పారు. వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, వనపర్తి జిల్లా ఎస్పీ సునితా రెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ సంగ్రాం సింగ్ పాటిల్, ఇరిగేషన్ ఎస్.ఈ పార్థసారథి, కార్యనిర్వాహక ఇంజనీర్లు అమర్ సింగ్, రవీందర్, శ్రీనివాస్, వనపర్తి ఆర్డీఓ సుబ్రమణ్యం, కొల్లాపూర్ ఆర్డీఓ బన్సిలాల్ తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

# రైతులు ఫార్మర్ రిజిస్టర్ చేయించుకోవాలి



**మిర్యాలగూడ మే 26(నినాదం):** తెలంగాణ రాష్ట్రంలో భూమి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని వ్యవసాయ శాఖ స్పష్టం చేసిందని మిర్యాలగూడ వ్యవసాయశాఖ ఇంచార్జి అసిస్టెంట్ డైరెక్టర్, ఎంఏఓ ఎం.ఝాన్సీ ఫ్యేంద్రమణి కోరారు. స్థానిక రైతువేదికలో ఏఇఓల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ ప్రక్రియ ద్వారా రైతులకు ప్రత్యేకమైన 12 అంకెల డిజిటల్ ఐడీ లభిస్తుందన్నారు. దీనిని ఆధార్ కార్డు తరహాలో ఉపయోగించుకోవచ్చన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీ వివరాలు రిజిస్ట్రేషన్ ఎందుకు ముఖ్యమని వివరిస్తూ భవిష్యత్తులో రైతు బంధు, పీఎం కిసాన్, పంటల బీమా, విత్తనాలు మరియు ఎరువులపై సబ్సిడీలు వంటి ఏ ప్రభుత్వ పథకం పొందాలన్నా రిజిస్ట్రేషన్ తప్పనిసరని ఆమె అన్నారు. గ్రామాల్లోని రైతు వేదికల ద్వారా వ్యవసాయ విస్తరణ అధికారులు (ఎఇఓ)నమోదును ఉచితంగా చేస్తారన్నారు. మీ-సేవా కేంద్రాల్లో చేసుకోవచ్చు అన్నారు. కావాల్సిన పత్రాలు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, రైతు బ్యాంకు ఖాతా వివరాలు అవసరం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు (ఎఇఓలు) ఎండి.షఫీ, గోపి, రమేష్, రైతులు యాదమ్మ, వీరయ్యలున్నారు.

# బాల్య వివాహాలు పూర్తిగా నిర్మూలించాలి

## కలెక్టర్ సత్య శారద



**నర్సంపేట, మే 26 (నినాదం):** మహిళా వారోత్సవాలలో భాగంగా బాల్య వివాహ రహిత తెలంగాణ కార్యక్రమం పర్వతగిరి ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ బాల్య వివాహాలు పూర్తిగా నిర్మూలించేందుకు గ్రామ స్థాయిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో బాల్య వివాహాలు జరగకుండా కార్యాచరణ ప్రణాళిక యాక్షన్ ప్లాన్ రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. పర్వతగిరి మండలంతో పాటు మొత్తం వరంగల్ జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. బాల్య వివాహాల వల్ల బాలికల విద్య, ఆరోగ్యం మరియు భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. గ్రామ స్థాయి బాలల సంరక్షణ కమిటీలలోని సభ్యులందరూ బాల్య వివాహాలను అరికట్టేందుకు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి డిఆర్వో విజయలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఉమా, పర్వతగిరి ఎంపీడీఓ శంకర్ నాయక్, ఎమ్మార్వో వెంకటస్వామి, సీడీపీఓ దెబోరా, ఎన్జీఓ కోఆర్డినేటర్ శిరీష, వైద్యాధికారి డా. ఉదయ్ కుమార్ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే ప్రమాదాలు తగ్గించవచ్చు

## లాపరోస్కోపిక్ అంకాలజీ సర్జరీతో మంచి ఫలితాలు

### డాక్టర్ జి.దయాకర్ రావు సూచన




**వనపర్తి ప్రతినిధి, మే 26 (నినాదం):** అపెండిక్యులర్ మాస్, కోలస్ క్యాన్సర్ వంటి సమస్యలను ప్రారంభ దశలో గుర్తించి సరైన శస్త్రచికిత్స చేయడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని మలక్ పేట యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కన్సల్టెంట్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ జి. దయాకర్ రావు చెప్పారు. అత్యాధునిక లాపరోస్కోపిక్, అంకాలజీ సర్జరీతో మంచి ఫలితాలు సాధించవచ్చని ఆయన వివరించారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎం వై ఎస్ బంకెట్ హాల్లో క్యాన్సర్ పై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి. దయాకర్ రావు మాట్లాడుతూ అపెండి క్యులర్ మాస్తో కూడిన కొలస్ క్యాన్సర్ కు అరుదైన చికిత్స యశోద ఆసుపత్రిలో విజయవంతంగా జరిగిందని చెప్పారు. వనపర్తి జిల్లాకు చెందిన 51 ఏళ్ల సూగురు యాదమ్మ తీవ్రమైన కడుపునొప్పి, జ్వరం, కడుపులో గడ్డతో యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేరిందని, పరీక్షల్లో అపెండిక్యులర్ మాస్తో పాటు కోలస్ క్యాన్సర్ ఉన్నట్లు వైద్యులు గుర్తించారని చెప్పారు. కన్సల్టెంట్ జనరల్, లాపరోస్కోపిక్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ టి. సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రోగికి లాపరోస్కోపిక్ ఎక్స్ప్లోరేషన్, అడ్హీజి యోలిసిన్, ఒమెంటల్ బయాప్సీ నిర్వహించారని తెలిపారు. అనంతరం డాక్టర్ దయాకర్ రావు పర్యవేక్షణలో రైట్ హెమి కోలెక్టమీ,ఐలియో ట్రాన్స్వర్స్ అనాస్థమోషన్ శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారని తెలిపారు. పెద్దప్రేగు భాగంలో గడ్డతోపాటు చుట్టుపక్కల భాగాలకు అంటుకుపోయిన ఇన్ఫ్లమేటరీ మార్పులు ఉన్నట్లు వైద్యులు గుర్తించారని చెప్పారు. శస్త్ర చికిత్స అనంతరం రోగికి యాంటీబయోటిక్స్, నొప్పి నివారణ చికిత్స, డయాబెటిస్ నియంత్రణ, ప్రత్యేక పర్యవేక్షణ అందించారన్నారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యం మెరుగుపడి స్థిరపడడంతో అవసరమైన సూచనలతో డిశ్చార్జ్ చేసినట్లు ఆయన తెలిపారు. అపెండిక్స్ లేదా పెద్ద ప్రేగుకు సంబంధించిన క్యాన్సర్ తో కూడిన అపెండిక్యాలర్ మాస్ అనేది క్లిష్టమైన ఉదర సంబంధిత వ్యాధి అని, కడుపునొప్పి, జ్వరం, కడుపులో గడ్డ, జీర్ణ సమస్యల వంటి లక్షణాలతో ఇది కనిపిస్తుందని ఆయన పేర్కొన్నారు. సమయానికి గుర్తించకపోతే ఇన్ఫెక్షన్ వ్యాప్తి, ప్రేగు అవరోధం, క్యాన్సర్ ముదిరే ప్రమాదం ఉంటుందని, ముందస్తు నిర్ధారణ, అత్యధునిక పరీక్షలు, సకాలంలో శస్త్ర చికిత్స అత్యంత కీలకమని చెప్పారు. అపెండిక్యులర్ మాస్తో కూడిన కొలస్ క్యాన్సర్ను ప్రారంభ దశలో గుర్తించడం, అత్యాధునిక లాపరో స్కోపిక్ పరీక్షలు, బయాప్సీ కి ద్వారా ఖచ్చితమైన నిర్ధారణ చేయవచ్చన్నారు. క్లిష్టమైన కోలస్ క్యాన్సర్ కు విజయవంతమైన శస్త్ర చికిత్స నిర్వహణ, జీర్ణాశయ క్యాన్సర్కు మల్టీడిసిప్లినరీ వైద్య విధానానికి ప్రాముఖ్యత ఉంటుందని చెప్పారు. కడుపునొప్పి, జ్వరం, కడుపులో గడ్డ వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా ముందస్తు పరీక్షలు అవసరమని అన్నారు. అత్యాధునిక గ్యాస్ట్రోఇంటెస్టినల్, సర్జికల్ ఆంకాలజీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కేసు మలక్పేట యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న అత్యాధునిక గ్యాస్ట్రో ఇంటిస్టీనల్ సర్జరీ, సర్జికల్ అంకిలజీ సేవలు, సమగ్ర వైద్య సదుపాయాలను మరోసారి ప్రతిభంబించిందని అన్నారు. అపెండిక్యులర్ మాస్తో కూడిన కొలస్ క్యాన్సర్ వంటి క్లిష్టమైన ఉదర సంబంధిత వ్యాధులను ప్రారంభ దశలోనే ఖచ్చితంగా నిర్ధారించి అత్యాదునిక లాపరోస్కోపిక్, ఆంకాలజీ శస్త్ర చికిత్సల ద్వారా విజయవంతంగా చికిత్స అందించడం ఆసుపత్రి నైపుణ్యాన్ని చాటిచెప్పిందని తెలిపారు. అత్యాధునిక సాంకేతికత, అనుభవజ్ఞులైన వైద్య బృందం, మల్టీ డిసిప్లినరీ వైద్య విధానాలతో క్లిష్టమైన క్యాన్సర్, జీర్ణాశయ సంబంధిత వ్యాధులకు కూడా సమర్థవంతమైన చికిత్స అందించగల సామర్థ్యం తమ ఆసుపత్రికి ఉందని ఆసుపత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కే.శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర తెలిపారు. అత్యున్నత ప్రమాణాలతో సురక్షితమైన, నాణ్యమైన, సమయోచిత వైద్య సేవలను అందించడంలో తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డీజీఎం లక్ష్మణా శ్రీకాంత్, ఏ.వాసు కిరణ్ రెడ్డి ఉన్నారు.

# సబ్సిడీ జీలుగు విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

## తహసీల్దార్ మంగ



**హుజూర్‌నగర్, మే 26 (నినాదం):** ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై అందజేస్తున్న జీలుగు విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తాసిల్దార్ మంగా వ్యవసాయ అధికారి బి శ్రీనివాస్ కోరారు. మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై జీలుగు విత్తనాలను చైర్మన్ జవ్వాజి రామచంద్రయ్య ఆధ్వర్యంలో ప్రారంభించినారు. జీలుగు విత్తనాలు కావలసిన రైతులు పట్టాదారు పాసుబుక్కు జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని తమ యొక్క కస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని జీలుగు బ్యాగు 30 కేజీలు పూర్తి ధర 4,905రూపాయలు ఉండగా 50% రాయితీ 2452.50 పోను 2452.50 రూపాయలు చెల్లించి విత్తనాలు తీసుకోవాలని చెప్పారు. ఈ యొక్క కార్యక్రమంలో ఎంపీడీవో జగదీష్ కుమార్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ బానోతు బాబు నాయక్ , సంఘ కార్యదర్శి బత్తుల తిరుపతయ్య మరియు ఏఈవోలు శ్రావ్యంజలి, త్రివేణి, సంఘ సిబ్బంది సామేలు, సతీష్ కుమార్ , నాగరాజు, నాగేశ్వరరావు, సుభాని, పున్నమ్మ, భరత్ పాల్గొన్నారు.

# భూసార పరీక్షలు ప్రతి రైతు తప్పనిసరి చేసుకోవాలి



**హుజూర్‌నగర్, మే 26 (నినాదం):** మఠంపల్లి మండల కేంద్రంలో మంగళవారం సమగ్ర ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించినట్లు కృషి విజ్ఞాన కేంద్రం-గడ్డిపల్లి మృత్తిక శాస్త్రవేత్త ఎ.కిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షకు మట్టి నమూనా సేకరించే విధానంపై అవగాహన కల్పించారు శ్రీ. ప్రతి రైతు తమ నేల యొక్క భూసారాన్ని తెలుసుకుని దానికి అనుగుణంగా ఎరువులు వాడాలి అని, తద్వారా ఎరువుల వాడకంలో అనవసర ఖర్చులు తగ్గించి భూసారాన్ని కాపాడుకుంటూ అదిక మరియు సుస్థిర దిగుబడులు పొందవచ్చని భూసార పరీక్షలు చేయడం ద్వారా పోషకాల పరిమాణం కాకుండా భూమిలోని చౌడు, సున్నం శాతాన్ని గుర్తించవచ్చని, రైతులు తమ పొలంలోని మట్టిని సేకరించి కే.వి.కే-గడ్డిపల్లి కి పంపించినట్లు అయితే రైతులకు భూసార పరీక్ష చేసి భుఆరోగ్య పత్రాలు అందజేస్తామని తెలిపారు. మట్టి నమూనాలు సేకరించే విధానానికి 7893989055 నెంబర్ కి కాల్ చేసి తెలుసుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యేసుమల్ల వీరాలక్ష్మి , గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు , మండల వ్యవసాయ అధికారి బి.శ్రీనివాస్ , మండల విస్తరణ అధికారి శ్రావ్యంజలి, త్రివేణి . 40 మంది రైతులు పాల్గొన్నారు.

# లక్ష్మీనరసింహస్వామికి నిత్య కళ్యాణం

**హుజూర్‌నగర్, మే 26 (నినాదం):** శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం, మట్టపల్లి మహాక్షేత్రం నందు మంగళవారం శ్రీ స్వామి వారికి ప్రాతఃకాలమున నిత్యాభిషేకములు, నిత్య హోమములు జరిగినవి. తదుపరి నిత్య కళ్యాణం దేవాలయ అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాభ చార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి, ఆంజనేయ చార్యులు వార్లచే శాస్త్రోతముగా నిర్వహించబడినది. మధ్యానం దేవాలయం అన్నదానంలో 110మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగినది.

# ఆర్టీసీ బస్సు ట్రయల్ రన్ సక్సెస్



**అమరచింత, మే 26, (నినాదం):** గద్వాల నుండి మూలమల్ల గ్రామానికి గద్వాల డిపో ఆర్టీసీ అధికారులు మంగళవారం గద్వాల జూరాల మూలమల్ల మీదుగా ఆత్మకూరుకు బస్సులు ట్రైలర్ నిర్వహించారు. గత కొన్ని సంవత్సరాలుగా మూలమల్ల నుండి గద్వాల కు వెళ్లేందుకు బస్సులు లేకపోవడంతో గ్రామంలోని విద్యార్థులు రైతులు ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారు. మూలమల్ల గ్రామ ప్రజల ఆకాంక్షలు వనపర్తి జిల్లా స్పోర్ట్స్ చైర్ పర్సన్ పద్మజా రెడ్డి పాలమూరు ఎంపీ డీకే అరుణ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన డీకే అరుణ గద్వాల డిపో అధికారులతో గద్వాల్ నుండి మూలమల్ల మీదుగా ఆర్టీసీ బస్సులు నడిపేందుకు సాధ్యాసాధ్యాలు పరిశీలించి ములమల్ల మీదుగా బస్సులు నడిపేందుకు కృషి చేయాలని కోరారు. స్పందించిన డిపో మేనేజర్ బస్సును ట్రయల్ రన్ నిర్వహించారు. బస్సు మూలమల్ల గ్రామానికి రాగానే గ్రామ ప్రజల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. గ్రామానికి చేరుకున్న బస్సుకు పద్మజా రెడ్డి స్వాగతం పలికారు. మూలమల్ల గ్రామ ప్రజల ఆకాంక్ష నెరవేర్చిన పద్మజా రెడ్డికి ఎంపీడీకే అరుణకు సర్పంచ్ రంగారెడ్డి, ఉపసర్పంచ్ అశోక్ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

## జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్




**నల్లగొండ ప్రతినిధి మే 26(నినాదం):** బాల్య వివాహాలను అరికట్టడంతో పాటు, బాలికల అభివృద్ధి కి సమాజంలోని ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం నల్గొండ పట్టణంలోని రెడ్ క్రాస్ భవనంలో మహిళ ,శిశు,దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహల రహిత తెలంగాణ లక్ష్యంతో "బాల్య వివాహ నిషేధ చట్టం--2006"పై విద్యార్థులకు ఉద్దేశించి నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బాలికల అభివృద్ధి కి సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలి, బాల్య వివాహాలను అరికట్టేందుకు విద్యార్థులు చైతన్యవంతంగా వ్యవహరించాలి. బాల్య వివాహాల వల్ల ఎంతోమంది బాలికల జీవితాలు దెబ్బతింటున్నాయి, కుటుంబాల్లో ఆవేదన మిగులుతున్నదని అన్నారు. విద్యార్థులు తమ ప్రాంతాల్లో జరిగే బాల్య వివాహాలపై పోలీసులు లేదా అధికారులకు సమాచారం అందించాలని, బాలికలు సంఘాలుగా ఏర్పడి తమ సమస్యలను పంచుకోవాలని సూచించారు. బాల్య వివాహాలను అరికట్టడంలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వెల్ఫేర్ వీక్ ద్వారా పిల్లలకు అనేక అవకాశాలు కల్పిస్తున్నదని, ప్రతి ఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని చెప్పారు. విద్యార్థులు సోషల్ మీడియాను అతి మోతాదులో ఉపయోగించకుండా జాగ్రత్తగా ఉండాలని, ఏఐ ఫోటో మార్ఫింగ్ వంటి సైబర్ సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రతి ఒక్కరికీ ఆత్మగౌరవం ఎంతో ముఖ్యమని, సమాజంలో తలెత్తుకుని జీవించేలా వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. బాలికల సమస్యలపై ప్రతి నెల సమీక్ష సమావేశాలు నిర్వహించాలని సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. చదువుకోవాలనే ఆసక్తి ఉన్నా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు ప్రజావాణిలో దరఖాస్తు చేసుకుంటే సహకారం అందిస్తామని తెలిపారు. అవగాహన కార్యక్రమానికి రెడ్ క్రాస్ చైర్మన్ గోలి అమరేందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, సి డి పిఓ లావణ్య ,సి డబ్ల్యు సి చైర్మన్ చింత కృష్ణయ్య ,సి డబ్ల్యు సి సభ్యులు భాస్కర్ వెంకన్న, డిసిపిఓ గణేష్ హాజరయ్యారు.

# ధాన్యం అన్‌లోడింగ్ వేగవంతం చేయాలి

## రైస్‌మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన అదనపు కలెక్టర్ వినోద్ కుమార్



**పెబ్బేరు, మే 26 (నినాదం):** కొనుగోలు కేంద్రాల నుంచి రైస్ మిల్లులకు తరలిస్తున్న ధాన్యం లారీలను ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే అన్‌లోడింగ్ చేయాలని వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయడం లక్ష్యంగా మంగళవారం పెబ్బేరు, శ్రీరంగాపూర్ మండలాల పరిధిలోని పలు రైస్ మిల్లులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంబాలపూర్, శ్రీరంగాపూర్, రంగాపూర్, పెబ్బేరు పరిసర ప్రాంతాల్లోని రైస్ మిల్లులను సందర్శించిన అదనపు కలెక్టర్ అక్కడి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వస్తున్న ధాన్యం లారీల అన్‌లోడింగ్ ప్రక్రియ, నిల్వ సామర్థ్యం, అదనపు స్థలాల లభ్యతపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం లారీలను ఎక్కువసేపు నిరీక్షింపజేయకుండా తక్షణమే అన్‌లోడింగ్ పూర్తి చేయాలని సూచించారు. అవసరమైతే హమాలీల సంఖ్యను పెంచి వేగవంతంగా పనులు చేపట్టాలని మిల్లర్లకు ఆదేశించారు. రాబోయే రోజుల్లో ధాన్యం నిల్వ విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా అదనపు స్థలాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. మిల్లుల ఆవరణలోని గోదాములు, ఖాళీ ప్రదేశాలను పరిశీలించిన ఆయన, అదనపు ధాన్యం నిల్వ చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ధాన్యం తరుగు, తూకం విషయంలో ఎలాంటి అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని మిల్లర్లను అదనపు కలెక్టర్ హెచ్చరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలని సూచించారు. ఈ తనిఖీల్లో స్థానిక తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, రైస్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న మత్స్య సహకార సంఘం నామినేషన్లు





**కోదాడ,మే 26(నినాదం):** కోదాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మత్స్య సహకార సంఘం ఎన్నికల నామినేషన్ ప్రక్రియ కొనసాగుతోందని ఎన్నికల అధికారి ఇందిరా తెలిపారు. ఖానాపురం, వెంకట్రాంపురం, కోదాడ గ్రామాల పరిధిలోని 9 డైరెక్టర్ స్థానాలకు పలువురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఖానాపురం గ్రామం నుంచి శీలం నాగేంద్రబాబు, గుండపల్లి రామారావు డైరెక్టర్లుగా తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఇప్పటివరకు ఎస్సీ కేటగిరి నుంచి ముగ్గురు, జనరల్ కేటగిరి నుంచి 38 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా మొత్తం 41 నామినేషన్లు అందినట్లు అధికారులు తెలిపారు. నామినేషన్ కేంద్రం వద్ద అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్న అధికారులు, అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో నామినేషన్లు వేస్తున్నారని తెలిపారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామని వెల్లడించారు.

# ప్రత్యేక సమగ్ర సవరణపై మండల సమావేశం



**కోదాడ,మే 26(నినాదం):** అనంతగిరి మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు చింతకుంట సతీష్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమగ్ర సవరణ-2026 మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గ బాధ్యుడు బొలిశెట్టి కృష్ణయ్య హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఓటరు జాబితాలో ఉన్న లోటుపాట్ల సవరణకు ఇది మంచి అవకాశమని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి చెందిన బాధ్యులు ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి లోపాలను గుర్తించి సవరణలు చేసే విధంగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వంగవీటి శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షులు వెంకటేష్‌బాబు, ఓరుగంటి పురుషోత్తం, జిల్లా కార్యవర్గ సభ్యులు పగిడిరామారావు, జిల్లా అరుణ, మండల ప్రధాన కార్యదర్శి ఎడ్లపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు. వివిధ పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చిన బాధ్యులు సమావేశానికి హాజరయ్యారు.

# కాపుగల్లులో అగ్నిప్రమాదం.. 10 ఇళ్లు దగ్ధం



**కోదాడ,మే 26(నినాదం):** కోదాడ మండల పరిధిలోని కాపుగల్లు గ్రామ కాలనీలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గ్రామంలో కొంతమంది వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి రైతు వేదిక సమీపంలోని కాలనీ గుడిసెలకు అంటుకున్నాయి. ఈ ఘటనలో సుమారు 10 ఇళ్లు, ప్రకృతి వనం కొంతమేర కాలిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఫైర్ ఇంజన్, అగ్నిమాపక సిబ్బంది సమయానికి అందుబాటులో లేకపోవడంతో కాలనీ వాసులే స్వయంగా మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సమాచారం అందుకున్న వ్యవసాయ కార్మిక సంఘం మహిళా నాయకురాలు వేలది పద్మావతి ఘటనాస్థలానికి చేరుకుని బాధితులకు సహాయ సహకారాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాలనీ వాసులు అప్రమత్తంగా లేకపోయి ఉంటే పెద్ద ప్రమాదం జరిగేదని తెలిపారు. ప్రభుత్వం స్పందించి బాధితులకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు.

# మహిళా సంఘాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

## మహిళా సంఘాల నూతన భవనం ప్రారంభించిన

## గుండు రామాంజి గౌడ్ సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు



**హుజూర్‌నగర్, మే 26 (నినాదం):** హుజూర్ నగర్ నియోజక వర్గం గరిడేపల్లి మండలం పరిధిలోని రాయిని గూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా సంఘాల సంఘ బంధం భవనాన్ని గ్రామ సర్పంచ్ సర్పంచ్ ల ఫోరం జిల్లా అధ్యక్షులు గుండు రామాంజి గౌడ్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబన, బలోపేతానికి ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళలు పొదుపు సంఘాల ద్వారా మరింతగా అభివృద్ధి సాధించాలని ఆయన కోరారు. అనంతరం మరో నూతన భవనానికి శంకుస్థాపన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పిడమర్తి నాగరాజు గ్రామ శాఖ అధ్యక్షుడు గుండు శంభయ్య కార్యదర్శి సునీత,వార్డు మెంబర్స్ గుండు లక్ష్మమ్మ గురవయ్య అమరారపు తిమోతి రాజు, గుండు నర్సింహారావు, రాచమల్ల శ్రీకాంత్, అమరారపు పేతురు, బెక్కం విజయ్ జయరాజ్ సంఘబంధం అధ్యక్షురాలు గుండు అంజమ్మ, కుమారి సుహాసిని సావిత్రి గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రజకుల ఆత్మగౌరవంపై దాడి

చిట్యాల ఐలమ్మ పేరే పెట్టాలి

ఎమ్మెల్యే భజన కోసం జాతిని వాడొద్దు

జిల్లా రజకసంఘం

అధ్యక్షులు బొడ్డుపల్లి






**పెద్దపల్లి రూరల్, మే 26 (నినాదం):** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రజకుల భూమి వద్ద ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావును కీర్తిస్తూ "విజ్జన్ననగర్" పేరుతో బోర్డు ఏర్పాటు చేయడం యావత్ రజక సమాజాన్ని అవమానించడమేనని మన రజకసంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డుపల్లి రమేష్ మండిపడ్డారు. తెలంగాణ పోరాట యోధురాలు, వీరవనిత చిట్యాల ఐలమ్మ పేరు పెట్టాల్సిన చోట రాజకీయ నాయకుల పేర్లతో బోర్డులు ఏర్పాటు చేయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. కొందరు స్వార్థపరులు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం రజక సమాజాన్ని రాజకీయాలకు వాడుకోవాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మెప్పు కోసం కాంగ్రెస్ ముసుగులో ఉన్న కొందరు నాయకులు రజక జాతిని ఉపయోగించుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఎమ్మెల్యే భజన చేయాలనుకుంటే ఇతర మార్గాలు ఎన్నుకోవచ్చని, కానీ రజక సమాజం పేరును వాడుకునే హక్కు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో రజకులకు 100 ఇందిరమ్మ ఇళ్లు, దోబీ ఘాట్ నిర్మాణం వంటి హామీలు ఇచ్చిన ఎమ్మెల్యే, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ వర్గాన్ని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. హామీలను అమలు చేయకుండా ఇప్పుడు రజకుల భూమిపై బోర్డులు ఏర్పాటు చేసి రాజకీయ డ్రామాలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి రజక సంఘం నిర్వహించే బోనాల జాతరలకు వెండి కిరీటాలు, ఆభరణాలు సమర్పించడం ద్వారా సంఘంపై తన గౌరవాన్ని చాటుకున్నారని గుర్తుచేశారు. పేద రజక కుటుంబాలకు పుస్తె-మట్టెలు పంపిణీ చేయడం, బియ్యం, రవాణా సౌకర్యాలు కల్పించడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారని పేర్కొన్నారు. అలాగే చాకలి ఐలమ్మపై గౌరవంతో ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, నిలువెత్తు విగ్రహ ప్రతిష్ఠకు కూడా సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. రజక సమాజాన్ని తక్కువ అంచనా వేసి కబళించాలని ప్రయత్నిస్తే ఊరుకోబోమని హెచ్చరించిన బొడ్డుపల్లి రమేష్, ఎమ్మెల్యే పేరుతో ఏర్పాటు చేసిన అనధికారిక బోర్డులను వెంటనే తొలగించి చిట్యాల ఐలమ్మ పేరుతో నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రజక సంఘం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.

# 31న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు



**సుల్తానాబాద్, మే 26(నినాదం):** పెద్దపల్లి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 31న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పోటీలు జరగనున్నాయని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న క్రీడాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పోటీల్లో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. అండర్-16, అండర్-18, అండర్-20 విభాగాలతో పాటు పురుషులు, మహిళలకు ప్రత్యేక విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అండర్-16 విభాగంలో 100 మీటర్లు, 300 మీటర్లు, లాంగ్ జంప్, అండర్-18 విభాగంలో 100 మీటర్లు, 1000 మీటర్లు, అండర్-20 విభాగంలో 100 మీటర్లు, 400 మీటర్ల పోటీలు నిర్వహించనున్నారు. పురుషులు, మహిళల విభాగాల్లో 100, 200, 400, 800, 1500 మీటర్ల పరుగులతో పాటు 5 కిలోమీటర్ల పరుగు, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు వయోపరిమితి ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. ప్రతి అథ్లెట్‌కు రూ.100 ప్రవేశ రుసుము నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 091 961 83 36976 ఫోన్ నంబర్‌ను సంప్రదించి ముందస్తుగా పేర్లు నమోదు చేసుకుని పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని నిర్వాహకులు కోరారు.

# గోదావరి పుష్కరాలకు పగడ్బందీ ఏర్పాట్లు



**మంచిర్యాల, మే 26, (నినాదం):** 2027 గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సమాయత్తం అవుతుందని దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు తెలిపారు. మంగళవారం సరస్వతి పుష్కరాల 6వ రోజు సందర్భంగా కాళేశ్వరం విచ్చేసిన మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, జగిత్యాల, పెద్దపల్లి కలెక్టర్లతో కలిసి మెగా విశ్రాంతి భవనంలో సమావేశం నిర్వహించారు. సరస్వతి ఆది, అంత్య పుష్కరాల సందర్భంగా భక్తులకు కల్పించిన సౌకర్యాలను, మ్యూజియంను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాబోయే గోదావరి పుష్కరాల నిర్వహణకు ప్రభుత్వం సుమారు 1 వేయి కోట్ల రూపాయల నిధులు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందని, సరస్వతి పుష్కరాల సందర్భంగా ఎదురైన లోటుపాట్లను గుర్తించి, గోదావరి పుష్కరాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతాల జిల్లాల కలెక్టర్లతో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. పుష్కరాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున పారిశుధ్యం, త్రాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్, విద్యుత్ సరఫరా, వీఐపీ, వివిఐపిలు పర్యటనలకు ఏర్పాట్లు, ఇతర అంశాలపై జిల్లాల వారీగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. అనంతరం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ గోదావరి నదిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయం దర్శించుకుని హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో నిజామాబాద్, నిర్మల్ జిల్లాల అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియ వెంట వెంటనే పూర్తి చేయాలి

కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్‌ప్రతినిధి, మే26(నినాదం):** మంగళవారం లక్ష్మణచందా మండలంలోని తిరుపల్లి గ్రామంలోని గోదామును కలెక్టర్ సందర్శించి, ట్రాక్టర్ల ద్వారా జరుగుతున్న వరి ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను వెంట వెంటనే పూర్తి చేయాలని సూచించారు. గోదాం మొత్తం నిల్వ సామర్థ్యం, ఇప్పటివరకు నిల్వ చేసిన ధాన్యం పరిమాణం, అన్లోడింగ్ కోసం వేచి ఉన్న ట్రాక్టర్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే, ప్రస్తుతం పనిచేస్తున్న హమాలీల సంఖ్యపై ఆరా తీసి, అవసరమైతే మరింత మంది హమాలీలను నియమించి అన్లోడింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. హమాలీలకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, తహసీల్దార్ సరిత, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వరి కొయ్యలు కాల్చొద్దు

మండల వ్యవసాయ అధికారి పైడితల్లి

పర్యావరణ కాలుష్యం పెరిగి ప్రజారోగ్యంపై ప్రభావం



**సుల్తానాబాద్, మే 26(నినాదం):** వరి కొయ్యలను కాల్చితే రైతులకు నష్టమే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదని సుల్తానాబాద్ మండల వ్యవసాయ అధికారి పైడితల్లి తెలిపారు. ఈ సందర్భంగా పైడితల్లి మాట్లాడుతూ, వరి కోతల అనంతరం పొలాల్లో మిగిలిన వరి కొయ్యలను కాల్చరాదని విజ్ఞప్తి చేశారు. వరి కొయ్యలను కాల్చడం వలన భూమిలోని సేంద్రియ పదార్థాలు, ఉపయోగకర సూక్ష్మజీవులు నశించడంతో పాటు నేల సారవంతత తగ్గిపోతుందని, అదేవిధంగా పర్యావరణ కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని సూచించారు. ప్రభుత్వం వరి కొయ్యల నిర్వహణకు అనేక ప్రత్యామ్నాయ పద్ధతులను రైతులకు అందుబాటులో ఉంచిందని, రైతులు వరి కొయ్యలను భూమిలో కలిపి సేంద్రియ ఎరువుగా ఉపయోగించుకోవచ్చు లేదా పశువుల మేత, కంపోస్ట్ తయారీ వంటి అవసరాలకు వినియోగించుకోవచ్చు అని చెప్పారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి కొయ్యలను కాల్చకుండా వ్యవసాయ శాఖ సూచనలు పాటించి పర్యావరణ పరిరక్షణకు సహకరించగలరని కోరారు.

# చింతకుంటలో పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

15 లీటర్ల గుడుంబా, 500 లీటర్ల

బెల్లం పానకం ధ్వంసం

ముగ్గురిపై కేసులు నమోదు



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, మే 26(నినాదం) :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలంలోని చింతకుంట గ్రామంలో జిల్లా ఎస్పీ నితికా పంత్, కాగజ్ నగర్ డిఎస్పి వహీదుద్దీన్ ఆదేశాల మేరకు కౌటాల సిఐ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. గ్రామస్తులతో సమావేశమై శాంతిభద్రతలు, మత్తు పదార్థాల నివారణ, అక్రమ కార్యకలాపాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టిన పోలీసులు అక్రమంగా తయారు చేస్తున్న 15 లీటర్ల గుడుంబాతో పాటు 500 లీటర్ల బెల్లం పానకాన్ని గుర్తించి ధ్వంసం చేశారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సీఐ తెలిపారు. గ్రామాల్లో అక్రమ మద్యం తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కౌటాల సిఐ సంతోష్ కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు చంద్రశేఖర్, సాగర్, కమలాకర్, సర్తాజ్ పాషా, 40 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బస్సు కింద పడి మహిళకు తీవ్ర గాయాలు






**నిర్మల్ ప్రతినిధి, మే 26 (నినాదం):** నిర్మల్ జిల్లా కేంద్రంలోని నూతన బస్ స్టాండ్‌లో మంగళవారం మధ్యాహ్నం ఒక ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బస్ స్టాండ్ ఆవరణలో నడుచుకుంటూ వెళ్తున్న ఒక మహిళ ప్రమాదవశాత్తూ ఆర్టీసీ బస్సు కింద పడటంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం సుమారు 12:30 గంటల ప్రాంతంలో నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (టా 01 0155) నిర్మల్ నుండి గొల్లమాడ గ్రామానికి వెళ్లేందుకు బస్ స్టాండ్ నుంచి బయలుదేరుతోంది. అదే సమయంలో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం పడ్కాల్ గ్రామానికి చెందిన సట్ల ఆశమ్మ (55) అనే మహిళ బస్సు వెనుక భాగం నుంచి నడుచుకుంటూ వస్తోంది. బస్సు ముందుకు కదిలే క్రమంలో ఆమె ఒక్కసారిగా వాహనం కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో బస్సు చక్రం ఆమెపై నుంచి వెళ్లడంతో ఆశమ్మ కుడి చేయి, కాలు పూర్తిగా విరిగిపోయాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన స్థానికులు, ఆర్టీసీ సిబ్బంది ఆమెను హుటాహుటిన చికిత్స నిమిత్తం నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. స్థానిక పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# అయ్యప్ప గుడికి ఆధారాలతో వస్తాం

**బిఆర్ఎస్ నాయకుల సవాల్**

**సుల్తానాబాద్, మే 26(నినాదం):** కాంగ్రెస్ పార్టీ నాయకులు, టిఆర్ఎస్ పార్టీ నాయకుల అవినీతి ఆరోపణలపై జరిగిన విలేకరుల సమావేశంలో అంతటి అన్నయ్య గౌడ్ పై చేసిన ఆరోపణపై ఆధారాలు నిరూపించడానికి, సుల్తానాబాద్ మండల కేంద్రంలోని శాస్త్రి నగర్ అయ్యప్ప స్వామి ఆలయంలో ఈనెల 27 తేదీన ఉదయం 8 గంటలకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు సిద్ధంగా తగిన ఆధారాలతో సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు కూడా అయ్యప్ప గుడికి రావాలని సోషల్ మీడియాలో మండల ఇన్చార్జి సీనియర్ టిఆర్ఎస్ పార్టీ నాయకులు మహమ్మద్ రఫీక్ సవాల్ చేశారు. తడి బట్టల స్నానం చేసి ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు ఆయన తెలిపారు.



# ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు కృషి

మజ్జిగ పంపిణీ.. అసోసియేషన్ అధ్యక్షుడు కొట్టే లక్ష్మయ్య



**సుల్తానాబాద్, మే 26 (నినాదం):** ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు వాకర్ అసోసియేషన్ ద్వారా కృషి చేస్తున్నామని అధ్యక్షుడు కొట్టే లక్ష్మయ్య స్పష్టం చేశారు. పెద్దపల్లి బస్టాండు లో వాకర్స్ అసోసియేషన్ ఐటిఐ గ్రౌండ్ పెద్దపల్లి వారి ఆధ్వర్యంలో ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంఅసోసియేషన్ సభ్యులైన కొమ్ము సుధాకర్,అనవేనా భవాని ప్రసాద్,నిడదవోలు రాంబాబు ల పుట్టినరోజు పురస్కరించుకుని కార్యక్రమం నిర్వహిస్తున్నామని అధ్యక్షుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడుకొట్టే లక్ష్మయ్య మాట్లాడుతూ,ప్రతిసంవత్సరము బస్టాండ్ లో చలివేంద్రము ఏర్పాటు చేస్తూ, సభ్యుల సహకారంతో ప్రతి సంవత్సరము సేవా కార్యక్రమాలు తో పాటు ఆర్థిక సహాయాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ హాస్టల్లో పిల్లలకు స్టడీ మెటీరియల్స్, స్కూల్ బ్యాగ్స్,వాటర్బాటిల్స్ మొదలైనవే కాకుండాహాస్పిటల్స్ లో పండ్ల పంపిణీ కూడాచేస్తుంటామని, ఇట్టి అసోసియేషన్ వాకర్స్ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 304 కరీంనగర్ కు అనుబంధంగా ఉన్నదని ,ఈ కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందించిన సుధాకర్, భవాని ప్రసాద్, రాంబాబు లకు మరొకసారిజన్మదినశుభాకాంక్షలు తెలుపుతున్నామని తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఉప్పు రాజు, అన్నెడివెంకటరెడ్డి,కొట్టే లక్ష్మయ్య, కొమ్ము సుధాకర్, అనవేన భవాని ప్రసాద్, నిడదవోలు రాంబాబు,వేముల రాజమౌళి, వైద దశరథం,మాదాసు రామస్వామి, తాళ్ల కళ్యాణ్ బస్సుస్టేషన్ మేనేజర్ ఆర్కే రెడ్డి తో వారి స్టాప్ కూడా పాల్గొన్నారు

# ఆసుపత్రిలో ఎమర్జెన్సీ విభాగం అత్యంత కీలకం

గోల్డెన్ అవర్‌లో చికిత్సతోనే ప్రాణాలకు రక్షణ

వరల్డ్ ఎమర్జెన్సీ డే సందర్భంగా మెడికవర్ వైద్యులు




**పెద్దపల్లి రూరల్,మే 26(నినాదం):** ఆసుపత్రుల్లో స్పెషాలిటీ వైద్యులు ఎంత ముఖ్యమైన పాత్ర పోషిస్తారో, అత్యవసర పరిస్థితుల్లో ఎమర్జెన్సీ విభాగం కూడా అంతే కీలకమని మెడికవర్ వైద్యులు పేర్కొన్నారు. ప్రమాదాలు,గుండెపోటు,బ్రెయిన్ స్ట్రోక్,శ్వాసకోశ సమస్యలు, విషప్రయోగం వంటి అనూహ్య పరిస్థితుల్లో మొదటి గంటలో అందించే వైద్య సేవలు రోగి ప్రాణాలను కాపాడటంలో నిర్ణయాత్మకంగా ఉంటాయని వెల్లడించారు. వరల్డ్ ఎమర్జెన్సీ డేను పురస్కరించుకుని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆసుపత్రికి ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యుడు డాక్టర్ సత్యనారాయణ, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నాగరాజుతో మాట్లాడుతూ, ఆసుపత్రిలో ఎమర్జెన్సీ విభాగం ప్రాముఖ్యతను వివరించారు. ఆధునిక వైద్య వ్యవస్థలో ఎమర్జెన్సీ విభాగం ఒక కీలకమైన భాగమని,అనేక సందర్భాల్లో రోగి ప్రాణాలు అక్కడ పనిచేసే వైద్య సిబ్బంది చాకచక్యంపై ఆధారపడి ఉంటాయని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత తొలి గంటలో సరైన వైద్యం అందితే రోగి ప్రాణాలు నిలబెట్టే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని చెప్పారు.ప్రమాదం జరిగిన వెంటనే రోగి చుట్టూ గుమికూడడం, అజాగ్రత్తగా కదిలించడం,అవసరం లేకుండా నీళ్లు లేదా ఆహారం ఇవ్వడం వంటి చర్యలు మరింత ప్రమాదాన్ని పెంచుతాయని పేర్కొన్నారు.ప్రస్తుతం మారుతున్న జీవనశైలి, పెరుగుతున్న ఒత్తిడి, రోడ్డు ప్రమాదాల సంఖ్య అధికమవుతున్న నేపథ్యంలో ప్రతి ఆసుపత్రిలో సమర్థవంతమైన ఎమర్జెన్సీ విభాగం ఉండాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అత్యవసర వైద్య సేవలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా అనేక ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ విలేకరుల సమావేశంలో మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్,బొంగోని హరీష్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్‌లో పోలీసుల "కార్డన్ అండ్ సర్చ్"

138 వాహనాలు స్వాధీనం





**నిర్మల్ ప్రతినిధి, మే 26 (నినాదం):** జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్మల్, భైంసా సబ్ డివిజన్ల పరిధిలో పోలీసులు మంగళవారం తెల్లవారుజామున భారీ కార్డన్ అండ్ సెర్చ్ (తనిఖీలు) కార్యక్రమం నిర్వహించారు. భైంసా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతల్బొరి గ్రామంలో, నిర్మల్ సబ్ డివిజన్ పెంబి మండలంలోని బావాపూర్ (ఆర్) గ్రామాల్లో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో భాగంగా సరైన పత్రాలు లేని 135 ద్విచక్ర వాహనాలు, రెండు కార్లు, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహనదారులు తప్పనిసరిగా పూర్తి పత్రాలు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటూ.. 105 పెండింగ్ చలాన్ల ద్వారా రూ. 18,275 నగదును వసూలు చేశారు. ?నేరాల నివారణపై అవగాహన సదస్సు తనిఖీల అనంతరం గ్రామ ప్రజలతో పోలీసులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ సాయి కిరణ్, డీఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణ, ఆస్తి సంబంధిత నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. గ్రామాల్లో భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవాలని, వాటి ప్రాముఖ్యతను వివరించారు. యువత భవిష్యత్తును పాడుచేసే గంజాయి వినియోగం, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మద్యం సేవించి వాహనాలు నడపడం, మైనర్ డ్రైవింగ్ వంటి సామాజిక దుష్ప్రవర్తనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఇన్‌స్పెక్టర్ అజయ్, భైంసా రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, స్థానిక ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది మరియు గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలపై ఎస్ఈకి వినతి పత్రం

మంచిరామి సర్పంచ్ ఉప్పు లక్ష్మీ తిరుపతి

మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించిన సర్పంచ్



**సుల్తానాబాద్, మే 26(నినాదం):** మంచిరామిగ్రామంలో నెలకొన్నవిద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఎస్ ఈ పెద్దపల్లి నీ సర్పంచ్ ఉప్పు లక్ష్మీ, రిటైర్డ్ ఐపీఎస్ ఉప్పు తిరుపతి మర్యాదపూర్వకంగా కలిసివినతిపత్రం అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ,గ్రామంలో మంచి నీటి సరఫరాకు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ను షిఫ్టింగ్ చేయాలని, టెంపుల్ నుంచి స్మశాన వాటిక వరకు కొత్త కరెంట్ లైన్ ఏర్పాటు చేయాలని, అలాగే గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద చిన్న ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు , కురుమళ్ళవాడలో లెవెన్ కె షిఫ్టింగ్ చేయాలని వారు కోరారు.ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు తెలిపారు.

# సుఫారి ఇచ్చి భర్తను చంపించిన భార్య

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఘాతుకం

హత్య కేసు ఛేదించిన పోలీసులు



**మంచిర్యాల, మే 26(నినాదం):** వివాహేతర సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని అతన్ని హత్య చేయాలని ప్రియుడితో కలిసి పథకం రూపొందించింది. కొందరికి సుఫారి ఇచ్చి భర్తను చంపించింది. ఈ కేసులో భార్యతో సహ ముగ్గురు నిందితులను హాజీపూర్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం మంచిర్యాల డీసీపీ కార్యాలయంలో భాస్కర్ విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. హాజీపూర్ మండలం గుడిపేట గ్రామానికి చెందిన సాయిని కుమార్ (40) భార్య భారతితో కలిసి జీవిస్తున్నాడు. సాయిని కుమార్ మద్యానికి బానిసై ప్రతిరోజు భార్యను హింసించేవాడు. భారతి లగిశెట్టి సురేందర్ తో అక్రమ సంబంధం ఏర్పడింది. సాయికుమార్ గుడిపేట గ్రామానికి రామ్ మల్లేష్ రూ.60,000 అప్పుగా తీసుకున్నాడు. అయితే అప్పు తిరిగి చెల్లించకపోవడంతో మల్లేష్ పలుమార్లు ఇంటికి వెళ్లి డబ్బులు అడిగి గొడవ చేశాడు. అప్పు చెల్లించకపోతే మృతుడిని చంపేస్తానని బెదిరించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ క్రమంలో మృతుడి భార్య భారతి మల్లేష్‌తో పరిచయం ఏర్పడింది. మృతుడు ప్రతిరోజూ మద్యం సేవించి అక్రమ సంబంధం విషయంలో భార్యను హింసించడంతో, అతడిని హత్య చేస్తే తమ అక్రమ సంబంధానికి అడ్డంకి తొలగిపోతుందని భావించి భారతి, సురేందర్ కలిసి పథకం రచించారు. భర్త పేరిట పలు జీవిత బీమా పాలసీలు తీసుకున్నారు. భర్తను చంపాలని మల్లేష్ .రూ. 10,00,000 ఒప్పందం కుదుర్చుకున్నారు. 2026 ఏప్రిల్ నెలలో రూ.రూ. 2,00,000 ముందస్తుగా చెల్లించారు. మల్లేష్ ఒక్కడే హత్య చేయలేనని భావించి, శ్రీరామ్ కుమార్‌ను సహకారానికి ఒప్పించాడు. పథకం ప్రకారం ఈనెల 22న రాత్రి ముల్కల్ల గ్రామ శివారులో మృతుడికి అధిక మోతాదులో మద్యం తాగించి, ఇనుప సుత్తితో తలపై బలంగా కొట్టి హత్య చేశారు. అనంతరం ఘటనను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు మృతదేహాన్ని, మోటార్ సైకిల్‌ను రోడ్డుపై పడవేసి పరారయ్యారు. మృతుడి తల్లి లక్ష్మి అనుమానాస్పద మృతి అని ఫిర్యాదు చేసింది. దీంతో హాజీపూర్ పోలీసులు కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే వేగవంతమైన దర్యాప్తు చేపట్టి, సాంకేతిక పరిజ్ఞానం, ఖచ్చితమైన నిఘా ఆధారంగా అతి తక్కువ సమయంలోనే హత్య కేసును ఛేదించిన మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్ పర్యవేక్షణలో పనిచేసిన పరిశోధనాధికారి జి. రవీందర్,ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, మంచిర్యాల రూరల్ సర్కిల్‌తో పాటు దర్యాప్తులో సహకరించిన కిరణ్ కుమార్ ఎస్ఐ, హాజీపూర్, సదానందం హెడ్ కానిస్టేబుల్, చంద్రశేఖర్ పీసీ, గంగాధర్ పీసీ తదితర సిబ్బందిని అభినందించారు.



## సారూ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్థంబాలను సరి చేయించరూ..

**వికారాబాద్, మే 26(నినాదం)**

జిల్లా పరిధిలోని నవాబుపేట మండలం దాతాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలో పంట పొలాల మధ్య విద్యుత్ స్థంబాలు వరిగి ప్రమాద ఘంటికలు మరోగిస్తునాయని వాటిని సరి చేయించాలని రైతులు విద్యుత్ శాఖ అధికారులకు వేడుకొలుగా విన్న వించుకుంటున్నామని తెలిపారు. ఐదు స్తంభాలు పొంగిపోయాయి వ్యవసాయం చేసుకోవడానికి చాలా ఇబ్బందికరంగా మారాయని పొలాలు దున్నుకోలేక బాధపడుతున్నామని అన్నారు. రైతులపై కనికరం చూపించి ఈ స్థంబాలను సరిచేయించాలని కోరారు. ఇప్పటికే పలుసార్లు విన్నవించామని అన్నారు. అయినా పట్టించుకోవడం లేదని తెలిపారు. పంటలు ఉన్నాయని పట్టించుకోలేదని ప్రస్తుతం సౌకర్యవంతమైన సమయం ఉన్నదని మరమ్మత్తు చేపించాలని కోరారు. లైన్మెన్ కృష్ణ ప్రసాద్ కు కూడా విషయం విధితమేనని ఆయన కూడా అధికారులకు దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారని ఇంతవరకు తర్యచర్య తీసుకోలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. పొలాలను చదును చేసే సమయమని అందుకు ఈ సమస్య అడ్డుగా మారిందని తెలిపారు. విధిలేని పరిస్థితిలో పనులు చేసే సమయంలో ప్రమాదం జరిగితే అందుకు విద్యుత్ శాఖ భాధ్యత వహించాల్సి వస్తుందని రైతులు అన్నారు.

## కన్నీటి మధ్య చివరి కర్తవ్యాలు నిర్వహించిన కూతుళ్లు

**కోదాడ,మే 26(నినాదం):**



మునగాల మండలం మొద్దుల చెరువు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి, కూతురు మృతి చెందిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. రాజయ్యకు కొడుకులు లేకపోవడంతో ఆయన మరో కుమార్తె తండ్రికి తలకొరవి పెట్టి అంత్యక్రియలు నిర్వహించింది. అదే సమయంలో సాగే సునీతకు ఆమె కూతురు తలకొరవి పెట్టి చివరి కార్యక్రమాల్లో పాల్గొంది.సాధారణంగా పురుషులు నిర్వహించే ఈ ఆచారాన్ని కూతుళ్లు స్వయంగా నిర్వహించడం అక్కడున్న వారిని భావోద్వేగానికి గురిచేసింది. తండ్రికి కూతురు, కూతురుకు ఆమె కూతురు చివరి కర్తవ్యాలు నిర్వహించిన తీరు చూసి గ్రామస్తులు కంటతడి పెట్టుకున్నారు. ఈ ఘటన కుటుంబ బంధాల గొప్పతనాన్ని మరోసారి గుర్తు చేసిందని పలువురు పేర్కొన్నారు.

# పాలమూరు-రంగారెడ్డి 90% పూర్తయిందనడం పచ్చి అబద్ధం

**ఉమ్మడి జిల్లా సాగునీటి ప్రాజెక్ట్ లను పూర్తి చేసి తీరుతాం**

**చివరి ఆయకట్టుకు నీళ్లు ఇవ్వడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం**

**బీఆర్ఎస్ హయాంలో పాలమూరు నిర్లక్ష్యం**

**ఒక్క పంపు నడిపి ప్రాజెక్టు పూర్తైందనడం హాస్యాస్పదం**

**బీఆర్ఎస్ నాయకుల తీరును తప్పపట్టిన మంత్రి జూపల్లి**



**నాగర్ కర్నూల్ జిల్లా, మే 26:( నినాదం)**





పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు 90 శాతం పూర్తయ్యాయని బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న వాదనలు పచ్చి అబద్ధాలని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ధ్వజమెత్తారు. కనీస పనులు చేపట్టకుండా, క్షేత్రస్థాయి వాస్తవాలను విస్మరించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న ఆ పార్టీ నాయకులు ఏ ముఖం పెట్టుకుని పాదయాత్రలు చేస్తారని ఆయన తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. మంగళవారం నాగర్ కర్నూలు, వనపర్తి జిల్లాలోని పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ లో ప్రధాన భాగమైన నార్లాపూర్ రిజర్వాయర్ ప్రాజెక్ట్ పంప్ హౌస్, ప్యాకేజీ 3, ఏదుల పంప్ హౌస్, రిజర్వాయర్, కుమ్మెర వద్ద జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరుపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును రూ. 80 వేల కోట్ల అంచనాలతో ప్రారంభించి, రూ. 35 వేల కోట్లు మంజూరు చేసినప్పటికీ, పదేళ్ల కాలంలో ఖర్చు చేసింది కేవలం రూ. 27 వేల కోట్లు మాత్రమేనని మంత్రి వివరించారు. లక్ష కోట్ల రూపాయలతో పూర్తి కావాల్సిన ఈ ప్రాజెక్టును, కనీసం ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థను కూడా నిర్మించకుండా అసంపూర్తిగా వదిలేశారని ఆయన మండిపడ్డారు. ఎన్నికల సమయంలో రాజకీయ లబ్ది కోసం ఆర్భాటంగా ఒక పంపును గంటపాటు నడిపించి చేతులు దులుపుకున్నారని, వాస్తవానికి నార్లాపూర్ వద్ద బిగించాల్సిన తొమ్మిది మోటర్లలో కేవలం మూడింటిని మాత్రమే ప్రస్తుత ప్రభుత్వం బిగించిందని తెలిపారు. మరో ఐదు మోటర్లను తక్షణమే బిగించాల్సి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా 90 టీఎంసీల నికర జలాలను వినియోగంలోకి తెచ్చి, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల పరిధిలోని నాలుగు లక్షల అరవై వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి చెప్పారు. అయితే ఈ పనులు చేపట్టే క్రమంలో మిషన్ భగీరథ నీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని, ఆ సమస్యలను అధిగమిస్తూనే యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. నార్లాపూర్ నుంచి ఉద్దండాపూర్ వరకు ప్రధాన కాలువల పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటన్నింటినీ పూర్తి చేసి మొత్తం 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పట్ల కూడా గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మంత్రి విమర్శించారు. ఈ ప్రాజెక్టు కింద ఉన్న రిజర్వాయర్ల సామర్థ్యం కేవలం 4 టీఎంసీలే ఉండటం వల్ల 40 వేల ఎకరాలకు మించి నీరందే అవకాశం లేదని, 4.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందాలంటే కనీసం 25 టీఎంసీల సామర్థ్యం ఉండాలని ఆయన స్పష్టం చేశారు. కానీ బీఆర్ఎస్ పాలకులు ఒక్క రిజర్వాయర్‌ను కూడా పూర్తి చేయలేదని ఆరోపించారు. జూరాల ప్రాజెక్టు, నెట్టెంపాడు, భీమా, కోయిలా సాగర్ వంటి ప్రాజెక్ట్ లకు కూడా సరైన నీటి నిల్వ సామర్థ్యం లేకపోవడంతో జిల్లా రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతోందని, పాలమూరు ప్రాజెక్టులను విస్మరించి ఇతర ప్రాంతాల ప్రాజెక్టులపైనే ఆ ప్రభుత్వం దృష్టి పెట్టిందని మంత్రి విమర్శించారు. ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్ రెడ్డి వచ్చే వారంలో జిల్లాలో పర్యటించి ప్రాజెక్టుల పరిస్థితులను స్వయంగా సమీక్షిస్తారని మంత్రి తెలిపారు. మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా అచ్చంపేట, వనపర్తి, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాల్లోని చివరి ఆయకట్టు వరకు నీరందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి ఉద్ఘాటించారు. ఈ ప్రాజెక్టు ద్వారా 4.60 లక్షల ఎకరాలకు 4,600 క్యూసెక్కుల నీటిని తరలించేందుకు ఎల్లూరు, సింగోటం, గుడిపల్లి వరకు మట్టికట్టలను సరిచేయాల్సి ఉందని ఆయన చెప్పారు. రైతాంగానికి నీటి ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారాలు చూపుతామని, పాలమూరు-రంగారెడ్డి ప్యాకేజీ-3 పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు.

# ఆర్టీసీ డ్రైవర్ అశోక్ ఉద్యోగం చేసుకోవచ్చు

**జగిత్యాల ప్రతినిధి మే 26 (నినాదం)**




కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ పై పెంచిన ధరలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ధర్నా సందర్భంగా ఆర్టీసీ డ్రైవర్ అశోక్ తన అభిప్రాయాన్ని వెల్లడించడం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ నేపథ్యంలో కరీంనగర్ ఆర్ఎం డ్రైవర్ అశోకుని ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు డిపోకు రావద్దని తిప్పి పంపించేశారు. ఈ అంశంపై సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత పిల్లుబికింది. ఆర్టీసీ డ్రైవర్ అశోక్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసినందుకు డ్రైవర్ ఉద్యోగం నుంచి తొలగించడం ఆర్టీసీ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రతిపక్ష నాయకులు అశోక్ ఇంటికి వెళ్లి సానుభూతి వ్యక్తం చేశారు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇది గమనించిన రాష్ట్ర ప్రభుత్వం పెద్దలు చిలికి చిలికి గాలివాన అవుతుందేమోనని వెనక్కి తగ్గారు ఈ నేపథ్యంలో జిల్లా సంక్షేమ శాఖ మంత్రి అట్లూరి లక్ష్మణ్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ డ్రైవర్ రైతులు పడుతున్న అవస్థలను దృష్టిలో పెట్టుకొని ముందుగా వడ్లు మొక్కలు కొనుగోలు చేయాలని ఆపై డీజిల్ వ్యవహారంపై కొట్లాడవచ్చని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇది ప్రభుత్వాన్ని కించపరిచినట్టు కాదని ఇందుకోసం ఆర్టీసీ అధికారులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు వెళ్లలేదని మంత్రి వివరించారు. ఆర్టీసీ డ్రైవర్ అశోక్ ఉద్యోగానికి వచ్చిన ఇబ్బందులు ఏం లేవని ఈరోజు నుంచి ఉద్యోగం చేసుకోవచ్చని స్పష్టం చేశారు. కేవలం కొంతమంది వ్యక్తులు ఒక ఫిర్యాదు ద్వారా కరీంనగర్ ఆర్ఎంస్ స్పందించి డిఎం తో అశోకుని విధుల నుంచి తొలగించినట్లు చెప్పారు అన్నారు. డ్రైవర్ అశోక్ ను విధుల నుంచి తొలగించలేదని సమాచారంలో ఏర్పడిన ఇబ్బందుల వాళ్ళని ఇలాంటి సంఘటన చోటుచేసుకుందని అశోక్ నిక్షేపంగా ఉద్యోగం చేసుకోవచ్చని మంత్రి స్పష్టం చేశారు. దీంతో అశోక్ కుటుంబంలో సంతోషం వెల్లి వెలిసింది.

> **వ్యక్తిగత అభిప్రాయాన్ని వెల్లడించడం ధర్మమే**
> **ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు ఇవ్వలేదు**
> **జిల్లా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



# బుచ్చిబాబు కోసం పెద్దిలో నటించా: దివ్యేందు





'పెద్ది' డైరెక్టర్ బుచ్చిబాబుపై ప్రశంసలు కురిపించారు బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ. ఆయన కోసమైనా 'పెద్ది' చేయాలని అనుకున్నట్లు చెప్పారు. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కించిన చిత్రం 'పెద్ది'. ఇందులో దివ్యేందు శర్మ కీలక పాత్రలో నటించారు. జూన్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రచారంలో భాగంగా దివ్యేందు ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. ఈ సినిమా అంగీకరించడానికి కారణం వెల్లడించారు. తాను ఉత్తరాఖండ్‌లో షూటింగ్‌లో ఉన్నప్పుడు ఈ చిత్ర బృందం నుంచి ఫోన్ వచ్చింది. వీలున్నప్పుడు వస్తాను అని చెప్పా. తర్వాత 'మిమ్మల్ని కలవాలి' అని బుచ్చిబాబు చాలా మెసేజ్‌లు పెట్టారు. దీంతో నేను ఆ షూట్ మధ్యలోనే ఆపేసి ఎంతోసేపు ప్రయాణించి చాలా కష్టపడి అక్కడినుంచి ఇక్కడికి వచ్చాను. బుచ్చిబాబును చూసి ఆశ్చర్యపోయాను. ఎంతో ప్రేమతో వ్యవహరించారు. కళకు ఎంత గౌరవం ఇస్తారో చూశాను. నా పాత్రను వివరించేటప్పుడే నిర్ణయించుకున్నా. ఈ సినిమా ఎలా ఉన్నా బుచ్చిబాబు కోసం చేయాలి అని. వెంటనే ఓకే చేశా. ఆయన నన్ను అంత ప్రభావితం చేశారు' అని దివ్యేందు తెలిపారు. ఇక పెద్ది కథ గురించి మాట్లాడుతూ..'స్టోరీ చూసి షాక అయ్యాను. ఎంత గొప్పగా రాశారో అనుకున్నా. ఎన్నో ట్విస్ట్‌లు, గొప్ప గొప్ప పాత్రలు ఉన్నాయి. గుర్తింపు కోసం ఎంత యుద్ధమైనా చేయొచ్చని ఈ సినిమా చూశాక అర్థం అవుతుంది. 'పెద్ది' తన గుర్తింపు కోసం ఎంతో పోరాడతాడు. ఆ అంశం నాకు చాలా నచ్చిందని చెప్పారు.

# విశ్వంభర విడుదల తేదీపై అస్పష్టత

మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. మెగాస్టార్ అభిమానులను ఎక్కువగా కలవరపెడుతున్న విషయం మాత్రం 'విశ్వంభర' మూవీ గురించే. ఎందుకంటే ఈ ప్రాజెక్ట చాలా కాలం క్రితమే ప్రారంభమై, షూటింగ్ కూడా పూర్తయిన దశకు చేరుకున్నప్పటికీ.. ఇప్పటివరకు విడుదల తేదీపై స్పష్టత రాకపోవడం అభిమానుల్లో అనుమానాలు పెంచుతోంది. దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న 'విశ్వంభర' మెగాస్టార్ కెరీర్‌లో అత్యంత భారీ ఫాంటసీ చిత్రాల్లో ఒకటిగా రూపొందుతోంది. విజువల్ ఎఫెక్ట్స్, గ్రాండియర్ సెట్స్, భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి.



ఇప్పటికే షూటింగ్ దాదాపు పూర్తయిందని వార్తలు వచ్చినప్పటికీ, సినిమా రిలీజ్ విషయంలో మాత్రం ఎలాంటి అధికారిక ప్రకటన లేకపోవడం అభిమానులను నిరాశకు గురిచేస్తోంది. మొదట ఈ సినిమాను సమ్మర్ రిలీజ్‌గా తీసుకురానున్నట్లు ప్రచారం జరిగింది. అయితే ప్రస్తుతం పరిస్థితులు చూస్తుంటే ఆ ప్లాన్ అమలు అయ్యే అవకాశాలు కనిపించడం లేదు. సినిమా నుంచి పెద్దగా అప్‌డేట్లు కూడా లేకపోవడంతో సోషల్ మీడియాలో ఫ్యాన్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'విశ్వంభర' ఆలస్యానికి ప్రధాన కారణం విజువల్ ఎఫెక్ట్స్ పనులేనని టాక వినిపిస్తోంది. ఫాంటసీ జానర్ కావడంతో సినిమాకు భారీ స్థాయిలో అవసరం పడుతోంది. ముఖ్యంగా ఫాంటసీ జానర్‌లో వస్తున్న 'విశ్వంభర' పై మొదటి నుంచే ప్రత్యేక ఆసక్తి నెలకొంది. కానీ వరుసగా కొత్త ప్రాజెక్టులు ప్రారంభమవుతుండటం, 'విశ్వంభర'పై మాత్రం నిశ్శబ్దం కొనసాగడం ఫ్యాన్స్‌లో కొంత అసంతృప్తి పెంచుతోంది.

# ముదిరిన డాన్-3 వివాదం

## రణ్‌వీర్‌పై సినీ ఎంప్లాయిస్ నిషేధం





'ధురంధర్' రెండు భాగాలతో సూపర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకుని కొన్ని రోజులుగా టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారారు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు రణ్‌వీర్. ఇప్పుడు ఆయన మరోసారి వార్తల్లో నిలిచారు. కొన్ని రోజులుగా చర్చనీయాంశమైన 'డాన్ 3' వివాదం ఇప్పుడు ముదిరింది. ఏకంగా ఈ అగ్ర హీరోపై బ్యాన్ విధించే పరిస్థితికి వచ్చింది. అమితాబ్ బచ్చన్, షారుఖ్ ఖాన్ తర్వాత డాన్ పాత్రను పోషించాల్సిన రణ్‌వీర్‌పై 'ఫెడరేషన్ ఆఫ్ వెస్టన్ ఇండియా సినీ ఎంప్లాయాస్'(ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) మూడేళ్ల పాటు నిషేధం విధించింది. దీంతో ఆయన హాట్ టాపిక్ గా మారారు. 2023లో ఫర్హాన్ అక్తర్ ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రణ్‌వీర్ సింగ్ హీరోగా 'డాన్ 3'ని అధికారికంగా ప్రకటించింది. అప్పుడే ప్రమోషనల్ వీడియోను విడుదల చేసి పెద్ద సంచలనం సృష్టించింది. అయితే సినిమా తీయడంలో కొంత ఆలస్యం కావడం.. స్క్రిప్ట్‌లో సమస్యలు తలెత్తడంతో రణ్‌వీర్ ఈ చిత్రం నుంచి వైదొలిగినట్లు వార్తలు వచ్చాయి. రణ్‌వీర్ తన డాన్ పాత్రను మరింత డార్క్, హింసాత్మకంగా చూపించాలని కోరుకున్నట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలు వచ్చాయి. అయితే ఫర్హాన్ అక్తర్ పాత్రను మార్చడానికి నిరాకరించడంతో ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. షుఉటింగ్ షెడ్యూల్ ఆలస్యం కావడంతో రణ్‌వీర్ అసహనం వ్యక్తంచేస్తూ ఈ ప్రాజెక్ట నుంచి వైదొలిగినట్లు బాలీవుడ్ కథనాలు పేర్కొన్నాయి. 'డాన్ 3' నుంచి తాను వైదొలిగిన తర్వాత దర్శకుడు ఫర్హాన్ అక్తర్‌కు రణ్‌వీర్ రూ.10కోట్లు ఆఫర్ చేసినట్లు వార్తలు వచ్చాయి. అలాగే తన తదుపరి చిత్రం 'ప్రళయ్'లో అక్తర్ నిర్మాణసంస్థకు వాటా ఇవ్వడానికి కూడా ఈ హీరో అంగీకరించారని టాక్ వినిపించింది. అయితే దీనిపై ఎవరూ అధికారికంగా స్పందించలేదు. ఒకవైపు ఈ వార్తలు వస్తోన్న తరుణంలోనే ఈ వివాదంపై ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రణ్‌వీర్ సింగ్‌పై రూ.45 కోట్ల నష్టపరిహారం కోరుతూ లీగల్ నోటీసు జారీ చేసింది

## చెన్నై లవ్‌స్టోరీ నుంచి నిను వదలనే..

# సెకండ్ సింగిల్ విడుదల

నిమిషమైనా నిను వదలనే.. అంటూ తన మ్యూజికతోమ్యాజిక క్రియేట్ చేశారు మణిశర్మ. కిరణ్ అబ్బవరం ప్రధానపాత్రలో రవి నంబూరి దర్శకత్వంలో రానున్న చిత్రం 'చెన్నై లవ్‌స్టోరీ'. తాజాగా ఈసినిమా నుంచి సెకండ్ సింగిల్‌ను టీమ్ విడుదల చేసింది. 'నను నేను వదిలినా.. నిను వదలనే..' అంటూ సాగే లిరిక్స అనంత్ శ్రీరామ్ అందించగా.. జావెద్ అలీ తన గాత్రంతో మరోస్థాయికి తీసుకెళ్లారు. యూత్‌కు కనెక్ట అయ్యేలా ఉన్న ఈ పాటను తీర్చిదిద్దారు. తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్న యువ నటి శ్రీ గౌరి ప్రియ. వరుసగా విభిన్న పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈ తెలుగమ్మాయి ప్రస్తుతం హీరో కిరణ్ అబ్బవరంతో కలిసి 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రంలో నటిస్తోంది. తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన 'వదలనే' పాట లాంచ్ ఈవేంట్‌లో శ్రీ గౌరి ప్రియ చేసిన వ్యాఖ్యలు అందరినీ భావోద్వేగానికి గురి చేశాయి. ఈ పాటలోని లిరిక్సను ఎవరికి అంకితం చేస్తారని ప్రశ్నించగా, శ్రీ గౌరి ప్రియ సమాధానం ఇస్తూ ఒక్కసారిగా భావోద్వేగానికి లోనైంది. నిజంగా చెప్పాలంటే మా అమ్మ నన్ను వదిలేసి మూడేళ్లు అయింది. కానీ తను నన్ను అసలు వదల్లేదు. నేను కూడా తనను ఎప్పటికీ వదలను. ఈ విషయం తనకు తెలుసు, నాకు తెలుసు. ఈ పాటలోని లైన్స్‌ను మా అమ్మకే అంకితం చేస్తున్నాను' అని చెప్పింది. ఆమె మాటలు విన్న వెంటనే కార్యక్రమంలో ఉన్నవారు కొద్దిసేపు నిశ్శబ్దంగా మారిపోయారు. సోషల్ మిడియాలో ఈ వీడియో వేగంగా వైరల్ అవుతోంది. మూడేళ్ల క్రితం శ్రీ గౌరి ప్రియ తల్లి వసుంధర క్యాన్సర్ కారణంగా మరణించారు. తల్లితో తనకు చాలా ఆత్మీయ అనుబంధం ఉండేదని గౌరి ప్రియ పలు సందర్భాల్లో వెల్లడించింది. ఆమెను కేవలం తల్లిగానే కాకుండా ఒక మంచి స్నేహితురాలిగా భావించేదని చెప్పింది.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787